

## కనకదుర్గమ్మకు సీఎం చంద్రబాబు దంపతులు చీర, సారె సమర్పణ

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ పాలక మండలి, అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దసరా ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు. ఆరు రోజుల్లోనే ఎనిమిది లక్షల మంది అమ్మవారిని దర్శించుకున్నారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు భక్తిశ్రద్ధలతో తరలివచ్చి అమ్మవారి ఆశీస్సులు పొందుతున్నారు. విజయవాడ ఉత్సవ్ 2.0, జాతీయ సరస్ మేళా కూడా ఇక్కడే జరుగుతున్నాయి. దేశంలో ప్రముఖంగా నిర్వహించే ఉత్సవాల్లో విజయవాడ దసరా ఉత్సవాలు చోటు సంపాదించుకోవడం శుభపరిణామం. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించాను. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలని ఆకాంక్షించాను. ఆంధ్రప్రదేశ్‌ను ఆరోగ్యకరమైన, సంపన్నమైన, సంతోషకరమైన సమాజంగా తీర్చిదిద్దాలని అమ్మవారిని కోరుకున్నాను' అని సీఎం చంద్రబాబు అన్నారు.

## మద్యం సీసాలు పెట్టి అరెస్ట్ చేశారు..



రవికుమార్ పోటీలో ఉంటే అధికార కూటమికి ఎందుకంత భయమని ఆయన ప్రశ్నించారు. తప్పుడు కేసులు పెట్టి, ఎన్నికలను ఏకగ్రీవం చేసుకోవడానికే ఈ అరెస్ట్ చేశారని విమర్శించారు. రవికుమార్ ఆర్థికంగా బలమైన కుటుంబానికి చెందినవారని, ఆయన తండ్రి సాంబయ్య గతంలో ఛైర్మన్‌గా పనిచేశారని గుర్తుచేశారు. వైసీపీ అభ్యర్థులను ప్రభుత్వం భయభ్రాంతులకు గురిచేస్తోందని అంబటి మండిపడ్డారు. నామినేషన్లకు అవసరమైన సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. ఇదే ప్రభుత్వం శాశ్వతంగా ఉండదని, పోలీసుల తీరు సరికాదని హెచ్చరించారు. రక్షించాల్సిన వారే భక్షించేలా వ్యవహరిస్తున్నారని అన్నారు. వెంటనే రవికుమార్‌ను విడుదల చేసి, స్వేచ్ఛగా పోటీ చేసే అవకాశం కల్పించాలని, పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.

### ప్రమాద బాధితులకు సత్వర చికిత్స..

## ప్రాణరక్షణే లక్ష్యం

ఇందులో భాగంగా 'ప్రీ-హాస్పిటల్ నోటిఫికేషన్' (పీహెచ్ఎన్) విధానంతో పాటు రాష్ట్ర ట్రామా రిజిస్ట్రీని అందుబాటులోకి తెచ్చింది ఈ మేరకు అదనపు వైద్య విద్యా సంచాలకులు డాక్టర్ సత్యనారాయణ మూర్తి, ట్రామా, బర్న్స్ రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ సుమితా శంకర్ శనివారం ఒక ప్రకటనలో వివరాలు వెల్లడించారు.

**ఆసుపత్రికి చేరకముందే వైద్య బృందాలకు సమాచారం**

ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తీసుకువచ్చే సమయంలో విలువైన సమయం వృథా కాకుండా ముందస్తు సమాచార విధానాన్ని అమలు చేస్తున్నారు. ఇకపై 108 అంబులెన్స్ సిబ్బంది బాధితుడు ఆసుపత్రికి చేరకముందే సంబంధిత ఆసుపత్రికి సమాచారం అందిస్తారు. దీంతో బాధితుడు అక్కడికి చేరుకునే సమయానికే అత్యవసర వైద్య బృందం, బ్లడ్, ఎక్స్‌రే, స్కానింగ్ సదుపాయాలు, శస్త్రచికిత్స గది సిద్ధంగా ఉండేందుకు వీలవుతుంది

**గోల్డెన్ అవర్.. ప్రాణాలు కాపాడే కీలక సమయం :** ప్రమాదం జరిగిన మొదటి గంటను 'గోల్డెన్ అవర్'గా పరిగణిస్తారు. ఈ సమయంలో బాధితుడికి సకాలంలో చికిత్స అందించడం ప్రాణాలు కాపాడటంలో కీలకమని అధికారులు తెలిపారు. కొత్తగా ప్రవేశపెడుతున్న పీహెచ్ఎన్ విధానం ద్వారా ఆసుపత్రి సిబ్బంది ముందుగానే అప్రమత్తమై, అవసరమైన వైద్య ఏర్పాట్లు చేసుకునేందుకు అవకాశం కలుగుతుంది. తద్వారా బాధితుడు ఆసుపత్రికి చేరిన వెంటనే చికిత్స ప్రారంభించేందుకు వీలవుతుంది.

**ప్రమాదాల నివారణకు రాష్ట్ర ట్రామా రిజిస్ట్రీ :** సుప్రీంకోర్టు ఆదేశాలు, కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్ర ట్రామా రిజిస్ట్రీని ప్రారంభించారు. ప్రభుత్వ వైద్య సంస్థలకు వచ్చే ప్రతి ప్రమాద బాధితుడి వివరాలను ఇందులో డిజిటల్ విధానంలో నమోదు చేస్తారు. ఈ సమాచారం ఆధారంగా రాష్ట్రంలో తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించేందుకు వీలవుతుంది.

గుర్తించిన ప్రాంతాల్లో రహదారి భద్రతా చర్యలు చేపట్టడంతో పాటు, అవసరమైన చోట అత్యవసర వైద్య సదుపాయాలను సమకూర్చేందుకు ఈ వివరాలు ఉపయోగపడతాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ వైద్య కేంద్రాల్లో అత్యవసర, ప్రమాద, ట్రామా సేవలను మరింత క్రమబద్ధంగా నిర్వహించేందుకు ఈ రిజిస్ట్రీ దోహదపడుతుంది.

**వైద్య సిబ్బందికి ప్రత్యేక శిక్షణ :** కొత్త విధానాలను సమర్థంగా అమలు చేసేందుకు రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న 108 అత్యవసర వైద్య సాంకేతిక నిపుణులు (ఈఎంటీలు), ట్రయాజ్ నర్సులకు డీఎంఈ కార్యాలయం ప్రత్యేక శిక్షణ అందిస్తోంది. ప్రతి ఆసుపత్రిలో ట్రయాజ్ నర్సుతో పాటు ఒక నర్సు సమన్వయకర్తను గుర్తించి, ఆసుపత్రి నోడల్ అధికారి పర్యవేక్షణలో బాధ్యతలు అప్పగించనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 45 నిమిషాల ప్రాథమిక శిక్షణ ప్రారంభించారు. రానున్న రోజుల్లో తదుపరి శిక్షణ కార్యక్రమాల ద్వారా సిబ్బందికి అవసరమైన అవగాహనను మరింత పెంచనున్నారు.

**ప్రమాదం జరిగిన వెంటనే 108కు ఫోన్ చేయాలి :** రహదారి లేదా ఇతర ప్రమాదాలు జరిగిన వెంటనే ఆలస్యం చేయకుండా 108 నంబరుకు ఫోన్ చేయాలని అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అంబులెన్స్, సహాయక బృందాలు వచ్చే వరకు బాధితుడి వద్దే ఉండి, అతడికి మానసిక ధైర్యాన్ని అందించాలని కోరారు.

# గంజాయి మాఫియాపై అనకాపల్లి పోలీసుల ఉక్కుపాదం

**ఘటన వివరాలు:** గురువారం కశింకోట పోలీస్ స్టేషన్ సి.ఐ (CI) ఎ.స్వామి నాయుడుకి అందిన ముందస్తు, విశ్వసనీయ సమాచారం మేరకు ఈగల్ టీమ్ మరియు కశింకోట పోలీస్ సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఎన్‌హెచ్-16 (చీఎ-16) జాతీయ రహదారిపై కశింకోట సమీపంలోని న్యూ హోటల్ ఎదురుగా ముమ్మర వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అటుగా వచ్చిన +జీ 01 ఙ్గ 7861 నంబర్ గల కంటైనర్ లారీని ఆపగా, అందులోని ఇద్దరు వ్యక్తులు పోలీసులను గమనించి పారిపోయేందుకు యత్నించారు. అప్రమత్తమైన పోలీసులు వారిని వెంబడించి పట్టుకున్నారు.

**వారిలో లారీ డ్రైవర్ సద్దాం హుస్సేన్ కాగా, మరొకరు 17 ఏళ్ల మైనర్ బాలుడు.**

రహస్య క్యాబిన్‌లో భారీ నిల్వలు:లి ?కంటైనర్ లారీని నిశితంగా పరిశీలించిన పోలీసులకు విస్తుపోయే నిజాలు వెలుగుచూశాయి. ఎవరికీ అనుమానం రాకుండా డ్రైవర్ సీటు వెనుక భాగంలో ప్రత్యేకంగా ఒక రహస్య క్యాబిన్‌ను నిర్మించారు. అందులో దాచిన 28 ప్యాకెట్ల (మొత్తం 140 కేజీలు) గంజాయిని, రవాణాకు ఉపయోగించిన కంటైనర్ లారీని, ఒక ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్ మరియు ఒక కీప్యాడ్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రాజస్థాన్ టు ఒడిశా లింకులు

**ముమ్మర దర్యాప్తు:** ప్రాథమిక విచారణలో రాజస్థాన్‌కు చెందిన కిసాన్ ఏ కిషన్ జీ ఏ కిషన్ జాట్ అనే ప్రధాన సూత్రధారి ఆదేశాల మేరకు వీరు ఒడిశా రాష్ట్రం నుంచి గుర్తుతెలియని వ్యక్తుల వద్ద గంజాయిని స్వీకరించినట్లు తేలింది. అనంతరం



మర్రిపాలెం టోల్ ప్లాజా సమీపంలోని లే-బై (ఝఎ-ఎఎ) రోడ్డులో లారీ క్యాబిన్‌లో దాచి, రాజస్థాన్‌కు తరలించేందుకు పక్కా ప్రణాళిక వేసినట్లు వెల్లడైంది. ఈ అంతర్రాష్ట్ర గంజాయి నెట్‌వర్క్‌లో ఉన్న ఇతర నిందితులు, సరఫరాదారుల వివరాలను వెలికితీసేందుకు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు వేగవంతం చేశారు.

**న్యాయపరమైన చర్యలు:** పట్టుబడిన ప్రధాన నిందితుడు సద్దాం హుస్సేన్‌ను అరెస్ట్ చేసి విశాఖపట్నం సెంట్రల్ జైలుకు రిమాండ్ నిమిత్తం తరలించారు. చట్టంతో సంఘర్షణలో ఉన్న బాలుడిని (CICL) విశాఖపట్నంలోని జువైనల్ జస్టిస్ బోర్డు ఎదుట హాజరుపరిచారు.

ఈ సందర్భంగా లిజిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాను గంజాయి, మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పోలీస్ శాఖ పనిచేస్తోంది. జిల్లా మీదుగా అక్రమ రవాణా చేసేందుకు ఎంతటి అధునాతన మార్గాలు ఎంచుకున్నా పోలీసుల డేగ కన్ను నుంచి తప్పించుకోలేరు. గంజాయి సాగు, నిల్వ, రవాణా, కొనుగోలు లేదా విక్రయాలలో ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ భాగస్వాములయ్యే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. అలవాటుపడిన నేరగాళ్లపై పీడీ యాక్ట్ (ాణ ాచ్) నమోదు చేయడంతో పాటు వారి అక్రమ ఆస్తులను జప్తు చేసే ప్రక్రియను కూడా వేగవంతం చేస్తాం. యువత భవిష్యత్తును నాశనం చేసే మాదకద్రవ్యాలపై సమాజం కూడా పోరాడాలి. ప్రజలు లేదా వాహనదారులు తమ పరిసరాల్లో గంజాయి రవాణాపై ఏ సమాచారం ఉన్నా నిర్భయంగా పోలీసులకు తెలపవచ్చు; సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయి." సకాలంలో స్పందించి చాకచక్యంగా గంజాయి రవాణాను అడ్డుకున్న కశింకోట సిఐ ఎ.స్వామి నాయుడు ని, ఈగల్ టీమ్ సభ్యులను, కశింకోట పోలీస్ సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి ప్రశంసా పత్రాలు నగదు రివార్డులను అందజేశారు. ఈ మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ తో పాటు అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు, అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ పీ.వీ.వీ. నరసింహారావు, ఎస్.బి డీఎస్పీ వి.బాబ్జీరావు, ఎస్.బి సిఐ బాల సూర్యారావు, సిఐ స్వామి నాయుడు, ఈగల్ టీం ఇన్స్పెక్టర్ నారాయణరావు ఇతర అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## మిథున్ రెడ్డి కాన్వాయ్ పై దాడి ఒక రాక్షస క్రీడ..

రాష్ట్రంలో 'జంగిల్ రాజ్' నడుస్తోందని, చంద్రబాబుకు హింస కొత్తేమీ కాదని జగన్ విమర్శించారు. పార్టీ లోక్‌సభాపక్ష నేతకు కూడా రక్షణ కల్పించలేని దుస్థితి నెలకొందన్నారు. ఓటమి భయంతోనే అధికార కూటమి దాడులకు దిగుతోందని, స్వేచ్ఛగా ఎన్నికలు జరిపే ఉద్దేశం వారికి లేదని ఆరోపించారు. కేంద్ర బలగాల పర్యవేక్షణలోనే ఎన్నికలు సజావుగా సాధ్యమవుతాయని జగన్ స్పష్టం చేశారు. మరోవైపు, మిథున్ రెడ్డితో జగన్ ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు. పుంగనూరులో మిథున్ రెడ్డి కాన్వాయ్‌ను టీడీపీ కార్యకర్తలు అడ్డుకుని రాళ్లు, కర్రలతో దాడికి పాల్పడ్డారని వైసీపీ వర్గాలు తెలిపాయి. ఈ ఘటనలో పలు వాహనాలు ధ్వంసం అయ్యాయని, మిథున్ రెడ్డి భద్రతా సిబ్బందికి గాయాలైనట్టు వైసీపీ వర్గాలు ఆరోపించాయి. అనంతరం అధికారులు ఆయన్ను నామినేషన్ కేంద్రంలోని ఒక ప్రత్యేక గదికి తరలించారు. ఈ దాడి సమయంలో పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారని వైసీపీ ఆరోపించింది.

### ప్రతి రక్తదాతా..

## జీవదాతే

మొదటి పేజీ తరువాయి

ఇది కేవలం భవనం మాత్రమే కాదని, పేద రోగుల జీవితాలకు వారధి అని పేర్కొన్నారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. స్వర్గీయ ఎన్టీఆర్‌కు ప్రజలంటే అపారమైన ప్రేమ ఉండేదని, ప్రజల కోసం పనిచేయడమే ఆయన జీవితంలో భాగమని భువనేశ్వరి తెలిపారు. సామాన్యుడి జీవన ప్రమాణాలు మెరుగుపడాలని, సమాజంలోని చివరి వ్యక్తికి సైతం మెరుగైన జీవితం అందాలని ఆయన ఆకాంక్షించేవారని చెప్పారు. ఎన్టీఆర్ ఆలోచనలు, ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్‌ను స్థాపించారని వివరించారు. 29 ఏళ్లుగా ఆరోగ్యం, విద్య, మహిళా సాధికారత, జీవనోపాధి, స్వచ్ఛమైన తాగునీరు తదితర రంగాల్లో ట్రస్ట్ సేవలందిస్తోందన్నారు. ఇన్ని సేవలు చేసినప్పటికీ, ఇంకా చేయాల్సింది ఎంతో ఉందని తాను నమ్ముతున్నట్లు చెప్పారు. మేనేజింగ్ ట్రస్టీగా ఈ సేవా కార్యక్రమాల్లో భాగస్వామిని కావడం తన అదృష్టమన్నారు. ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఏ ఒక్కరికో పరిమితమైన సంస్థ కాదని, సేవ చేయాలనే మనసున్న ప్రతి ఒక్కరిదని పేర్కొన్నారు. ప్రజల నమ్మకంతో నిర్మించిన ఈ సేవా సంస్థలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని కోరారు.

**ప్రజల వద్దకే వైద్య సేవలు :** ఆరోగ్య రంగంలో ట్రస్ట్ విస్తృతంగా సేవలందిస్తోందని నారా భువనేశ్వరి చెప్పారు. సంజీవని మొబైల్ క్లినిక్స్ ద్వారా ప్రజల వద్దకే వైద్య సేవలను తీసుకెళ్తున్నామని, రెండు తెలుగు రాష్ట్రాల్లోని అన్ని నియోజకవర్గాల్లో పేదలకు వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఎన్టీఆర్ ఆరోగ్య రథాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా గిరిజన, మారుమూల ప్రాంతాల్లో ఉచితంగా వైద్యం, ఔషధాలు అందిస్తున్నట్లు వివరించారు. ఎన్టీఆర్ సుజల కార్యక్రమం ద్వారా వివిధ ప్రాంతాల్లో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసి స్వచ్ఛమైన తాగు నీటిని అందిస్తున్నామని చెప్పారు.

ఎంత మందికి సేవలందించామనేది అంకెల్లో లెక్కించడం కంటే, ప్రజల జీవితాల్లో ఎంతటి మార్పు తీసుకు రాగలిగాం అన్నదే తమకు ముఖ్యమని స్పష్టం చేశారు. విద్య రంగంలోనూ సేవలను విస్తరిస్తున్నామని భువనేశ్వరి తెలిపారు. పేద విద్యార్థులను భవిష్యత్తులో సమాజానికి అవసరమైన వ్యక్తులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. మహిళా సాధికారత కోసం ట్రస్ట్ విస్తృతంగా పని చేస్తోందని, మహిళలకు కేవలం శిక్షణ ఇవ్వడమే కాకుండా కుటుంబానికి అండగా నిలవగలం అనే ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తున్నామని వివరించారు. స్త్రీశక్తి హస్తకళా స్టోర్ ద్వారా మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రకృతి విపత్తుల సమయంలోనూ ట్రస్ట్ బాధితులకు అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. వరదలు, తుఫాన్లతో పాటు కోవిడ్ సమయంలోనూ విస్తృతంగా సేవలు అందించామని చెప్పారు. కష్ట కాలంలో ఒక మనిషికి మరో మనిషి అండగా నిలవాలన్నదే తమ ఆలోచన అని తెలిపారు.

**తలసేమియా చిన్నారులకు బాసటగా :** తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులకు నిరంతరం రక్తం అవసరమని, ఈ పరిస్థితి వారి కుటుంబాలకు తీవ్ర ఆందోళన కలిగిస్తుందని భువనేశ్వరి అన్నారు.

ఈ సమస్యను అర్థం చేసుకుని గత ఏడాదే తలసేమియా చిన్నారులకు ఉచితంగా రక్తం అందించే కార్యక్రమాన్ని హైదరాబాద్ లో ప్రారంభించామని తెలిపారు. తలసేమియా కేర్ సెంటర్ ద్వారా ఉచిత రక్త మార్పిడి, అవసరమైన ఫిల్టర్లు, ఔషధాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. త్వరలో విజయవాడలోనూ తలసేమియా కేంద్రాన్ని ప్రారంభిస్తామని మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి తెలిపారు. గుంటూరు, విశాఖపట్నం, తిరుపతి, రాజమహేంద్రవరంలో ఇప్పటికే రక్తనిధి కేంద్రాలు పనిచేస్తున్నాయని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో కీలక కూడలిగా ఉన్న విజయవాడలోనూ ఆధునిక రక్తనిధి కేంద్రాన్ని ప్రారంభించామని తెలిపారు. అత్యవసర సమయాల్లో రక్తం కోసం ఇబ్బందులు పడే రోగులకు ఈ కేంద్రం అండగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రక్తదానం ద్వారా ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చని భువనేశ్వరి అన్నారు. ప్రతి రక్తదాతా ఒక జీవదాతేనని పేర్కొన్నారు. విజయవాడలో ప్రారంభించిన రక్తనిధి కేంద్రం ద్వారా మరింత మందికి సేవలందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అనంతపురంలో నెల రోజుల్లో రక్తనిధి కేంద్రాన్ని ప్రారంభించే ఆలోచన ఉందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్‌కు విరాళాలు అందించిన దాతలను, సేవలందించిన వారిని నారా భువనేశ్వరి సత్కరించారు. రక్తదానం, వైద్య సేవల ద్వారా మరింత మంది పేదలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ ట్రస్ట్ సీఈఓ రాజేంద్ర, సీఓఓ గోపి పాల్గొన్నారు.

### ఓటమి భయంతోనే పుంగనూరు, రాయచోటిలో

## గొడ్డలి పార్టీ గొడ్డలి రాజకీయం

మొదటి పేజీ తరువాయి

రాయచోటిలో మీడియాతో మాట్లాడిన ఆయన రాయచోటి, పుంగనూరులో టీడీపీ నేతలపై వైసీపీ చేసిన దాడులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...

"ఈరోజు పుంగనూరు, రాయచోటిలో జరిగిన సంఘటనలను ప్రజలందరూ సోషల్ మీడియా, మీడియా ద్వారా గమనిస్తున్నారు. అయితే, ఈ ఘటనల వెనుక ఉన్న రాజకీయ పరిస్థితులను కూడా ప్రజలు అర్థం చేసుకోవాలి. 2021లో వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి అధికార బలం, అంగబలం, అర్థబలంతో పాటు పుంగనూరులో పెద్దిరెడ్డి కుటుంబం సాగించిన దౌర్జన్యాలను ప్రజలు చూశారు. ప్రతిపక్ష అభ్యర్థులను నామినేషన్లు వేయనివ్వకుండా అడ్డుకోవడం, బెదిరించడం, దాడులు చేయడం, దుస్తులు చింపి అవమానించడం వంటి ఘటనలు జరిగాయి. అధికార యంత్రాంగాన్ని సైతం ఉపయోగించుకుని ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారు. కుప్పం మున్సిపాలిటీలోనూ అక్రమాలకు పాల్పడి అధికారాన్ని దక్కించుకున్నారు. అలాంటి పరిస్థితుల నుంచి ఈరోజు పుంగనూరు, రాయచోటిలో ప్రజల నుంచి ప్రతిఘటన ఎదురవుతున్నదంటే, గతంలో ఆ కుటుంబాలు, నాయకుల వల్ల ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజల్లో ఎంతటి అసంతృప్తి ఉందో అర్థం చేసుకోవాలి. ప్రజల ఆగ్రహం ఏ స్థాయికి చేరుతుందో ఈ ఘటనలు తెలియజేస్తున్నాయి" అని అన్నారు.

**గొడ్డలి సంస్కృతే పెద్దిరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి విధానం :** "తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలు, మా నాయకుడి విధానం అసాంఘిక కార్యకలాపాలకు చోటు ఇవ్వవు. ప్రభుత్వం మా చేతిలో ఉందని అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరించాలనుకుంటే రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లోనూ ఇలాంటి ఘటనలు జరిగేవి. కానీ, ఎన్నికల ప్రక్రియ రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల కమిషన్ నియమావళికి అనుగుణంగా, నిష్పక్షపాతంగా కొనసాగుతోంది. కొన్ని ప్రాంతాల్లో చోటుచేసుకున్న ఘటనలకు ప్రభుత్వాన్ని, తెలుగుదేశం పార్టీని బాధ్యులను చేయడం సరికాదు. గత రెండు రోజులుగా పుంగనూరులో పెద్దిరెడ్డి కుటుంబం, రాయచోటిలో గడికోట శ్రీకాంత్ రెడ్డి తమ రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకు



ప్రయత్నిస్తున్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ స్థానాలను కోల్పోతే జగన్మోహన్ రెడ్డి వద్ద తమ ప్రాధాన్యత తగ్గిపోతుందనే భయంతో, తమ రాజకీయ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఈ ఘటనలను ఇతరులపైకి నెట్టే ప్రయత్నం చేస్తున్నారు" అని దుయ్యబట్టారు.

**కిరాయి వ్యక్తులతో గొడ్డలి పార్టీ గూండాయిజం :** "పుంగనూరులో జరిగిన ఘటనకు సంబంధించి కర్ణాటక నుంచి కిరాయి వ్యక్తులను తీసుకొచ్చి, సుమారు 40 వాహనాలతో మిథున్ రెడ్డి కాన్వాయ్‌లో వచ్చిన వారు తెలుగుదేశం పార్టీ కార్య కర్తలపై దాడులకు పాల్పడ్డారని ఆరోపణలు ఉన్నాయి. దీంతో గతంలో తమ కుటుంబాలు ఎదుర్కొన్న ఇబ్బందులపై ఆగ్రహం తో స్థానికులు ప్రతిఘటించిన పరిస్థితి ఏర్పడింది. అయితే, ఏ దాడి జరిగినా చట్టం తన పని తాను చేసుకోవాలి. శాంతి భద్రతలను కాపాడటం ప్రభుత్వ బాధ్యత" అని స్పష్టం చేశారు.

**ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల నిర్వహణ మా విధానం :** "నా నియోజకవర్గంలోనూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మా పార్టీ కార్యకర్తలపై వందలాది కేసులు పెట్టడం, వారి ఆస్తులపై దాడులు జరగడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. ఆ అనుభవాలను ప్రజలు మర్చిపోలేదు. గతంలో జరిగిన దౌర్జన్యాలను మరచిపోయి, ఇప్పుడు మళ్లీ తమ రాజకీయ ఆధిపత్యాన్ని కొనసాగించవచ్చని ఎవరైనా భావిస్తే అది పొరపాటు. ప్రభుత్వం తరఫున మేము స్పష్టంగా హామీ ఇస్తున్నాం. అక్టోబర్ 29 వరకు కొనసాగనున్న ఎన్నికల ప్రక్రియలో ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అన్ని చర్యలు తీసుకుంటాం. ఎన్నికలు ప్రశాంతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా జరిగేలా ప్రభుత్వం కట్టుబడి ఉంది" అని తెలిపారు.

**ప్రజల తీర్పే అంతిమ తీర్పు :** "తెలుగుదేశం పార్టీ, కూటమి అభ్యర్థుల విజయమే మా లక్ష్యం. పెద్దిరెడ్డి కుటుంబం, గడికోట శ్రీకాంత్ రెడ్డి వంటి నాయకుల రాజకీయ వ్యూహాలకు మేము భయపడబోము. వారితో రాజకీయంగా తలపడేది ప్రజాక్షేత్రంలోనే. ప్రజల తీర్పే అంతిమ తీర్పు. రాయచోటి తమకు గుండెకాయ లాంటిదని గతంలో చెప్పుకున్న నాయకులు, ఇటీవలి ఎన్నికల్లో ప్రజల తీర్పును చూశారు. అక్కడ తెలుగుదేశం పార్టీ జెండా ఎగిరింది. ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ప్రజలు కూటమి పక్షాన నిలుస్తారనే నమ్మకం మాకు ఉంది. ఓటమి భయంతో సాకులు వెతుక్కుంటూ, తమ రాజకీయ వైఫల్యాలను ఇతరులపై నెట్టడం సమంజసం కాదు. ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలు. గతంలో ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన నాయకులు, ఇప్పుడు అదే ప్రజల నుంచి వ్యతిరేకత ఎదుర్కొంటున్నారంటే తమ రాజకీయ విధానాలను ఒకసారి సమీక్షించుకోవాలి" అని కోరారు.

**మేము గాంధేయవాదులం కాదు :** "నేను ఒక స్థానిక శాసనసభ్యుడిగా నా కార్యకర్తలను కాపాడుకోవడం నా బాధ్యతగా భావిస్తున్నాను. గతంలో మా కార్యకర్తలు ఎదుర్కొన్న దౌర్జన్యాలు మళ్లీ పునరావృతం కాకుండా చూడాలి. అదే సమయంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల్లో పోటీ చేసి ప్రజల మద్దతు పొందేందుకు మేము సిద్ధంగా ఉన్నాం. మేము గాంధేయవాదులమని చెప్పుకుని, మా కార్యకర్తలపై దాడులు జరిగినా చూస్తూ ఊరుకోము. అయితే, ప్రతిఘటన పేరుతో చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడాన్ని సమర్థించము. మా కార్యకర్తల రక్షణకు, ప్రజల హక్కుల పరిరక్షణకు చట్టపరమైన మార్గాల్లో పోరాడతాం. పుంగనూరు, రాయచోటిలో జరిగిన ఘటనలను రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించుకోవాలని చూసేవారికి ప్రజలే సమాధానం చెబుతారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల మద్దతుతో కూటమి అభ్యర్థులు విజయం సాధిస్తారు. ప్రజల తీర్పుతోనే మా రాజకీయ బలం ఏమిటో నిరూపిస్తాం" అని స్పష్టం చేశారు.

# క్యూ లైన్లు ఎంత పొడవుగా ఉన్నా భక్తులకు సౌకర్యాలే ప్రాధాన్యం



**దసరా మహోత్సవాల్లో భక్తుల సౌకర్యార్థం విస్తృత ఏర్పాట్లు**
**అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా వర్ధిల్లాలి**
**రైతులకు, యువతకు మెరుగైన అవకాశాలు లభించాలి:మంత్రి కొలుసు పార్థసారథి**

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ:
అమ్మవారి దర్శనానికి వచ్చే ప్రతి భక్తుడికి సంతృప్తికరమైన దర్శనం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం అని రాష్ట్ర సమాచార, గృహనిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. శుక్రవారం అమ్మ వారి దర్శనం అనంతరం ఇంద్రకీలాద్రి మీడియా పాయింట్ వద్ద మంత్రి తొలుత ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో జరుగుతున్న దసరా శరన్నవరాత్రి మహో త్స వాల సందర్భంగా రాష్ట్ర ప్రజలకు దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. **ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అమ్మవారి కృపాకటాక్షాలతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.

**భక్తులకు ఇబ్బందులు లేకుండా పటిష్టమైన ఏర్పాట్లు.**
గతంలో మూలా నక్షత్రం రోజున శ్రీ కనకదుర్గమ్మవారి దర్శనం కోసం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చేవారని, క్యూ లైన్లలో గంటల తరబడి వేచి ఉండటంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారని మంత్రి గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి, దర్శన ప్రక్రియను మరింత సులభతరం చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ఈ ఏడాది దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో దసరా మహోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేపట్టినట్లు పేర్కొన్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే సామాన్య భక్తులు సైతం ఎలాంటి అసౌకర్యాలకు గురికాకుండా, ప్రశాంతంగా, తృప్తిగా దర్శనం చేసుకుని తమ ఇళ్లకు తిరిగి వెళ్లాలన్న సత్సంకల్పంతో ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.

**క్యూ లైన్లు ఎంత పొడవుగా ఉన్నా భక్తులకు సౌకర్యాలే ప్రాధాన్యం.**దసరా ఉత్సవాల సమయంలో భక్తుల రద్దీ అధికంగా ఉన్నప్పటికీ, వారికి అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. భక్తుల సౌకర్యం, భద్రతకు ప్రాధాన్యత నిస్తూ ఉత్సవాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రత్యేకించి సామాన్య భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, ప్రతి ఒక్కరూ అమ్మవారిని సంతృప్తికరంగా దర్శించుకునేలా ఏర్పాట్లు చేయడం ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు.

**అమ్మవారి కృపతో రాష్ట్రంలో సిరిసంపదలు వెల్లివిరియాలి.**దసరా పర్వదినం సందర్భంగా అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రంలో పాడిపంటలు సమృద్ధిగా పండాలని, రైతుల కుటుంబాల్లో సంతోషాలు వెల్లివిరియాలని మంత్రి ఆకాంక్షించారు. యువతీ యువకులకు మెరుగైన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించి, వారి భవిష్యత్తు ఉజ్వలంగా మారాలని కోరుకున్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేపడుతున్న కార్యక్రమాలన్నీ విజయవంతం కావాలని, రాష్ట్ర ప్రగతికి ఎటువంటి విఘ్నాలు ఎదురుకాకుండా అమ్మవారి అనుగ్రహం ఉండాలని ప్రార్థించారు.

**రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్న నాయకులకు అమ్మవారి ఆశీస్సులు ఉండాలి.**గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్న ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కల్యాణ్ చేపడుతున్న కార్యక్రమాలు విజయవంతం కావాలని మంత్రి ఆకాంక్షించారు. అదేవిధంగా దేశాభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీకి అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నారు.రాష్ట్రం, దేశం సర్వతోముఖాభివృద్ధి సాధించడంతో పాటు ప్రజలందరికీ సుఖసంతోషాలు, శాంతి, సౌభాగ్యాలు కలగాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.

**విలేకరుల కుటుంబాల్లోనూ సుఖసంతోషాలు వెల్లివిరియాలి.**ప్రజలకు ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి, సంక్షేమ పథకాల సమాచారాన్ని చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తున్న విలేకరుల సోదరులకు మంత్రి శ్రీ కొలుసు పార్థసారథి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. విలేకరులందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, వారి కుటుంబాల్లో ఆనందం వెల్లివిరియాలని, వారు ఎదుర్కొంటున్న కష్టాలు తొలగిపోవాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. అమ్మవారి దివ్య ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరికీ మంచి జరగాలని, ప్రతి కుటుంబంలో శాంతి, సౌభాగ్యాలు నెలకొనాలని ఆయన తెలిపారు.

## నామినేషన్ల స్వీకరణలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి



**నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజి**

ప్రజాభూమి ప్రతినిధి,మచిలీపట్నం:
మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, ఎన్నికల నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు.శుక్రవారం మచిలీపట్నం నగరంలోని పలు డివిజన్ల పరిధిలో స్వర్ణ వార్డు సచివాలయాల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో కేంద్రాల్లో చేపట్టిన ఏర్పాట్లను, నామినేషన్ల స్వీకరణ తీరును పరిశీలించి అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు.నామినేషన్ల స్వీకరణకు అవసరమైన దరఖాస్తు ఫారాలు, చెక్‌లిస్టులు, డిజిటల్ గడియారం ఏర్పాటు, ఇతర సామగ్రి అందుబాటులో ఉన్నాయా లేదా అని పరిశీలించారు. నామినేషన్ పత్రాల్లో అభ్యర్థులు పొందుపరిచిన వివరాలు, సంతకాలు, జతచేయాల్సిన ధ్రువపత్రాలు, డిపాజిట్ చెల్లింపు తదితర అంశాలను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా తనిఖీ చేసి నామినేషన్లను స్వీకరించాలని సూచించారు.స్వీకరించిన ప్రతి నామినేషన్‌కు సంబంధించిన వివరాలను ఎలక్టోరల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో అదే రోజు నమోదు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ మొత్తాన్ని తప్పనిసరిగా వీడియో చిత్రీకరణ చేయాలని, నామినేషన్ల స్వీకరణకు ఎన్నికల సంఘం నిర్దేశించిన సమయాన్ని కచ్చితంగా పాటించాలని అధికారులకు సూచించారు.ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా జరిగేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని, నామినేషన్ల స్వీకరణలో ఏవైనా లోపాలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట సహాయ కలెక్టర్ నమ్రత అగర్వాల్, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలపై ఎంపీ బాలశౌరి సమీక్ష



మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి
మచిలీపట్నం పార్లమెంట్ పరిధిలో స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయం, ప్రచార కార్యాచరణపై ఎంపీ వల్లభనేని బాలశౌరి సమీక్ష సమావేశం నిర్వహించారు. మచిలీపట్నంలోని ఎంపీ కార్యాలయంలో సమన్వయకర్తలతో జరిగిన ఈ సమావేశంలో ఎన్నికల సమన్వయంపై చర్చించారు.ఈ సమావేశంలో మచిలీపట్నం పార్లమెంట్ సమన్వయకర్తలు మండలి వెంకటరామ్, బండి రామకృష్ణ, చిలకలపూడి పాపారావు, డాక్టర్ మాధవి పాల్గొన్నారు.

## మచిలీపట్నంలో శక్తి పటంతో జయదుర్గ దర్శనం

### దసరా ఉత్సవాల్లో భక్తిశ్రద్ధలతో సంప్రదాయ ఆచారం

మచిలీపట్నం, ప్రజాభూమి
దసరా పండుగను పురస్కరించుకుని మచిలీపట్నంలోని పరాశపేటలో కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయ పరిసరాల్లో భక్తి సందడి నెలకొంది. ఈ సందర్భంగా ఈరోజు చప్పిడి రామకృష్ణ కుమార్తె జయదుర్గ శక్తి పటం ధరించి నగర పురవీధుల్లో సంచరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు.దసరా ఉత్సవాల సమయంలో భక్తులు తమ మొక్కుబడులు తీర్చుకునేందుకు సంప్రదాయబద్ధంగా శక్తి పటాలు ధరించి పురవీధుల్లో ఊరేగడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సంప్రదాయంలో భాగంగా జయదుర్గ శక్తి పటంతో దర్శనమివ్వడంతో భక్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. దసరా పండుగ సందర్భంగా నిర్వహించిన ఈ సంప్రదాయ కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది.





## జగన్మాత సన్నిధిలో విద్యా-కళా వైభవం

– ఆధ్యాత్మిక శోభతో పులకించిన కళావేదికకొండపై వీణాపాణియై శ్రీ సరస్వతీ దేవిగా చదువులతల్లి దర్శనం – కొండదిగువన నాదోపాసనతో మార్మోగిన కళా ప్రాంగణం.అక్షర జ్ఞాన ప్రదాత సన్నిధిలో కళార్చన – భక్తితన్మయత్వంలో మునిగితేలిన లక్షలాది భక్తజనం

ప్రజాభూమి ప్రతినిధి,ఇంద్రకీలాద్రి:
శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో అత్యంత వైభవోపేతంగా జరుగుతున్న దసరా శరన్నవరాత్రి మహోత్సవాలలో అత్యంత విశేషమైన మూలా నక్షత్ర పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ కనకదుర్గా నగర్‌లోని కళావేదికపై శుక్రవారం సాంస్కృతిక, ఆధ్యాత్మిక శోభ పరిపూర్ణంగా వికసించింది. శ్రీ కనకదుర్గ అమ్మవారి జన్మనక్షత్రమైన పవిత్ర మూలా నక్షత్రం వేళ, జగజ్జనని ఇంద్రకీలాద్రి శిఖరాన శ్వేతవస్త్రధారిణియై, చేతిలో వీణ, పుస్తకం, జపమాల ధరించి సమస్త సృష్టికి జ్ఞానాన్ని, విద్యాబుద్ధులను ప్రసాదించే శ్రీ సరస్వతీ దేవి దివ్యాలంకారంలో భక్తులకు కటాక్షం ప్రసాదిస్తున్నారు. "సంగీతమపి సాహిత్యం సరస్వత్యాః స్తనద్వయం" అన్నట్లుగా.. సాక్షాత్తు చదువుల తల్లికి, కళల అధిదేవతకు అంకితమిస్తూ కళాకారులు సమర్పించిన సంగీత, సాహిత్య, నాట్య నివేదనలు ప్రాంగణమంతటా భక్తి చైతన్యాన్ని రగిలించాయి. ఉదయం నుండి రాత్రి వరకు నిర్విరామంగా కొనసాగిన ఈ దివ్య కళార్చనలు, దర్శనం కోసం బారులు తీరిన లక్షలాది మంది భక్తులను ఆధ్యాత్మిక ఆనందడోలికల్లో ఓలలాడించాయి.ఆధ్యాత్మిక నాదోపాసన – కళాకారుల వివరాలు:బి. సింధు బృందం సమర్పించిన సాంప్రదాయ తాళ భజనతో కళావేదిక ఆధ్యాత్మిక వైభవంతో ప్రారంభమైంది. వాగ్దేవిని, జగన్మాతను కీర్తిస్తూ ఎన్. రిషిత, ఎం. లక్ష్మీ శ్యామల, నిర్మల & పద్మ ఆలపించిన భక్తిరంజని సంకీర్తనలు, దేవీ స్తోత్రాలు భక్తులను నాదబ్రహ్మంలో ఓలలాడించాయి. హరికథా భాగవతారిణి పి. లలిత సమర్పించిన హరికథ భక్తులను విశేషంగా రంజింపజేసింది. జ్ఞానప్రదాయిని అయిన సరస్వతీ దేవి మహిమలను, పురాణ గాథలను సుమధుర గానం, అభినయంతో రంగరించి వివరించిన తీరు భక్తుల ప్రశంసలు అందుకుంది.శాస్త్రీయ నృత్యార్చన :సరస్వతీ కటాక్షాన్ని ఆకాంక్షిస్తూ చిన్నారులు కళాకారులు లయాన్విత అడుగులు, భావయుక్త ముద్రలతో కూచిపూడి, భరతనాట్య రీతులలో అద్భుత నాట్య నివేదన సమర్పించారు.ఎస్. అక్షయ, పి. మంజుష, బి.వి.ఎన్. సౌమ్య, ఎం.వి.ఎల్. సత్యవాణి, వి. నివేదిత, ఎస్. విజయలక్ష్మీమణి భార్గవి, జి. సత్య ఆనందని, జి.ఎస్.ఎల్. నరసింహ శర్మ, జె. అంబిక, పద్మశ్రీ హేమంత్‌సిహెచ్. పావని లత, వి. మౌనిక పట్నాయక్, బి. హరగోపాల్, త్రినాధాచారి, ఎస్. భార్గవిఐ. దుర్గా శేషకుమారి, పి. సూర్య ప్రకాశరావుకళాబృందాలు ప్రదర్శించిన శారదా భుజంగ ప్రయాత స్తోత్ర నృత్యాలు, సరస్వతీ వందనాలు, శివ-శక్తి నృత్య రూపకాలు ఆహూతులను మంత్రముగ్ధులను చేశాయి.చదువుల తల్లి సన్నిధిలో సాగిన ఈ కళా ప్రదర్శనలు క్యూలైన్లలో ఉన్న భక్తులకు శ్రమ తెలియకుండా ఆధ్యాత్మిక అనుభూతిని పంచాయి. అమ్మవారి జన్మనక్షత్ర వేళ కళల రూపంలో సాక్షాత్కరించి నాట్యార్చన, గానార్చన చేసిన కళాకారులందరినీ దేవస్థాన అధికారులు ప్రశంసించి, శ్రీ అమ్మవారి శేషవస్త్రాలు, పవిత్ర ప్రసాదాలు, ప్రశంసా పత్రాలు అందజేసి ఘనంగా సత్కరించారు.చిన్నారుల సందడితో కళావేదిక మార్మోగింది.

## కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో విద్యార్థులతో సామూహిక సరస్వతీ పూజలు



మచిలీపట్నం, ప్రజాభూమి, ప్రతినిధి :
దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మచిలీపట్నం ఆజాద్ రోడ్డులోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థా నంలో శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. అమ్మవారి మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని విద్యార్థులతో సామూహిక సరస్వతీ పూజలు ఘనం గా నిర్వహిం చారు.ఈ సందర్భంగా శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు శ్రీ విద్యాలక్ష్మీదేవి అలంకారంలో, శ్రీ పార్వతీ అమ్మవారు శ్రీ సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 5 గంటల నుంచి అమ్మవార్లకు సుప్రభాత సేవ, మంగళ వాయిద్యాలు, విశిష్ట సహస్రనామ కుంకుమార్చనలు నిర్వ హించారు. నాగేశ్వరస్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకాలు, సూర్య నమస్కారాలు, పంచాక్షరి, నవగ్రహ, బాలా త్రిపుర సుందరి పంచదశ జపాలు, ముత్తైదువుల పూజలు, ఉభయదాతల పూజలు భక్తిశ్రద్ధలతో జరిపించారు.అనంతరం పంచవాద్యాల నడుమ హారతి, మంత్రపుష్పం, జపాలు, ఆశీర్వచనం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. మూలా నక్షత్రం సందర్భంగా విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని సామూహిక సరస్వతీ పూజలు నిర్వహించారు. విద్యార్థులు విద్యాభివృద్ధి సాధించాలని, అమ్మవారి కృపాకటాక్షాలు అందరిపై ఉండాలని భక్తులు ప్రార్థించారు.ఆకట్టుకున్న పేరిణి నృత్య ప్రదర్శనసాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా హైదరాబాద్‌కు చెందిన పేరిణి శ్రీనివాస్ బృందం ప్రదర్శించిన పేరిణి నృత్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. సంప్రదాయ నృత్య ప్రదర్శనతో దేవస్థాన ప్రాంగణంలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు మామిడి మురళీకృష్ణ, మోటమర్రి వెంకట బాబా ప్రసాద్, సామా వెంకట లక్ష్మీకాంతారావు, ఉడత్తు శ్రీనివాసరావు, బైసాని హయగ్రీవరావు తదితరులతో పాటు భక్తులు, వాలంటీర్లు పాల్గొన్నారు.



## సరస్వతీ పూజలో పాల్గొన్న గోపు సత్యనారాయణ దంపతులు

ప్రజాభూమి,మచిలీపట్నం ప్రతినిధి :
మచిలీపట్నం మండలం కానూరు పంచాయతీ పరిధిలోని సత్యానగర్ కాలనీలో దుర్గమ్మ అమ్మవారి మండపం వద్ద నిర్వహించిన సరస్వతీ పూజ కార్యక్రమంలో కృష్ణా జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ, కానూరు మాజీ సర్పంచ్ గోపు వెంకటేశ్వరమ్మ దంపతులు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు సేవలందించారు.ఈ సందర్భంగా గోపు సత్యనారాయణ మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అమ్మవారి ఆశీస్సులతో కూటమి ప్రభుత్వం ఘన విజయం సాధించి, అన్ని స్థానాల్లో విజయకేతనం ఎగురవేస్తుందని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో గోపు ప్రతాప్, నరేష్ కుమార్, గోపు నాగ మహేష్ బాబు, దివి మహేష్, బొలిశెట్టి నాని, గోపు వెంకటరమణ, చిటికినేటి అయ్యప్ప, ఇవన వెంకన్న, ఇవన చిన్న తదితరులతో పాటు అమ్మవారి భక్తులు పాల్గొన్నారు.

## భక్తులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు

**ఎలాంటి సమస్యను గుర్తించినా త్వరిత గతిన పరిష్కరించే వ్యవస్థ అందుబాటులో: ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)**
**100 శాతం సంతృప్తి లక్ష్యంగా చర్యలు తీసుకున్నట్లు వెల్లడి**



ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ:
విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ కుటుంబ సభ్యులతో కలిసి ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గమ్మవారిని శుక్రవారం దర్శించుకున్నారు. మూలా నక్షత్రం సందర్భంగా సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారిని దర్శిం చు కున్నారు. అమ్మవారి ఆశీస్సుల తో ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, విద్యా విజ్ఞానం కలగాలని ఆకాంక్షించారు. దర్శనం అనంతరం ఎంపీ శివనాథ్ మాట్లాడుతూ దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఇంద్రకీలాద్రిపై చేపట్టిన ఏర్పాట్లు మంచి ఫలితాలు ఇస్తు న్నాయి అన్నారు. భక్తులకు ఎక్కడైనా ఇబ్బంది ఎదురైతే గుర్తించి, వెంటనే పరిష్కరించేందుకు అవ సరమైన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉందని పేర్కొన్నారు. ఆధునిక సాంకేతికతను వినియోగించడం ద్వారా భక్తుల రద్దీని పర్యవేక్షించడంతోపాటు, సమస్యలు తలెత్తినప్పుడు వేగం గా స్పందించే అవకాశం ఉంటుందని తెలిపారు.భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందు కు వివిధ శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. రద్దీ నియంత్రణ, భద్రత, క్యూ లైన్ల నిర్వహణ వంటి అంశాలపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందని వెల్లడించారు. భక్తుల సౌకర్యం, భద్రతకు ప్రాధా న్యమిస్తూ ఉత్సవాల నిర్వహణ కొనసాగుతుందన్నారు.మూలా నక్షత్రం సంద ర్భంగా సరస్వతీదేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్య లో ఇంద్రకీలాద్రికి తరలివస్తుండటంతో ఆలయ పరిసరాలు భక్తి వాతావరణంతో సందడిగా మారాయి.

## ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

**ప్రశాంత ఎన్నికల నిర్వహణకు పోలీసు శాఖ సిద్ధం2,387 మందిని గుర్తించి ముందస్తు బైండోవర్ చేశాం: కృష్ణా జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు**



మచిలీపట్నం, ప్రజాభూమి, ప్రతినిధి :
కృష్ణా జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసు శాఖ అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం అక్టోబర్ 14, 2026న ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిందని, ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు అమలులో ఉంటుందని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలు, పోటీ చేసే అభ్యర్థులు, వారి అనుచరులు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని సూచించారు.జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న రౌడీషీటర్లు, అనుమానితులు, గత ఎన్నికల్లో గొడవలు, అల్లర్లకు పాల్పడిన వారితో పాటు మొత్తం 2,387 మందిని గుర్తించి ముందస్తు బైండోవర్ చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. సమస్యాత్మక ప్రాంతాలు, వ్యక్తులను గుర్తించి, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీ ఎన్నికలు:మచిలీపట్నం, పెడన, ఉయ్యూరు పట్టణ స్థానిక సంస్థలకు అక్టోబర్ 28న పోలింగ్, అక్టోబర్ 30న ఓట్ల లెక్కింపు జరగనుంది. ఈ ఎన్నికలకు సంబంధించి మొత్తం 241 పోలింగ్ స్టేషన్లు, 100 పోలింగ్ లొకేషన్లు ఉన్నట్లు పేర్కొన్నారు.ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు:జిల్లాలో 358 ఎంపీటీసీ, 26 జడ్పీటీసీ స్థానాలకు నవంబర్ 3న పోలింగ్, నవంబర్ 5న ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు. ఈ ఎన్నికల కోసం 1,264 పోలింగ్ స్టేషన్లు, 748 పోలింగ్ లొకేషన్లు ఏర్పాటు చేయనున్నారు.గ్రామ పంచాయతీ ఎన్నికలు మూడు విడతల్లో:మొదటి విడత – గుడివాడ రెవెన్యూ డివిజన్: నవంబర్ 26న పోలింగ్, ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు. ఈ విడతలో 160 గ్రామ పంచాయతీలు, 1,424 వార్డులు ఉండగా, 1,503 పోలింగ్ స్టేషన్లు, 395 పోలింగ్ లొకేషన్లు ఉన్నాయి.రెండో విడత – ఉయ్యూరు రెవెన్యూ డివిజన్: నవంబర్ 29న పోలింగ్, ఓట్ల లెక్కింపు జరగనుంది. ఈ విడతలో 124 గ్రామ పంచాయతీలు, 1,248 వార్డులకు సంబంధించి 1,300 పోలింగ్ స్టేషన్లు, 349 పోలింగ్ లొకేషన్లు ఉన్నాయి.మూడో విడత – మచిలీపట్నం రెవెన్యూ డివిజన్: డిసెంబర్ 2న పోలింగ్, ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు. ఈ విడతలో 213 గ్రామ పంచాయతీలు, 1,978 వార్డులకు సంబంధించి 2,110 పోలింగ్ స్టేషన్లు, 520 పోలింగ్ లొకేషన్లు ఉన్నాయి.ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలిఎన్నికల సమయంలో కుల, మత, భాషా పరమైన విభేదాలను రెచ్చగొట్టే చర్యలకు పాల్పడరాదని ఎస్పీ సూచించారు. దేవాలయాలు, మసీదులు, చర్చిలు వంటి ప్రార్థనా మందిరాలను ఎన్నికల ప్రచార వేదికలుగా ఉపయోగించకూడదన్నారు. అభ్యర్థుల వ్యక్తిగత జీవితాలపై నిరాధార ఆరోపణలు చేయడం, ప్రత్యర్థి పార్టీల జెండాలు, పోస్టర్లను తొలగించడం లేదా ధ్వంసం చేయడం నిషిద్ధమని స్పష్టం చేశారు.ప్రభుత్వ, ప్రైవేటు భవనాలపై సంబంధిత అనుమతులు లేకుండా పార్టీ జెండాలు కట్టడం, పోస్టర్లు అతికించడం, నినాదాలు రాయడం చేయరాదన్నారు. ప్రచార సామగ్రిపై ముద్రిం చిన వారి, ప్రచురణకర్తల పేర్లు, చిరునామాలు తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. . జిల్లాలో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా ప్రజలందరూ సహకరించాలని ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు విజ్ఞప్తి చేశారు.

# జిల్లా పరిషత్ చైర్మన్ పీఠంపై మాగంటి చూపు

**ప్రజాభూమి బ్యూరో-ఏలూరు జిల్లా.**
ఏలూరు జిల్లా రాజకీయాల్లో మరోసారి మాగంటి మార్క్ చర్చ మొదలైంది. వందేళ్ల రాజకీయ వారసత్వం ఉన్న మాగంటి కుటుంబం మళ్లీ జిల్లా పరిషత్ పీఠం వైపు అడుగులు వేస్తోందన్న ప్రచారం జిల్లా వ్యాప్తంగా హాట్ టాపిక్ గా మారింది.మాజీ మంత్రి మాగంటి వెంకటేశ్వరరావు (బాబు) సతీమణి పద్మావల్లీ దేవి ఏలూరు జిల్లా పరిషత్ చైర్మన్ రేసులో ఉన్నారన్న వార్తతో ఒక్కసారిగా రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఇదే సమయంలో గత రాత్రి జిల్లా టీడీపీ అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) ఏలూరులోని మాగంటి నివాసానికి వెళ్లి బాబుని కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. రాజకీయాల్లో అందరివాడిగా పేరున్న చంటి... బాబు ఇంటికి వెళ్లడమే పెద్ద సంకేతమని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

**వందేళ్ల చరిత్ర ఉన్న కుటుంబం**
మాగంటి కుటుంబానికి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో వందేళ్ల రాజకీయ చరిత్ర ఉంది. తాత మాగంటి సీతారాంస్వామి ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో ఎమ్మెల్సీగా, ఎమ్మెల్యేగా జిల్లా అభివృద్ధికి పునాది వేశారు.తండ్రి స్వర్గీయ మాగంటి రవీంద్రనాథ్ చౌదరి (ఎం ఆర్ సి) జిల్లా పరిషత్ చైర్మన్ గా, రాష్ట్ర మంత్రిగా పనిచేశారు. ఆయన చైర్మన్ గా ఉన్న సమయంలో దేశంలోని 545 జిల్లా పరిషత్ లలో బెస్ట్ చైర్మన్ అవార్డు అందుకోవడం ఆ కుటుంబ ఘనతకు నిదర్శనం.ఆ తర్వాత బాబు, తల్లి స్వర్గీయ మాగంటి వరలక్ష్మి దేవీ రాష్ట్ర మంత్రిగా, దెందులూరు ఎమ్మెల్యేగా రికార్డు సృష్టించారు.ఆ వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న మాగంటి బాబు... ఏలూరు ఎంపీగా రెండు సార్లు, దెందులూరు ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా సేవలందించారు.2012లో చంద్రబాబు పాదయాత్ర సమయంలో జిల్లా పార్టీ అధ్యక్షురాలు తోట సీతారాం రామలక్ష్మి, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, బడేటి బుజ్జి తదితర నేతలతో కలిసి జిల్లాలో 15/15 అసెంబ్లీ స్థానాల గెలుపునకు కృషి చేయడమే కాకుండా, తాను నేరుగా ఏలూరు ఎంపీగా ఘన విజయం సాధించారు.



**ఒడిదుడుకులు... మళ్లీ పుంజుకున్న బాబు**
2019లో ఎంపీగా పోటీ చేసి ఓటమి పాలవడం, ఆ తర్వాత ఇద్దరు కుమారుల అకాల మరణం ఆయన్ను తీవ్రంగా కుంగదీసింది. దాదాపు రెండేళ్ల పాటు రాజకీయాలకు దూరంగా ఉన్నారు. కానీ మళ్లీ పుంజుకుని పార్టీ కోసం యాక్టివ్ అయ్యారు.2024లో ఏలూరు ఎంపీ టికెట్ ఆశించినా, పరిస్థితుల రీత్యా పుట్టా మహేష్ కుమార్ కు సీటు దక్కింది. అయినా ఏ మాత్రం అసంతృప్తి చూపకుండా ఏడు నియోజకవర్గాల్లో ఆయన గెలుపు కోసం విశేషంగా కృషి చేశారు. పదవి లేకపోయినా పార్టీ అభివృద్ధికి నిత్యం శ్రమించడం ఆయన నైజం.

**ఇప్పుడు అదృష్టం కలిసొచ్చింది!**
ఇప్పుడు ఏలూరు జడ్పీ చైర్మన్ స్థానం జనరల్ మహిళకు రిజర్వ్ కావడం మాగంటి కుటుంబానికి కలిసొచ్చే అంశం. దీంతో పద్మావల్లీదేవి పేరు దాదాపు ఖరారైనట్లేనని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.అసలు ట్విస్ట్ ఏంటంటే... బాబుకి గ్రూపులకు అతీతంగా అత్యధిక ఫాలోయింగ్ ఉన్న కామవరపుకోట జడ్పీటీసీ స్థానం నుంచే పద్మావల్లీదేవి పోటీ చేస్తారని ప్రచారం జరుగుతోంది. అక్కడ గెలిచి జిల్లా పరిషత్ చైర్మన్ పీఠాన్ని అధిష్టించాలన్నది వ్యూహంగా తెలుస్తోంది.తండ్రి బెస్ట్ చైర్మన్ అవార్డు తెచ్చిన పీఠం... మళ్లీ అదే కుటుంబ కోడలు అధిష్టిస్తే చరిత్ర పునరావృతమైనట్లేనని అభిమానులు సంబరపడుతున్నారు.

## విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



**ప్రజా భూమి ప్రతినిధి-పెదపాడు**
ఆపరేషన్ త్రిశూల్'లో భాగంగా వట్లూరు ఐటీఐ కాలేజీలో మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎం సుబ్బారావు యొక్క ఆధ్వర్యంలో ఘనంగా అవగాహన సదస్సు నిర్వహించారు. పెదపాడు మండలం వట్లూరు ఏలూరు జిల్లాలో మహిళలు, యువతులు,బాలికల రక్షణ కోసం జిల్లా పోలీస్ యంత్రాంగం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆపరేషన్ త్రిశూల్' కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది.జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్,ఆదేశాల మేరకు.. ఏలూరు వట్లూరు లోని ఐటీఐ కాలేజీలో విద్యార్థినుల కోసం ఒక ప్రత్యేక అవగాహన సదస్సును నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఎం. సుబ్బారావు, మహిళా ఎస్సై నాగమణి, డీటీఆర్బీ ఎస్సై శ్రీ రాంబాబు ,శక్తి టీమ్, ఈగల్ టీమ్ సిబ్బంది సంయుక్తంగా పాల్గొని విద్యార్థినులకు దిశానిర్దేశం చేశారు. మహిళలు విద్యార్థినులు ఎదుర్కొనే వివిధ వేధింపులు, ఆన్‌లైన్ మోసాలు, నేరాల నుండి రక్షణ పొందేలా వారిలో ఆత్మస్థైర్యం పెంపొందించడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని అధికారులు వివరించారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న సైబర్ మోసాలు, ఫేక్ కాల్స్, మార్ఫింగ్ మరియు ఆన్‌లైన్ ఆర్థిక మోసాల పట్ల విద్యార్థినులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కాలేజీ అధ్యాపక బృందం, విద్యార్థినులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సరస్వతి దేవిగా అమ్మవారు.

**ప్రజాభూమి ప్రతినిధి-పెదపాడు**



దేవి శరన్నవరాత్రి దసరా మహోత్సవాల సందర్భంగా పెదపాడు మండలంలో గల వివిధ దేవాల యాల్లో అమ్మవారు ప్రతిరోజు ఒక్కొక్క అవతారాల్లో భక్తులకు దర్శనమిస్తున్నారు.భక్తులు పెద్ద సంఖ్యలో పూజా కార్యక్రమాలు నిర్వహించి, అమ్మవారి ఆశీస్సులు పొందుతున్నారు. మండలం లోని వసంతవాడ గ్రామంలో గల గంగానమ్మ తల్లి దేవస్థానం నందు నిర్వహిస్తున్న దసరా మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారి జన్మ నక్షత్రం మూలా నక్షత్రం సందర్భంగా సరస్వతి దేవిగా భక్తులకు అమ్మవారి దర్శనం ఇచ్చారు. ఆలయ కమిటీ వారి ఆధ్వర్యంలో విద్యా ర్థినీ విద్యార్థుల చేత ఆలయ ప్రాంగణంలో సరస్వతీ దేవి పూజా కార్యక్రమంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలి

**వివిధ శాఖల మధ్య సమన్వయంతో ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించాలి: సబ్ కలెక్టర్ వినూత్న**





**ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి**
నూజివీడు డివిజన్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని నూజివీడు సబ్ కలెక్టర్ వినూత్న అధికారులకు సూచించారు. ఆమె అధ్యక్షతన శుక్రవారం నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమన్వయ సమావేశంలో గ్రామ పంచాయతీ, మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు (ఎంపీటీసీ), జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు (జెడ్పీటీసీ), పురపాలక ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లపై సమీక్షించారు. ఎన్నికల విధుల నిర్వహణలో వివిధ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, ఎన్నికల ప్రక్రియకు అవసరమైన సిబ్బంది, మౌలిక సదుపాయాలు, పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లు, విద్యుత్ సరఫరా, వైద్య సేవలు, అగ్నిమాపక భద్రత వంటి అంశాలపై ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఎన్నికల సమయంలో శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని, ఓటర్లు స్వేచ్ఛగా, ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఆయా శాఖలకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, అవసరమైన అన్ని ఏర్పాట్లను సమయానికి పూర్తి చేయాలని సబ్ కలెక్టర్ సూచించారు.

## మూలా నక్షత్రం సందర్భంగా సరస్వతీ దేవి అలంకరణలో దర్శనమిచ్చిన ప్రసన్న దుర్గాదేవి

**ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి**



ఆగిరిపల్లి మండలం కొత్త ఈదర గ్రామంలోని శ్రీ ప్రసన్న దుర్గాదేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజు శుక్రవారం మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని అమ్మవారిని సరస్వతీ దేవిగా విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు, అర్చనలు, హారతులు నిర్వహించి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆగిరిపల్లి తహసీల్దార్ పి.ఎన్.వి. ప్రసాద్ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మూలా నక్షత్రం సందర్భంగా ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ పూజా కార్యక్రమాల్లో మాజీ సర్పంచ్ బిక్కం రాజగోపాల్ తదితరులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు.

## వాడపల్లిలో వైసీపీ కి షాక్, మాజీ ఎంపీటీసీతో పాటు టీడీపీలోకి 50 కుటుంబాలు

- మాజీ ఎంపీటీసీ ఏపుగంటి వీరరాఘవులు ఆధ్వర్యంలో చేరికలు.
- పార్టీలోకి సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.





**ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట**
స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఆత్రేయపురం మండలం వాడపల్లి గ్రామంలో రాజకీయ సమీకరణాలు ఊపందుకున్నాయి. వాడపల్లి మాజీ ఎంపీటీసీ ఏపుగంటి వీరరాఘవులు ఆధ్వర్యంలో సుమారు 50 కుటుంబాలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరారు. శుక్రవారం కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సమక్షంలో ఈ చేరికలు జరిగాయి. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే పసుపు కండువాలు కప్పి సాదరంగా టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రంతో పాటు గ్రామాలు కూడా అభివృద్ధి దిశగా సాగుతున్నాయని, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు స్వాగతిస్తున్నారని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగిన సమయంలో వాడపల్లిలో పెద్ద సంఖ్యలో వైసీపీ నుంచి టీడీపీలో చేరడం శుభపరిణామమని పేర్కొన్నారు. వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆశీస్సులు కూటమి అభ్యర్థులకు ఉన్నాయనడానికి ఈ చేరికలు నిదర్శనమని ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు. తాను తొలిసారిగా శాసనసభ్యుడిగా పోటీ చేసినప్పటి నుంచి ఏ ఎన్నిక జరిగినా ముందుగా వాడపల్లికి వచ్చి స్వామివారిని దర్శించుకుని ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించడం ఆనవాయితీగా వస్తోందని గుర్తుచేశారు. మాజీ ఎంపీటీసీ ఏపుగంటి వీరరాఘవులు, ఆయన సహచర బృందం టీడీపీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతో అభివృద్ధి కొనసాగుతోందని ఎమ్మెల్యే అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు విజయం లభిస్తే కేంద్రం, రాష్ట్రం, స్థానిక సంస్థలు మూడు స్థాయిల్లో సమన్వయంతో పనిచేసే 'ట్రిపుల్ ఇంజిన్' పాలన ద్వారా గ్రామాలు, పట్టణాలను మరింత అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కేంద్రం, రాష్ట్రం, స్థానిక సంస్థలు ఒకే లక్ష్యంతో సమన్వయంతో ముందుకు సాగితే అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని అన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంతో పాటు గ్రామాల అభివృద్ధి కొనసాగాలంటే స్థానిక సంస్థల్లో సమన్వయం అవసరమని పేర్కొన్నారు. జిల్లా పరిషత్, మండల పరిషత్, గ్రామపంచాయతీలు, వార్డు సభ్యుల స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగాలని ప్రజలు కోరుకుంటున్నారని ఎమ్మెల్యే తెలిపారు. 2029లోనూ ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావాలనే లక్ష్యంతో నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని సూచించారు. ఎన్డీఏ కూటమి తరఫున ఎవరికి అవకాశం లభించి నా, ఎవరు పోటీ చేసినా వారందరి విజయా నికి కలిసికట్టుగా కృషి చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

## ఏలూరులో ఎన్నికల నామినేషన్ల నేపథ్యంలో ప్రతిష్టమైన బందోబస్తు





**ప్రజాభూమి బ్యూరో-ఏలూరు జిల్లా**
ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నామినేషన్ల పర్వం నేపథ్యంలో ఏలూరు నగరంలో పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేశారు. జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్, ఏలూరు డీఎస్పీ డి. శ్రావణ్ కుమార్ యొక్క ఆదేశాలపై ఏలూరు వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ముందస్తు భద్రతా చర్యలు చేపట్టిన ఏలూరు వన్ టౌన్ ఇన్స్పెక్టర్ కె రామకృష్ణ. ఏలూరు మున్సి పల్ కార్పొరేషన్ కార్యాలయం చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసులు భారీ భద్రతను ఏర్పాటు చేశారు. నామినేషన్ల దాఖలుకు వచ్చే నాయకు లు, కార్యకర్తలు, సాధారణ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, నగరంలో ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా ప్రత్యేక బారికేడ్లను ఏర్పాటు చేశారు.

ఏలూరు వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ కె. రామకృష్ణ ఎస్సైలు సుధా కర్ రామ కృష్ణ , పోలీస్ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. ట్రాఫిక్ మళ్లింపు, శాంతిభ ద్రతల పరిరక్షణ కోసం తీసుకున్న ముందస్తు చర్యలు సజావుగా సాగేలా చూడటంతో పా టు, కార్పొరేషన్ కార్యాలయ పరిసరాల్లో పూర్తి నిఘా ఉంచినట్లు అధికారులు తెలిపారు.

ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకు న్నామని వన్ టౌన్ పోలీసులు స్పష్టం చేశారు.

## మందపల్లి శనేశ్వరస్వామి ఆలయంలో ఘనంగా సరస్వతి పూజలు

- మూలా నక్షత్రం సందర్భంగా చిన్నారులకు ఉచిత సామూహిక అక్షరాభ్యాసాలు.
- మహిళలచే సామూహిక కుంకుమ పూజలు.. భక్తులకు అన్నసమారాధన





**ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట**
దసరా మహోత్సవాల్లో భాగంగా మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని కొత్తపేట మండలం మందపల్లి గ్రామంలోని శ్రీ మందేశ్వర (శనేశ్వర) స్వామివారి దేవస్థానంలో శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు దేవస్థానం అర్చకులు, వేద పండితుల ఆధ్వర్యంలో చిన్నారులకు ఉచిత సామూహిక సరస్వతి పూజ, అక్షరాభ్యాస కార్యక్రమాలను నిర్వహించారు. అదే సమయంలో మహిళలచే సామూహిక కుంకుమ పూజలు భక్తిశ్రద్ధలతో జరిపించారు. అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులకు దేవస్థానం తరఫున పలక, బలపం, పుస్తకం, పెన్నులను అందజేశారు. కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలకు పూజా సామగ్రితో పాటు పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం చిన్నారులు, మహిళలు, భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు గంధం సత్య వెంకట నాగాజీ, దంగేటి సాయి నాగభూషణం, నేరేడుమిల్లి మహాలక్ష్మి ఏడుకొండలు, గవర వీర వెంకట సత్యనారాయణ, చిలకమర్తి అనంతలక్ష్మి సావిత్రి శ్రీనివాస్, తణుకు వీరభద్రరావు, కోటిపల్లి సుబ్బలక్ష్మి సుబ్రహ్మణ్యం, దేవస్థానం అర్చకులు, ఎక్స్అఫీషియో సభ్యులు అయలూరి శ్రీరామమూర్తి, గ్రామ పెద్దలు, వేద పండితులు, దేవస్థానం సిబ్బంది, గ్రామస్తులు, భక్తులు, స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

## ముద్దాయిలపై రూ.లక్షకు బైండోవర్ కేసుల నమోదు

**ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు**



స్థానిక ఎన్నికల నేపథ్యంలో,పాత ఎక్సైజ్ కేసుల్లోని ముద్దాయిలకు కౌన్సెలింగ్ మరియు 1 లక్షకు బైండోవర్ కేసుల నమోదు శుక్రవారం పాలకొల్లు ప్రొహిబిషన్ ఌ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో, ఎక్సైజ్ సీఐ మద్ది రామశేషయ్య ఆధ్వర్యంలో గతంలో నకిలీ మద్యం (,గంజాయి (సుంకం చెల్లించని మద్యం , తదితర కేసుల్లో ఉన్న పాత ముద్దాయిలకు కౌన్సెలింగ్ నిర్వహించారు.తదుపరి మొత్తం ఏడు గురు(07) పాత ముద్దాయిలకు భవిష్యత్తులో ఎటువంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడకుండా, చట్టాన్ని గౌరవిస్తూ జీవించాలని సూచించారు. అనంతరం వారిని పాలకొల్లు మండల రెవెన్యూ అధికారి ఎదుట హాజరు పరిచి, ఒక్కొక్కరికి రూ.1 లక్ష చొప్పున బైండో వర్ చర్యలు చేపట్టినట్లు ఎక్సైజ్ సీఐ మద్ది రామశేషయ్య తెలిపారు.అక్రమ మద్యం, గంజాయి మరియు ఇతర నిషేధిత మత్తు పదార్థాలకు సంబంధించిన చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## మూలా నక్షత్రం వేళ సరస్వతీ దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు



**ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి**
వట్టిగుడిపాడు సెంటర్ రామాలయం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 11వ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆరో రోజు మూలా నక్షత్రం సందర్భంగా అమ్మవారు శ్రీ సరస్వతీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. విజయదశమి సందర్భంగా ఆలయంలో అన్నదానం నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## నూజివీడులో ఆటోవాలాల ఆగడాలు.



**ప్రజాభూమి ప్రతినిధి-నూజివీడు**
నూజివీడులో దసరా ఉత్సవాల వేళ ట్రాఫిక్ నిబంధనలు గాలికి!కోట మహిషాసుర మర్దిని అమ్మవారి ఆలయం వద్ద భక్తుల రద్దీతో ట్రాఫిక్ ఇబ్బందులుఎదురవుతుండగా, కొంత మంది ఆటో డ్రైవర్లు, కారు వాహనదారులు వన్‌వే నిబంధనలను ఉల్లంఘిస్తూ ఎదురుదిశలో ప్రయాణిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.సందుల నుంచి వన్‌వేలోకి దూసుకొస్తున్న వాహనాలతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వన్‌వే నిబంధనలు ఉల్లంఘించే వారిపై ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# అభివృద్ధి పనుల్లో జాప్యం సహించేది లేదు!

## వారం వారం క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల

ప్రజాభూమి ప్రతినిధి–పాలకొల్లు

పాలకొల్లు పట్టణంలో కోట్లాది రూపాయలతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సంబంధిత పనుల నిర్వహణ ఏజెన్సీలను ఆదేశించారు. పనుల్లో జాప్యాన్ని ఏమాత్రం సహించేది లేదని స్పష్టం చేశారు. పాలకొల్లు పట్టణంలో అభివృద్ధి పనుల పురోగతిని ప్రతి వారం క్షేత్రస్థాయిలో పరిశీలించే కార్యక్రమంలో భాగంగా 27వ వార్డు క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్, టిడ్కో గృహాల కాలనీ, ప్రభుత్వ ఆసుపత్రి, ఎన్టీఆర్ కళాక్షేత్రం, అబ్దుల్ కలాం పార్క్, బ్రాడీపేట



కొత్త కుళాయి చెరువు తదితర ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులఅ అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఆయా పనులు ఏ దశలో ఉన్నాయో తెలుసుకుని, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, పనుల పురోగతిపై సంబంధిత వర్గాలతో సమీక్షించారు.

ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు నిర్మాణాల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పనుల నిర్వహణ బాధ్యతలు చేపట్టిన ఏజెన్సీలు నిర్లక్ష్యం వహించకుండా నిర్దేశించిన కాలపరిమితిలో పనులను పూర్తి చేయాలన్నారు. పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని, ఎక్కడైనా జాప్యం కనిపిస్తే తక్షణమే దాన్ని అధిగమించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ప్రభుత్వం నిధులు కేటాయించి చేపడుతున్న అభివృద్ధి పనులు సకాలంలో పూర్తయి ప్రజలకు అందుబాటులోకి రావాలన్నదే లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. కేవలం పనులు ప్రారంభించడమే కాకుండా, వాటిని పూర్తిచేసి ప్రజలకు ప్రయోజనం చేకూర్చే వరకు పర్యవేక్షణ కొనసాగిస్తామని తెలిపారు.పనుల నాణ్యత విషయంలో రాజీ పడకుండా, నిర్ణీత గడువును పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సంబంధిత ఏజెన్సీలకు స్పష్టం చేశారు. పాలకొల్లు పట్టణ అభివృద్ధికి చేపట్టిన పనులన్నీ వేగంగా పూర్తయ్యేలా వారానికోసారి క్షేత్రస్థాయి పరిశీలన, సమీక్షలు కొనసాగిస్తామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెచ్చెట్టి బాబు, గండేటి వెంకటేశ్వరరావు, పొట్నూరి శ్రీనివాస్, పొట్నూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కరెన్సీ నోట్లతో మహాలక్ష్మిగా అమ్మవారి దర్శనం

### వేగేశ్వరపురంలో భక్తులను ఆకట్టుకున్న ప్రత్యేక అలంకరణ



ప్రజాభూమి ప్రతినిధి–తాళ్లపూడి

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వేగేశ్వరపురం గ్రామంలోని తుమ్మలమ్మ తల్లి ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రూ.9,99,999 విలువైన కరెన్సీ నోట్లతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## సరస్వతీ దేవి అలంకరణలో దుర్గా అమ్మవారు.



ప్రజాభూమి ప్రతినిధి–కాజులూరు

కాజులూరు మండలం కోలంక గ్రామంలో దుర్గా అమ్మవారు సరస్వతి దేవి అలంకరణలో దర్శనం ఇచ్చారు.దీంతో శుక్రవారం భక్తులు ఇక్కడ అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మహిళలు కూడా అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమ పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో కాజులూరు మండలం జనసేన పార్టీ అధ్యక్షులు బొండా వెంకన్న, కోలంక సొసైటీ అధ్యక్షులు బొండా వెంకట నరసింహా నాయుడు తదితర గ్రామస్తులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

## వైకాపా మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా చింతపల్లి.

### నేడు 10 మంది వైకాపా అభ్యర్థులు నామినేషన్ దాఖలు.



ప్రజాభూమి ప్రతినిధి–రామచంద్రపురం

రామచంద్రపురం మున్సిపల్ చైర్ పర్సన్ అభ్యర్థిగా మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి నాగేశ్వరరావు ఖరారయ్యారు. ఈ మేరకు పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్య ప్రకాష్, మాజీ ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్ ల ప్రతిపాదనకు ఆపార్టీ అధిష్టానం ఆమోదముద్ర వేసింది. చింతపల్లి నాగేశ్వరరావు మాజీ వైస్ చైర్మన్ కాగా గత 2014 లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున 8 వార్డు కౌన్సిలర్ గా పనిచేసిన అనుభవం ఉంది.అలాగే 2021లో 7 వార్డు నుంచి కౌన్సిలర్‌గా గెలుపొంది మున్సిపల్ వైస్ చైర్మన్ గా 5 సంవత్సరాల పాటు కొనసాగా రు. ప్రస్తుతం చైర్మన్ అభ్యర్థిగా నాగేశ్వరరావు వైకాపా తరఫున శనివారం ఉదయం 11గంటల 51 నిమిషాలకు తాను వైకాపా శ్రేణులతో తన నామినేషన్ దాఖలా చేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే తనతో పాటు సుమారు పదిమంది వైకాపా తరఫున కౌన్సిలర్లుగా నామినేషన్లు వేయనున్నట్లు ఈసందర్భంగా తెలిపారు. నాగేశ్వరరావుని వైకాపా అధిష్టానం చైర్మన్ అభ్యర్థిగా ఎంపిక చేయడం పట్ల ఆ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఎన్నికల భద్రతా ఏర్పాట్లపై ఎస్పీ తుహిన్ సిన్హా క్షేత్రస్థాయి పరిశీలన

### అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రం, డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఏర్పాట్ల తనిఖీ

ప్రజా భూమి ప్రతినిధి–అనకాపల్లి

రాబోయే ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా అధికారులకు సూచించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం అనకాపల్లి పట్టణంలోని అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రంతో పాటు ఎన్నికల సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

**డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఏర్పాట్ల పరిశీలన**

అనకాపల్లిలోని రావు గోపాలరావు కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఎస్పీ తనిఖీ చేశారు. ఎన్నికల విధులకు హాజరయ్యే సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వాహనాల పార్కింగ్, వసతి, భోజన సదుపాయాలు, ఇతర మౌలిక వసతులను



సమకూర్చాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన భద్రతా చర్యలపై అధికారులతో సమీక్షించారు.

**సమస్యాత్మక పోలింగ్ కేంద్రం వద్ద పటిష్ట భద్రత**

జీవీఎంసీ సంతబయలు వద్ద ఉన్న ప్రాథమిక పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని ఎస్పీ పరిశీలించారు. ఈ కేంద్రాన్ని అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రంగా గుర్తించిన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పటిష్టమైన బారికేడింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రం పరిసరాల్లో నిరంతర పర్యవేక్షణ కోసం సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు వెబ్‌కాస్టింగ్ సదుపాయాలను పక్కాగా కల్పించాలని ఆదేశించారు.అదేవిధంగా కాంపౌండ్ వాల్ లేని ప్రాంతాల్లో తక్షణమే రక్షణ గోడ లేదా అవసరమైన రక్షణ కంచె ఏర్పాటు చేయాలని జీవీఎంసీ అధికారులకు సూచించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.ఈ తనిఖీల్లో అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ పి.వి.వి. నరసింహారావు, జీవీఎంసీ జోనల్ కమిషనర్ చక్రవర్తి, టౌన్ సీఐ ప్రేమకుమార్‌తో పాటు పోలీస్, రెవెన్యూ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

## విద్యా స్వరూపిణిగా శ్రీ సరస్వతీ దేవి దర్శనం

- మూల నక్షత్రం సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- విద్యార్థులతో సరస్వతీ పూజలు

ప్రజాభూమి ప్రతినిధి–తాళ్లపూడి

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూల నక్షత్రం సందర్భంగా శుక్రవారం శ్రీ సరస్వతీ దేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. విద్య, జ్ఞానం, వాక్చాతుర్యానికి అధిదేవత అయిన చదువుల తల్లిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చారు.ఈ సందర్భంగా టీటీడీ ధర్మ ప్రచారకులు బ్రహ్మశ్రీ పరస రాధాకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ సరస్వతీ దేవిని ప్రత్యేకంగా పూజిస్తారని తెలిపారు. మూల నక్షత్రం రోజున చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించడం, విద్యార్థులు సరస్వతీ పూజలు నిర్వహించ



డం ఆనవాయితీగా వస్తోందన్నారు.తాళ్లపూడి స్థానిక అయ్యప్పస్వామి, సాయిబాబా ఆలయ ప్రాంగణంలోని శ్రీ గాయత్రీ మాత ఆలయంలో పరస రాధాకృష్ణ ఆధ్వర్యంలో 150 మంది విద్యార్థులతో సరస్వతీ పూజ నిర్వహించారు. తాళ్లపూడి శ్రీ నవదుర్గ పరివార శ్రీచక్ర సహిత కనకదుర్గ అమ్మవారి ఆలయంలో అర్చకులు బాలాజీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కుంకుమ పూజలు, విద్యార్థులు సరస్వతీ పూజలు చేశారు.వడ్డీల రామాలయం వద్ద నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో అర్చకులు జంధ్యాల గంగాధర్ ఆధ్వర్యంలో కుంకుమ పూజలు, విద్యార్థులతో సరస్వతీ పూజలు నిర్వహించారు. వేగేశ్వరపురం వెంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు పెరవలి ప్రసాద్ ఆధ్వర్యంలో 108 మంది విద్యార్థులు సరస్వతీ పూజల్లో పాల్గొన్నారు. అన్నదేవరపేట గ్రామ దేవత శ్రీ వేగులమ్మ తల్లి ఆలయంలో 18వ దసరా శరన్నవరాత్రులలో భాగంగా సరస్వతి దేవి పూజ, మహిళలచే సామూహిక కుంకుమ పూజలను అర్చకులు పెద్దింటి శ్యామ్ జరిపించటం జరిగింది. అనంతరం విద్యార్థులకు పెన్నులు పంచిపెట్టడం జరిగింది. ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి.

### ఎన్నికల భద్రతా ఏర్పాట్లు

## పరిశీలించిన జిల్లా ఎస్పీ రాహుల్ మీనా

ప్రజాభూమి ప్రతినిధి–రామచంద్రపురం

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో భాగంగా జిల్లా ఎస్పీ రాహుల్ మీనా రామచంద్రపురం మున్సిపాలిటీ పరిధిలో భద్రత ఏర్పాట్లు పరిశీలించారు. ఈమేరకు శుక్రవారం స్టీల్ వెల్ పేట, బ్రాడీపేట వార్డుల ల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను, రామచంద్రపురం మున్సిపల్ కార్యాలయంలోని నామినేషన్ కేంద్రాన్ని సందర్శించి భద్రతా ఏర్పాట్లు తోపాటు ఇందిరా గాంధీ మున్సిపల్ హైస్కూల్ నందు ఏర్పాటు చేస్తున్న డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రిసెప్షన్ సెంటర్, ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం ఏర్పాట్లను ఎస్పీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన పోలీసు బందోబస్తు, ముందస్తు భద్రతా ప్రణాళికపై సంబంధిత అధికారులతో ఈసందర్భంగా సమీక్షించారు. అలాగే పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు, భౌగోళిక పరిస్థితులు, రాకపోకల మార్గాలు, రూట్ మ్యాప్‌లు, స్ట్రాంగ్ రూమ్‌ల భద్రత తదితర అంశాలను పరిశీలించి, ఎన్నికల విధుల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా ముందస్తు ప్రణాళికతో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా క్యూలైన్ల నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, ప్రవేశ, నిష్క్రమణ మార్గాల నిర్వహణ, పోలీసు బందోబస్తుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.సమస్యాత్మక ప్రాంతాల వద్ద నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని, ఎన్నికల



విధుల్లో పాల్గొనే సిబ్బంది సమన్వయంతో అప్రమత్తంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకో కుండా ముందస్తు నివారణ చర్యలు చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు. ఇందులో భాగంగా రౌడీషీటర్లు గతంలో ఎన్నికల సమయంలో అల్లర్లు లేదా ఇతర సమస్యలకు కారణమైన వ్యక్తులను గుర్తించి బైండోవర్ చర్యలు చేపట్టామన్నారు. గ్రామాల్లో పల్లెనిద్ర, విలేజ్ విజిట్లు, నాకాబందీ, కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహిస్తూ ఎన్ఫోర్స్మెంట్‌ను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. అదేవిధంగా ఆయుధాల డిపాజిట్, ఎన్నికల నియమావళి అమలుపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వివరించారు.ఎన్నికల సమయంలో అక్రమ నగదు, మద్యం, ఆయుధాలు, ఓటర్లను ప్రలోభపెట్టేందుకు వినియోగించే వస్తువుల రవాణాను అరికట్టేందుకు రామచంద్రపురం లో రెండు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి, 24 గంటల పాటు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోషల్ మీడియాలో ఎన్నికలకు సంబంధించి అవాస్తవ సమాచారాన్ని ప్రచారం చేసినా, ప్రజలను రెచ్చగొట్టే లేదా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పోస్టులు పెట్టినా సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు తమ ఓటు హక్కు ను స్వేచ్ఛగా వినియోగించుకునేలా అవసరమైన అన్ని భద్రతా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజల సహకారంతో రామచంద్రపురం మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించడమే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని జిల్లా ఎస్పీ రాహుల్ మీనా స్పష్టం చేశారు.ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పీ గారు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతల కు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడకుండా, ప్రజలందరూ సంయమనం పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ గ తో రామచంద్రపురం డిఎస్పీ ఎం శేషు, ఎస్బీ సీఐ పుల్లారావు , రామచంద్రపురం మున్సిపల్ కమిషనర్ కే.విఆర్ ఆర్ రాజు ,రామచంద్రపురం సబ్ ఇన్స్పెక్టర్ యస్ నాగేశ్వరావు , ద్రాక్షారామ సబ్ ఇన్స్పెక్టర్ ఎం.లక్ష్మణ్ ఇతర అధికారులు ,పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### కనకదుర్గ అమ్మవారి ఆశీస్సులతో

## ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి

### నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి కొలుసు పార్థసారథి



ప్రజా భూమి ప్రతినిధి–ఆగిరిపల్లి

ఆగిరిపల్లి యాదవ మండపంలో జరుగుతున్న కనకదుర్గ అమ్మవారి నవరాత్రి ఉత్సవాల్లో రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణ అందరి బాధ్యతని పేర్కొన్నారు. కనకదుర్గ అమ్మవారి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలంతా అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలతో సుఖసంతోషంగా ఉండాలని, రైతులు పాడిపంటలతో వర్ధిల్లాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ మిషన్ ఉపాధ్యక్షుడు ఎం. శ్రీనివాసరెడ్డి, ఆగిరిపల్లి తెదేపా అధ్యక్షుడు పామర్తి నరసింహారావు, మడిపల్లి గోపాల్, పుసునూరు వంశి, తిరుపతి వెంకయ్య, నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## మూలా నక్షత్రం వేళ సరస్వతీదేవిగా కనకదుర్గమ్మ దివ్యదర్శనం

ప్రజా భూమి ప్రతినిధి–ఆగిరిపల్లి



ఆగిరిపల్లి వరాహ పుష్కరిణి సమీపంలోని స్వయంభు శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో జరుగుతున్న దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆరవ రోజు శుక్రవారం మూలా నక్షత్రం సంద ర్భంగా అమ్మవారు శ్రీ సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దివ్యదర్శనమిచ్చారు. ఈ సందర్భం గా ఉదయం విఘ్నేశ్వర పూజ, లలితా సహస్రనామ పారాయణం, కుంకుమార్చన, చండీయా గం నిర్వహించి భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం లలితా సహస్రనామార్చన, సామూహిక కుంకుమ పూజ, చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిం చారు. అనంతరం బలిహరణ, ఆలయ అర్చకులు దేవులపల్లి శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో ప్రసాద వినియోగం జరిగాయి. అమ్మవారి దర్శనం, ప్రత్యేక పూజలు, అన్నప్రసాద స్వీకరణకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై జగన్మాత ఆశీస్సులు పొందారు.

## రౌతులపూడి మండలంలో టీడీపీలోకి భారీ చేరికలు!

### రాఘవపట్నంలో 200 మంది.. ఎస్. పైడిపాలలో 100 మంది వైసీపీ నుంచి టీడీపీలోకి



ప్రజా భూమి ప్రతినిధి–ప్రత్తిపాడు (రౌతులపూడి)

కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలోని రౌతులపూడి మండలంలో తెలుగుదేశం పార్టీలోకి భారీగా చేరికలు జరిగాయి. రాఘవపట్నం గ్రామంలో మాజీ జడ్పీటీసీ చెన్నాడ సత్తిబాబు ఆధ్వర్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన 200 మంది టీడీపీలో చేరగా, ఎస్. పైడిపాల గ్రామంలో మాజీ సర్పంచ్ జిగిరెడ్డి సత్తిబాబు, గొల్లు రమణబాబు ఆధ్వర్యంలో మరో 100 మంది టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.ఈ రెండు కార్యక్రమాల్లో ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా పాల్గొని, పార్టీలో నూతనంగా చేరిన వారికి పసుపు కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.రాఘవపట్నం చేరికల కార్యక్రమంలో రాఘవపట్నంతో పాటు మాతయ్యపేట, ముకులూరు, సత్యవరం, చల్లూరు, గిన్నెలారం, సార్లంక, అంపాద, జల్దాం, దబ్బాది, కొత్తూరు గ్రామాలకు చెందిన వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా మాట్లాడుతూ గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమాల్లో మండల టీడీపీ నాయకులు, స్థానిక కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వాడపల్లి వెంకన్న అన్నప్రసాదానికి దాతల విరాళాలు



ప్రజాభూమి ప్రతినిధి–కొత్తపేట

కోనసీమ తిరుమలగా ప్రసిద్ధిగాంచిన ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్య అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి పలువురు దాతలు విరాళాలు సమర్పించారు. పెరవలి మండలం అజ్జరం గ్రామానికి చెందిన అర్థమూరి నాగ వెంకట కృష్ణ రెడ్డి, చిరంజీవి అర్థమూరి మయాన్ష్ రెడ్డి, వారి కుటుంబ సభ్యులు అన్నప్రసాద వితరణ కోసం రూ.4,35,500 విరాళంగా అందజేశారు. అలాగే తెలంగాణ రాష్ట్రం కరీంనగర్‌కు చెందిన కె.ప్రణతి, చిరంజీవి కె.అనన్య, వారి కుటుంబ సభ్యులు రూ.1,00,000 విరాళంగా సమర్పించారు. ఈ సందర్భంగా ప్రత్యేక దర్శనం అనంతరం దాతలకు అర్చకులు వేదాశీర్వచనం చేసారు. ఆలయ అధికారులు వారికి స్వామి వారి చిత్ర పటాలు అందజేసి అభినందించారు. భక్తులకు నిరంతరం అన్నప్రసాదం అందించే పవిత్ర కార్యక్రమానికి దాతలు ముందుకొచ్చి విరాళాలు అందించడం పట్ల భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# ప్రజాభూమి

అనంతపురం,శ్రీసత్యసాయి జిల్లా 6

శనివారం 17 అక్టోబరు 2026


## సజావుగా మున్సిపాలిటీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ..

- గుత్తి మున్సిపాలిటీలో ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను మరియు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో స్ట్రాంగ్ రూములను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్..
- మున్సిపాలిటీ నామినేషన్ల ప్రక్రియ కోసం జిల్లా వ్యాప్తంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, శాంతిభద్రతల సమస్యలు లేకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టాం-జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్..
- కుల ధృవీకరణ పత్రాలు, ఆదాయ ధృవీకరణ పత్రాలు కోరిన వారికి వీలైనంత త్వరగా 24 గంటల్లోపే జారీ చేయాలి

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం

అనంతపురం జిల్లాలో మున్సిపాలిటీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ సజావుగా జరుగుతోందని, జిల్లా వ్యాప్తంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, శాంతిభద్రతల సమస్యలు లేకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టామని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ పేర్కొన్నారు. శుక్రవారం గుత్తి పట్టణంలోని మున్సిపాలిటీలో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను మరియు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ గుత్తి మున్సిపాలిటీకి సంబంధించి స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్నాయని, మున్సిపాలిటీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను, ఏర్పాట్లను పరిశీలించడం జరిగిందన్నారు. మున్సిపాలిటీలకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా ఈ రోజు నుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలవుతుందని, ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, మూడు రోజులు పాటు ఈ ప్రక్రియ జరుగుతుందన్నారు. నామినేషన్



ప్రక్రియకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా ఎలాంటి సమస్యలు లేవన్నారు. మున్సిపాలిటీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న మున్సిపల్ కమిషనర్లు, తహాశీల్దార్లు, ఎంపిడి ఓలకు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం జరిగిందని తెలిపారు. కుల ధృవీకరణ పత్రాలు (క్యాస్ట్ సర్టిఫికెట్లు), ఆదాయ ధృవీకరణ పత్రాలు (ఇన్‌కమ్ సర్టిఫికెట్లు) కోరిన వారికి వీలైనంత త్వరగా, 24 గంటల్లోపే జారీ చేయాలని ఆదేశాలు ఇచ్చామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తలేదన్నారు. నామినేషన్లు వేసే మూడు రోజులు కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. ముందుగా గుత్తి మున్సిపాలిటీలో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల విధులకు కేటాయించిన సిబ్బందితో మాట్లాడారు. మీకు ఎన్నికల విధులపై ట్రైనింగ్ శిక్షణ ఇచ్చారా, ఈ ప్రక్రియ ఎలా చేయాలనే అవగాహన ఉందా, ఇక్కడ ఏమేమి పత్రాలు కలెక్ట్ చేసుకోవాలి, ఎలా రాసుకోవాలి, అభ్యర్థులకు ఏమేమి ఇవ్వాలి అనేది ఒక అవగాహన ఉందా, ఇంతకుముందు ఎన్నికల విధుల్లో పాల్గొన్నారా, రిజర్వు ఎన్నికల సిబ్బంది ఏర్పాటు, తదితర వివరాలు జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. హ్యాండ్ బుక్ లో ఉన్న నిబంధనలన్నీ చదవాలని, ప్రొసీజర్స్ అర్థం చేసుకోవాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా ఎలాంటి గొడవలు రావడానికి వీలులేదని, నామినేషన్ల చివరి రోజు మైక్ పెట్టించి సమయం అనౌన్స్ చేయించాలని, ఇక్కడ వాచ్ పెట్టించాలని, ఎలాంటి ఇబ్బందులు రావడానికి వీలులేదని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అనంతరం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ తనిఖీ చేసి పలు సూచనలను జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సుయాష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ సురేంద్ర, తహసిల్దార్ పుణ్యవతి, ఎలక్షన్ ఆఫీసర్లు, తదితరులు పాల్గొన్నారు.

## మిథున్ రెడ్డి పై టిడిపి అల్లరి మూకలు దాడి పిరికి పందల చర్య!

### కేంద్ర బలగాలతో ఎన్నికల నిర్వహించాలి



ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం

టిడిపిని ఓటమి భయం వెంటాడుతోంది. అందులో భాగమే మిథున్ రెడ్డి, రాయచోటి వైయస్సార్సీపి ఆఫీస్ పై టిడిపి నాయకులు, అల్లరి మూకలు దాడులు చేశాయి అన్నారు. రాయలసీమ జోనల్ అధికార ప్రతినిధి కె.వి రమణ శుక్రవారం తన కార్యాలయంలో మాట్లాడుతూ రెండున్నర సంవత్సరాల చంద్రబాబు పాలనలో వ్యవస్థలు అస్తవ్యస్తమై, ప్రజలను అవస్థలకు గురిచేసిన సందర్భంగా తీవ్రమైన వ్యతిరేకత ఉన్నదని తెలుసుకున్న చంద్రబాబు, ఏనాడూ స్థానిక సంస్థల ఎన్నికలు జరపని తన సాంప్రదాయాన్ని కొనసాగించాలని చివరిదాకా చూశాడన్నారు. అందులో భాగంగా రిజర్వేషన్ల రూపంలో కోర్టుకు వెళ్లి ఎన్నికలను వాయిదా వేయడానికి ప్రయత్నం చేశాడు. అయితే కలిసి రాకపోవడంతో తప్పనిసరి పరిస్థితిలో ఎన్నికలు పెట్టాల్సి వచ్చిందన్నారు. నిజంగా చంద్రబాబు, లోకేష్ కు గెలుస్తామనే ధైర్యం ఉంటే ఫ్రీ అండ్ ఫెయిర్ గా ఎలక్షన్ జరపాలి, అలా ఎలక్షన్ జరిగితే ఎలాంటి ఫలితాలు వస్తాయో వారికి తెలుసు అందుకే, అధికారాన్ని దుర్వినియోగం చేసి నామినేషన్ల స్థాయిలోనే అడ్డుకోవడానికి దిగజారుడు చర్యలకు పాల్పడుతున్నారు. ఈ పరిణామాలను ముందే గ్రహించిన వైయస్సార్సీపి కేంద్ర బలగాలను కోరింది. ఇప్పటికైనా ఎన్నికల కమిషన్ స్పందించి పారా మిలిటరీ దళాలతో ఎన్నికలు జరిగితే తప్ప సజావుగా ఎన్నికలు జరగవు అని అన్నారు. లేకుంటే దేశమంతా అట్టుడుకుతున్న సిఇసి జ్ఞానేశ్ కుమార్ తో మాట్లాడుకొని ప్రతిపక్ష పార్టీలను నామినేషన్లు వేయడానికి వీలులేదని రూలింగ్ తీసుకురండి. ప్రజాస్వామ్యంలో గెలుపు ఓటము సర్వసాధారణం. వైయస్సార్సీపి న్యాయబద్ధంగా, రాజ్యాంగ బద్ధంగా నడుచుకుంటుంది, ఎన్ని కష్టాలు వచ్చినా ఎదుర్కొని నిలబడుతుంది, జగనన్న సైన్యం తాటాకు చప్పుల్లకు భయపడదు గాక భయపడదు. ఇది ముమ్మాటికీ నిజం అని అన్నారు.

## కూటమి ప్రభుత్వంలో దళితులకు అన్యాయం: ప్రభుదాస్

### రిజర్వేషన్ల శాతాన్ని తగ్గించడంపై వైసీపీ ఎస్సీ సెల్ నేతల ఆవేదన



ప్రజా భూమి నార్పల

స్థానిక సంస్థల రిజర్వేషన్ల కేటాయింపులో దళితులకు అన్యాయం జరిగిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ప్రభుదాస్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నార్పల మండలంలో ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాల రిజర్వేషన్ల కేటాయింపుపై అభ్యంతరం వ్యక్తం చేశారు. రాజ్యాంగం ప్రకారం ఎస్సీ సామాజిక వర్గానికి 15 శాతం రిజర్వేషన్లు దక్కాల్సి ఉండగా, ప్రస్తుత ప్రభుత్వం కేవలం 13.26 శాతం మాత్రమే కేటాయించిందని ఆయన ఆరోపించారు. జనాభా నిష్పత్తి ప్రకారం దళితులకు దక్కాల్సిన హక్కులను తగ్గించడం వల్ల అర్హులైన ఎస్సీ నాయకులు రాజకీయ పదవులకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. స్థానిక సంస్థల్లో దళితులు నాయకత్వ స్థానాలకు ఎదగకుండా ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల రాజకీయ, ఆర్థిక అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం తన వైఖరిని మార్చుకుని ఎస్సీలకు రాజ్యాంగబద్ధంగా దక్కాల్సిన 15 శాతం రిజర్వేషన్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి సాకే రామాంజనేయులు, సింగనమల నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆంజనేయులు, మారుతి, నాగేష్, దసరా బుల్లోడు, బండారు జయరాం, ఖాదర్‌పేట నాగేంద్ర, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## మద్యం అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా

### -అంతర్రాష్ట్ర ఎక్సైజ్ అధికారుల సమావేశంలో సీఐ లక్ష్మీ దుర్గయ్య



ప్రజాభూమి, హిందూపురం టౌన్

రాష్ట్రంలో మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎక్సైజ్ అధికారులు అక్రమ మద్యం రవాణాపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా అనంతపురం జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఎస్.కె.డి.వి. ప్రసాద్, శ్రీ సత్య సాయి జిల్లా ఎక్సైజ్ అధికారి బి.నరసింహులు ఆదేశాల మేరకు శుక్రవారం హిందూపురం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లో కర్ణాటక, ఆంధ్ర రాష్ట్రాల ఎక్సైజ్ అధికారుల సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో అంతరాష్ట్ర సరిహద్దు నేరాలు, ముద్దాయిల సమాచారం, సుంకం చెల్లించని అక్రమ మద్యం, కల్తీ కల్లు మీద ఉమ్మడిగా దాడులు నిర్వహించడం, అరెస్ట్ కాని పాత నేరస్తుల అరెస్టుకు సహకరించడం, ప్రతి వారంలో ఉమ్మడిగా దాడులు నిర్వహించడం తదితర అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో హిందూపురం ఎక్సైజ్ సీఐ లక్ష్మీ దుర్గయ్య, కర్ణాటక టుంకూరు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ దీపక్, పావగడ ఎక్సైజ్ సీఐ మైఖేల్ జార్జ్, మధుగిరి ఎక్సైజ్ సీఐ శ్రీలత, ఎస్ఐలు పాల్గొన్నారు.

## టీడీపీ నుంచి వైకాపాలోకి మాజీ కౌన్సిలర్



ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం పట్టణంలో తెలుగుదేశం పార్టీకి చెందిన మాజీ కౌన్సిలర్ ముద్దిరెడ్డిపల్లి కోరుముట్ల మహాలక్ష్మి, ఆమె భర్త కోరుముట్ల నాగేంద్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. శుక్రవారం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు గుడ్డంపల్లి వేణురెడ్డి సమక్షంలో వారు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వేణురెడ్డి మహాలక్ష్మి, నాగేంద్రలకు పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ కౌన్సిలర్ మహాలక్ష్మి, ఆమె భర్త నాగేంద్ర టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరడం స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. రానున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలో వివిధ పార్టీలకు చెందిన నాయకుల చేరికలు, రాజకీయ పరిణామాలు ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మద్దన జయరాములు, బూత్ కమిటీల రాష్ట్ర కార్యదర్శి వరుణ్‌రెడ్డి, నరసింహారెడ్డి, ఎంజీ శ్రీనివాసరెడ్డి, మోతుకపల్లి లక్ష్మీనారాయణ, వెంకీ తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల సందర్శన - క్షేత్రస్థాయి పరిశీలన





ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురము

అనంతపురము జిల్లా చీఫ్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ లక్ష్మా నాయక్ సహకారంతో, స్టేట్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ (ఎస్‌పీఎంయూ, రైతు సాధికార సంస్థ) బృందంతో పాటు పల్నాడు, ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, కుప్పం, అన్నమయ్య, కడప, కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి వచ్చిన జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు (డీపీఎంయూ), రైతు శాస్త్రవేత్తలు, మెంటర్లు, డీపీలు, వైఆర్‌ఎఫ్‌లు సిబ్బంది అనంతపురము జిల్లాలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. తొలుత కూడేరు మండలం, జల్లిపల్లి గ్రామానికి చెందిన ప్రకృతి వ్యవసాయ రైతు ఆదినారాయణ మామిడి తోటను బృందం సందర్శించింది. గత ఐదు సంవత్సరాలుగా ౹ావీణ్యా విధానంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఆయన సాగు అనుభవాలను, పంటల నిర్వహణ పద్ధతులను తెలుసుకున్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేస్తున్న మామిడి తోటతో పాటు, రసాయన వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేస్తున్న మరో మామిడి తోటను పరిశీలించి, రెండు పద్ధతుల్లో పంటల పెరుగుదల, నేల పరిస్థితులు, సాగు నిర్వహణలో కనిపించిన తేడాలను క్షేత్రస్థాయిలో గమనించారు. తదుపరి గార్లదిన్నె మండలం కొటంక గ్రామాన్ని సందర్శించి, 150 ఎకరాల ప్రకృతి వ్యవసాయ విస్తీర్ణంలో భాగంగా ఏర్పాటు చేసిన 35 ఎకరాల కాంపాక్ట్ బ్లాక్‌ను పరిశీలించారు. అక్కడ ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతు మనోహర్ తన సాగు అనుభవాలను, పంటల నిర్వహణ విధానాలను, ప్రకృతి వ్యవసాయం ద్వారా పొందుతున్న ప్రయోజనాలను బృందంతో పంచుకున్నారు. పంటల వైవిధ్యం, నేల ఆరోగ్య పరిరక్షణ, సహజ వ్యవసాయ ఇన్‌పుట్‌ల వినియోగం మరియు కాంపాక్ట్ బ్లాక్ విధానం ద్వారా రైతులకు కలుగుతున్న ప్రయోజనాలపై చర్చించారు. ఈ క్షేత్ర సందర్శన ద్వారా వివిధ జిల్లాల ప్రతినిధులు రైతుల అనుభవాలను తెలుసుకోవడంతో పాటు, ప్రకృతి వ్యవసాయం మరియు రసాయన వ్యవసాయ పద్ధతుల్లో మామిడి సాగు మధ్య ఉన్న తేడాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. అలాగే, కాంపాక్ట్ బ్లాక్ విధానాల ప్రాధాన్యతను అవగాహన చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పీఎం డా. నవీన్, కన్సల్టెంట్ రాజా, డీపీఎంయూ గణేష్, కమ్యూనికేషన్ కీర్తన సిబ్బంది, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## హిందూపురంలో ప్రారంభమైన నామినేషన్ల పర్వం

### -తొలి రోజు చైర్మన్ స్థానానికి బీఎస్పీ అభ్యర్థి నామినేషన్





ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం పురపాలక సంఘ ఎన్నికలకు సంబంధించి శుక్రవారం నామినేషన్ల పర్వం ప్రారంభమైంది. మున్సిపల్ ఎన్నికల అధికారి, కమిషనర్ మల్లికార్జున సమక్షంలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. మొత్తం 52 వార్డులకు కౌన్సిలర్లతో పాటు చైర్మన్ స్థానానికి నామినేషన్లు స్వీకరించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం మొత్తం 14 కౌంటర్లను ఏర్పాటు చేశారు. తొలి రోజు చైర్మన్ స్థానానికి బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) తరఫున ఒక నామినేషన్ దాఖలైనట్లు ఎన్నికల అధికారి మల్లికార్జున వెల్లడించారు. నామినేషన్ల స్వీకరణకు అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. చైర్మన్ స్థానానికి నామినేషన్లు స్వీకరించేందుకు స్థానిక ఎంజీఎం పాఠశాలలో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. ఇదే పాఠశాలలో ఒకటో వార్డు నుంచి 20వ వార్డు వరకు నామినేషన్ల స్వీకరణకు ఐదు కౌంటర్లను అందుబాటులో ఉంచారు. 21వ వార్డు నుంచి 52వ వార్డు వరకు నామినేషన్ల స్వీకరణ కోసం పురపాలక సంఘ కార్యాలయంలో ఎనిమిది కౌంటర్లను ఏర్పాటు చేశారు. మొత్తం 52 వార్డులతో పాటు చైర్మన్ స్థానానికి నామినేషన్ల ప్రక్రియ సజావుగా జరిగేలా ఎన్నికల యంత్రాంగం చర్యలు చేపట్టింది. తొలి రోజు వార్డుల వారీగా కూడా నామినేషన్లు దాఖలయ్యాయి. 15వ వార్డుకు రెండు, 31వ వార్డుకు రెండు నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారి తెలిపారు. అదేవిధంగా 37, 41, 43, 48, 49వ వార్డులకు ఒక్కొక్క నామినేషన్ చొప్పున దాఖలైనట్లు వెల్లడించారు. మొదటి రోజే చైర్మన్ స్థానానికి బీఎస్పీ అభ్యర్థి నామినేషన్ వేయడంతో ఎన్నికల ప్రక్రియలో రాజకీయ పార్టీల కదలికలు మొదలయ్యాయి. రానున్న రోజుల్లో మరిన్ని నామినేషన్లు దాఖలయ్యే అవకాశం ఉండటంతో ఎన్నికల కార్యాలయాల వద్ద సందడి పెరగనుంది. నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. డీఎస్పీ రవిబాబు ఆధ్వర్యంలో పురపాలక సంఘం కార్యాలయం, ఎంజీఎం పాఠశాల వద్ద ప్రత్యేక పోలీసు బందోబస్తు నిర్వహించారు. అభ్యర్థులు, వారి అనుచరులు నామినేషన్ల దాఖలు కోసం వచ్చే నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎన్నికల నియమావళికి అనుగుణంగా నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా అధికారులు, పోలీసులు సమన్వయంతో చర్యలు చేపట్టారు.

## స్థానిక సంస్థల ఎన్నికలను అడ్డుకునేందుకు అల్లర్లు సృష్టించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం

### జిల్లా టీడీపీ కార్యాలయంలో మీడియా సమావేశంలో పాల్గొన్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ



ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం

అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పుంగనూరు, రాయచోటి ప్రాంతాల్లో జరిగిన అల్లర్లు, స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నెలకొన్న పరిస్థితులపై నిర్వహించిన మీడియా సమావేశంలో అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా, ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించే విధంగా దాడులు, దౌర్జన్యాలకు పాల్పడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. ప్రజల మద్దతుతో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ముందుకు సాగుతోందని, ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజల తీర్పును స్వీకరించాల్సిందేనని స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఓటమి భయంతో అల్లర్లు సృష్టించి, ప్రత్యర్థి అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం, ఎన్నికల ప్రక్రియను భంగపరచడం వంటి చర్యలను సహించరాదని పేర్కొన్నారు. 2020--21 స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో చోటుచేసుకున్న ఘటనలను ప్రజలు ఇంకా మర్చిపోలేదని, అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పెన్షన్ల పెంపు, ఉచిత గ్యాస్ సిలిండర్లు, అన్న క్యాంటీన్లు, యువతకు ఉపాధి అవకాశాలు, తల్లికి వందనం వంటి సంక్షేమ కార్యక్రమాలతో కూటమి ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని పొందుతోందని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునే వాతావరణాన్ని కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిస్తూ ఎన్నికలు శాంతియుతంగా జరిగేందుకు రాజకీయ పార్టీలు, అధికారులు సహకరించాలని అంబికా లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. ఈ మీడియా సమావేశంలో జిల్లా టీడీపీ అధ్యక్షులు పూల నాగరాజు, గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఎమ్మెల్సీ శ్రీమతి దలవాయి రమాదేవి, వెంకట శివుడు యాదవ్, టౌన్ బ్యాంక్ చైర్మన్ జె.ఎల్. మురళి, ఆర్య కటిక కార్పొరేషన్ చైర్మన్ శ్రీహరి, వెంకటేశ్వర్ రెడ్డి, దలవాయి వెంకటనారాయణ, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## చదువుల తల్లి సరస్వతి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన శ్రీ శ్రీ శ్రీ రామలింగ చౌడేశ్వరి దేవి



ప్రజాభూమి, పులివెందుల

దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా పులివెందులలో వెలసిన శ్రీ శ్రీ శ్రీ రామలింగ చౌడేశ్వరి దేవి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు మఠం ప్రవీణ్ స్వామి అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చనలు, పూజలు చేశారు. సాయంకాలం చదువుల తల్లి శ్రీ సరస్వతి దేవి అలంకరణలో చౌడేశ్వరి దేవి భక్తులకు దర్శనమిచ్చారు. అలంకరణను చూసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు రాజేంద్ర ప్రసాద్, ఆలయ అర్చకులు మఠం ప్రవీణ్ స్వామి మాట్లాడుతూ దసరా ఉత్సవాలను ప్రతి సంవత్సరం అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## పులివెందులలో కదం తొక్కిన అభిమాన ప్రభంజనం

### - ప్రమీలమ్మ నామినేషన్ ర్యాలీలో పోటెత్తిన జనసంద్రం



ప్రజాభూమి, పులివెందుల

పులివెందుల మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి వైఎస్ ప్రమీలమ్మ నామినేషన్ సందర్భంగా పులివెందుల పట్టణంలో అభిమాన ప్రభంజనం కదం తొక్కింది. వైఎస్సార్ కుటుంబంపై పులివెందుల ప్రజలకు ఉన్న అభిమా నం మరోసారి రుజువైంది. శుక్రవారం పులివెందుల మున్సిపాలిటీ చైర్మన్ అభ్యర్థిగా వైఎస్ ప్రమీలమ్మ నామినేషన్ దాఖలు చేసేందుకు భారీ ర్యాలీగా బయలుదేరారు. ఈ కార్యక్రమంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే కార్యాలయం సమీపంలోని జయమ్మ పార్క్ నుంచి ప్రారంభమైన ర్యాలీ మున్సిపల్ కార్యాలయం వరకు సాగింది. ర్యాలీలో వైఎస్సార్సీపీ శ్రేణులు, కౌన్సిలర్ అభ్యర్థులు, మాజీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా పాల్గొన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలంటూ నినాదాలు చేస్తూ, డప్పు వాయిద్యాల నడుమ ర్యాలీ సాగింది. పట్టణంలోని ప్రధాన వీధులన్నీ జనసంద్రంగా మారాయి. ఇరువైపులా నిలబడి మహిళలు హారతులు పడుతూ ప్రమీలమ్మకు స్వాగతం పలికారు. నామినేషన్ అనంతరం నాయకులు మాట్లాడుతూ.. ఈ రోజు వచ్చిన జన సందోహాన్ని చూస్తుంటే పులివెందులలో ఫ్యాన్ గాలి ఎలా వీస్తుందో అర్థమవుతుందన్నారు. ప్రజల అపూర్వ స్పందన చూస్తుంటే ఈ మున్సిపల్ ఎన్నికల్లో వైకాపా అఖండ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన తులసి రెడ్డి

### - భార్యాభర్తల బంధం అత్యంత పవిత్రమైనది



ప్రజాభూమి, వేంపల్లె

స్థానిక భరత్ నగర్‌కు చెందిన తమ్మిశెట్టి దేవి, గంగయ్యల కుమార్తె పద్మజకు, అదే ప్రాంతానికి చెందిన వల్లెపు గంగోజమ్మ, రామసుబ్బయ్యల కుమారుడు సుబ్బరాయుడుతో శుక్రవారం పట్టణంలోని ఎంఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో వివాహం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి, డా. యోగీశ్వర బాబు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉత్తన్న, వెంకటేశు, ఐచర్ రమణ తదితరులు నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ.. మానవ సంబంధాల్లో భార్యాభర్తల బంధం అత్యంత పవిత్రమైనదని, వివాహం ఈ బంధానికి చట్టబద్ధతతో పాటు సామాజిక భద్రత కల్పిస్తుందని అన్నారు.

## సరస్వతీ దేవి అలంకారంలో వాసవి మాత అమ్మవారు



ప్రజాభూమి పులివెందుల

పులివెందుల పట్టణంలో దసరా ఉత్సవాలలో భాగంగా ఆధ్యాత్మికంగా ఆదిపరాశక్తి ఆరాధన కొనసాగుతుండగా, సరస్వతి దేవి అలంకారంలో వాసవి అమ్మవారు భక్తులకు శుక్రవారం దర్శనం ఇచ్చారు. దసరా ఉత్సవాలలో భాగంగా ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం అమ్మవారి శాలలో ఆరవ రోజు ఆలయ ప్రధాన అర్చకులు నవీన్ శర్మ , ఓలమయ్య ఆధ్వర్యంలో, ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు శ్రీనివాసులు, ఉభయదారు ల పర్యవేక్షణలో ఉదయం అభిషేకం మహా మంగళహారతి అనంతరం ఉభయ దారులచే గణపతి ఆవాహిత హోమాలు, ధన్వంతరి హోమం, మీనాక్షి హోమం తదితర విశేష పూజలు నిర్వహించారు. అనంతరం సాయంకాల సమయంలో సరస్వతి దేవిఅలంకారంలో భక్తులకు దర్శనం ఇవ్వగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తమ ముక్కులను చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ పది రోజులు పాటు నిర్వహించే ఈ కార్యక్రమాలలో వాసవి అమ్మవారు వివిధ అలంకారంలో దర్శనమిచ్చునని కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని పిలుపునిచ్చారు. కార్యక్రమాలకు పాల్గొంటున్న భక్తజనానికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాటుచేసి నట్లు ఆయన తెలిపారు. అనంతరం తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ సభ్యులు అనుబంధ సంఘాల సభ్యులు భక్తాదులు తదితరులు పాల్గొన్నారు.

## ఆదరించండి.. మున్సిపల్ అభివృద్ధిలో భాగస్వామినవుతా

### - 27వ వార్డు వైకాపా అభ్యర్థి కుప్పాల లక్ష్మీ అనురాధ



ప్రజాభూమి, పులివెందుల:

పులివెందుల మున్సిపాలిటీలో వైఎస్సార్‌సీపీ చేపట్టిన అభివృద్ధి ఫలాలే తమను గెలిపిస్తాయని, కౌన్సిలర్‌గా గెలిపిస్తే పులివెందుల అభివృద్ధిలో భాగస్వామినవుతానని 27వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ అభ్యర్థి కుప్పాల లక్ష్మీ అనురాధ అన్నారు. శుక్రవారం మున్సిపల్ ఎన్నికల నామినేషన్లలో భాగంగా 27వ వార్డు వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా కుప్పాల లక్ష్మీ అనురాధ తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. పట్టణంలోని పాత ఎమ్మెల్యే కార్యాలయం వద్దకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, దుష్యంత్ రెడ్డిలతో కలిసి భారీ ర్యాలీగా వెళ్లి రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపించిన వ్యక్తి వైఎస్ జగన్ అని, ఆ అభివృద్ధిని చూసే ప్రజలు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేస్తారని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, 27వ వార్డు ప్రజల సమస్యల పరిష్కారానికి, వార్డు అభివృద్ధికి నిరంతరం అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. వార్డు ఓటర్లంతా ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. తనకు అవకాశం కల్పించిన పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డికి, ఎంపీ అవినాష్ రెడ్డికి, వైఎస్ మనోహర్ రెడ్డికి, దుష్యంత్ రెడ్డికి, అన్ని విధాలుగా అండగా నిలుస్తున్న తన భర్త కుప్పాల శ్రీరామ్ సుబ్బయ్య మిత్ర బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

## పులివెందులలో ఘనంగా బిందె సేవ

### - పెళ్లికాని యువకుల సంప్రదాయ ఊరేగింపు



ప్రజాభూమి, పులివెందుల

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పులివెందుల పట్టణంలో బిందె సేవ కార్యక్రమం శుక్రవారం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం సభ్యుల ఆధ్వర్యంలో ఈ సంప్రదాయ కార్యక్రమాన్ని నిర్వహించారు. దసరా ఉత్సవాలంటే అమ్మవారి అలంకారాలు, ప్రత్యేక పూజలు, ఊరేగింపులే కాకుండా ఎన్నో ప్రాచీన ఆచారాలు కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. అలాంటి విశిష్ట ఆచారాల్లో బిందె సేవ ఒకటి. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘ సభ్యులు మాట్లాడుతూ.. బిందె సేవ అమ్మవారి పట్ల భక్తిని చాటుతూ సంప్రదాయాలకు పెద్దపీట వేసే కార్యక్రమమని, ఇది భక్తుల్లో ప్రత్యేక ఆసక్తిని కలిగిస్తుందన్నారు. ఈ సేవలో భాగంగా పెళ్లికాని యువకులు సంప్రదాయ దుస్తులు ధరించి, తలపై బిందెలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. పవిత్ర జలంతో నింపిన బిందెలను అమ్మవారికి సమర్పించి పూజా కార్యక్రమాల్లో వినియోగిస్తారు. ఈ ఊరేగింపు ఉత్సవాలకు ప్రత్యేక శోభను తీసుకొచ్చింది. భారతీయ సంప్రదాయంలో జలానికి పవిత్రత, శుభానికి ప్రతీకగా భావిస్తారు. కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని, గ్రామం సుభిక్షంగా ఉండాలని కోరుతూ ఈ సేవ చేస్తారని పెద్దలు చెబుతున్నారు. యువకులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం వల్ల యువతలో సంప్రదాయాల పట్ల ఆసక్తి పెరుగుతుందని, అమ్మవారి ఆశీస్సులతో మంచి భవిష్యత్తు కలుగుతుందని భక్తుల నమ్మకం. సంప్రదాయ వస్త్రధారణ, బిందెలతో సాగిన ఊరేగింపు, అమ్మవారి నామస్మరణతో ఆలయ పరిసరాలు భక్తిమయంగా మారాయి.

## పులివెందులలో తొలిరోజు ప్రశాంతంగా నామినేషన్ల పర్వం

### - 28 వార్డులకు వైకాపా అభ్యర్థుల దాఖలు



ప్రజాభూమి, పులివెందుల

పులివెందుల పురపాలక సంఘ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ తొలిరోజు ప్రశాంతంగా ప్రారంభమైంది. మొత్తం 40 వార్డులకు గాను తొలిరోజు 28 వార్డులకు సంబంధించి వైకాపా అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను సంబంధిత ఎన్నికల అధికారులకు అందజేశారు. అలాగే చైర్ పర్సన్ అభ్యర్థిగా వైఎస్ ప్రమీలమ్మ నామినేషన్ దాఖలు చేశారు. తెదేపా, కాంగ్రెస్, జనసేన, భాజపా పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు కూడా నామినేషన్లు దాఖలు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. నామినేషన్ల వేళ మీడియాకు ఆంక్షలు – వాగ్వాదం :నామినేషన్ల స్వీకరణ సందర్భంగా పులివెందుల పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలో మీడియా ప్రతినిధులను అనుమతించే విషయంలో వివాదం చోటుచేసుకుంది. కొంతమంది పాత్రికేయులను లోపలికి అనుమతించి, మరికొందరిని అడ్డుకోవడంతో సీఐ పురుషోత్తం రాజుకు, మీడియా ప్రతినిధులకు మధ్య వాగ్వాదం జరిగింది. మున్సిపల్ కమిషనర్ తనూజ ఆదేశాల మేరకే మీడియాను లోపలికి అనుమతించడం లేదని సీఐ తెలిపినట్లు మీడియా ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ విషయమై పాత్రికేయులు కమిషనర్‌కు ఫోన్ చేయగా ఆమె స్పందించలేదని తెలిపారు. అనంతరం పాత్రికేయులందరినీ లోపలికి అనుమతించడంతో వివాదం సద్దుమణిగింది. అయితే అభ్యర్థుల వివరాలు, ఫోటోలు తీసుకునేందుకు ప్రత్యేకంగా మీడియా పాయింట్ ఏర్పాటు చేయకపోవడంపై మీడియా ప్రతినిధులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఫ్రైడే-డ్రైడే కార్యక్రమం

### - పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

### - జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి విజయ రెడ్డి



ప్రజాభూమి, వేంపల్లె

స్థానిక పట్టణంలో శుక్రవారం ఫ్రైడే–డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి విజయ రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని పలు వీధుల్లో పర్యటించి పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విజయ రెడ్డి మాట్లాడుతూ.. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందన్నారు. ప్రతి శుక్రవారం ఇంట్లోని నీటి నిల్వ పాత్రలను ఖాళీ చేసి, శుభ్రపరిచి ఆరబెట్టాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ వ్యాధుల నివారణకు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కోరారు. అనంతరం సబ్‌యూనిట్ అధికారి సిద్ధయ్య మాట్లాడుతూ.. ఇళ్ల ముందు, వీధుల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలని, చెత్తాచెదారం పేరుకుపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పాత టైర్లు, కూలర్లు, డ్రమ్ములు, పూల తొట్లలో నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. రాత్రివేళ దోమతెరలు ఉపయోగించాలని, జ్వరం, తలనొప్పి, ఒళ్లునొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తే సమీప ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా రక్త పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ వెంకటరత్నం, సూపర్‌వైజర్ అరుణాదేవి, ఆరోగ్య కార్యకర్త లక్ష్మీదేవి, ఎంఎల్‌హెచ్‌పీ రాణి, ఆశా కార్యకర్తలు జయమ్మ, మాలిని, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## దసరా ఉత్సవాల్లో పాల్గొన్న తులసి రెడ్డి

### - చెడుపై మంచి విజయానికి ప్రతీక దసరా ఉత్సవాలు



ప్రజాభూమి, వేంపల్లె

స్థానిక పట్టణంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో గురువారం రాత్రి నిర్వహించిన దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తోటంశెట్టి చంద్రశేఖర్, పాలకవర్గ సభ్యులు దొంతు సుమన్ కుమార్, దొంతు సుబ్బారావు, పుల్లగూర గోవర్ధన్, డీలర్ సుబ్రహ్మణ్యం, బీజీఎస్ గంగాధర్, రాయవరం సుబ్బు తదితరులు తులసి రెడ్డిని శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ.. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దసరా పండుగను జరుపుకుంటారని తెలిపారు. మహిషాసురుడిని దుర్గామాత సంహరించిన విజయానికి, రావణాసురుడిపై శ్రీరామచంద్రుడు సాధించిన విజయానికి గుర్తుగా ఈ పండుగను నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సుబ్రహ్మణ్యం, అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, రవీంద్రనాథ్ రెడ్డి, వెంకటేష్, రమణ తదితరులు పాల్గొన్నారు.

## మూలా నక్షత్రం.. అమ్మవారి ఆలయాలకు భక్తుల రద్దీ



ప్రజాభూమి, సిద్దవటం: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు శుక్రవారం మూలా నక్షత్రం సందర్భంగా మండలంలోని అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సరస్వతీ దేవి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు కొబ్బరికాయలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. మూలా నక్షత్రం సరస్వతీ దేవి ఆరాధనకు విశేష ప్రాధాన్యం కలిగిన రోజు కావడంతో విద్యార్థులు, మహిళలు, భక్తులు అమ్మవారిని దర్శించుకుని తమ కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని, విద్యాభివృద్ధి కలగాలని ప్రార్థించారు. ఆలయాల వద్ద భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాలతో ఆలయాల పరిసరాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

## స్థానిక ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు



ప్రజాభూమి, సిద్ధవటం: స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంపీడీవో ఫణి రాజకుమారి తెలిపారు. శుక్రవారం సిద్ధవటం మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఆదేశాల మేరకు ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికల నిర్వహణకు మండల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల నిర్వహణలో అధికారులతో పాటు ప్రజలకు కూడా సమాన బాధ్యత ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు నాగరత్న, ఆవుల అరుణ, పంచాయతీరాజ్ ఏఈ నాగరాజు, ఏవో సోమశేఖర్, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే

### ఉపేక్షించం - కఠిన చర్యలు తప్పవు -డీఎస్పీ మురళి



ప్రజాభూమి,పులివెందుల

జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ మురళి హెచ్చరించారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ప్రారంభం కావడంతో అక్కడికి వచ్చిన భారీ జనాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. నామినేషన్లను ప్రశాంతంగా వేయించడమే పోలీసుల లక్ష్యమన్నారు. ఈ నెల 28న జరిగే ఎన్నికల్లో ఎవరైనా అల్లర్లు సృష్టిస్తే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. పోలీసులకు ఏ పార్టీతో సంబంధం లేదని, శాంతిభద్రతల పరిరక్షణే తమకు ముఖ్యమని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా నామినేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని, అలాగే 28వ తేదీన జరిగే ఎన్నికలు కూడా ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని కోరారు. నిబంధనలు అతిక్రమించి అల్లర్లకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## పులివెందుల సర్పంచుల రిజర్వేషన్ ఖరార్

ప్రజాభూమి,పులివెందుల

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పులివెందుల మండలంలోని ఆరు సర్పంచులకు రిజర్వేషన్లను శుక్రవారం ఖరారు అయ్యాయి. అచ్చువెల్లి ఎస్సీ జనరల్, ఎర్రబల్లి బీసీ జనరల్, ఎర్రిపల్లె బిసి మహిళ, ఆన్ రిజర్వుడు రాగిమానుపల్లె మహిళా జనరల్, ఆన్ రిజర్వుడు ఈ కొత్తపల్లి, కణంపల్లి మహిళకు కేటాయించినట్లు అధికారులు తెలిపారు.

## ఎన్నికలు ప్రశాంతంగా జరిగితే గెలుపు మాదే

### - ప్రశాంతంగా ఎన్నికలు జరిపే బాధ్యత పోలీసులదే

### -చైర్మన్ అభ్యర్థి వైఎస్ ప్రమీలమ్మ

ప్రజాభూమి, పులివెందుల పులివెందులలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగితే విజయం వైకాపాదేనని, ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా పోలీసులు చూడాలని మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి వైఎస్ ప్రమీలమ్మ అన్నారు. శుక్రవారం ఆమె ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే కార్యాలయం సమీపంలోని జయమ్మ పార్కులో జయమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం నామినేషన్ కార్యక్రమానికి హాజరయ్యారు. మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 28న జరిగే ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పోలీసులు చూడాలని కోరారు. ఇప్పటికే పలు చోట్ల టీడీపీ నాయకులు అల్లర్లు చేస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం పులివెందులలో నామినేషన్లు ప్రశాంతంగా జరుగుతున్నాయని, ఇదే తరహాలో ఎన్నికలు జరిగితే ప్రజలు స్వచ్ఛందంగా ఓట్లు వేస్తారన్నారు. గెలుపోటములు సర్వసాధారణమని, ప్రజలు స్వేచ్ఛగా తమకు నచ్చిన వారికి ఓటు వేసుకునే అవకాశం కల్పించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.



# శ్రీ మహాలక్ష్మీ దేవి అలంకరణలో భక్తులకు కటాక్షం



ప్రజా భూమి ప్రతినిధి రామచంద్రాపురం

ఏకవీర సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు పూజ్యశ్రీ ప్రతాప్ స్వామీజీ వారి మార్గదర్శకత్వంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజు శ్రీ మహాలక్ష్మీ దేవికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని సర్వమంగళకరమైన మహాలక్ష్మీ స్వరూపంలో సుందరంగా అలంకరించి, విశేష పూజలు, అర్చనలు సమర్పించారు. సకల సంపదలకు, ఐశ్వర్యానికి, సౌభాగ్యానికి ప్రతీక అయిన శ్రీ మహాలక్ష్మీ దేవిని ఆరాధించడం ద్వారా కుటుంబాల్లో సుఖసంతోషాలు, శాంతి, సిరిసంపదలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. పూజ్యశ్రీ ప్రతాప్ స్వామీజీ వారి ఆశయాలకు అనుగుణంగా లోకకల్యాణం, సకల జీవుల క్షేమం, సమాజంలో ధర్మ పరిరక్షణ కోసం ఈ నవరాత్రి ఉత్సవాలను భక్తిభావంతో నిర్వహిస్తున్నారు.అమ్మవారి కృపాకటాక్షాలతో ప్రతి ఇంటా ఆరోగ్యం, ఆనందం, ఐశ్వర్యం వెల్లివిరియాలని, ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని ఏకవీర సేవా ఫౌండేషన్ ఆకాంక్షించింది. జగన్మాత ఆశీస్సులు సమస్త మానవాళిపై ఉండాలని ప్రార్థించారు.

# తూకివాకంలో ఘనంగా 'చెంచు క్రికెట్ క్లబ్' ప్రారంభోత్సవం





ప్రజాభూమి ప్రతినిధి రేణిగుంట.

తిరుపతి – చెన్నై జాతీయ రహదారి సమీపంలోని తూకివాకం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'చెంచు క్రికెట్ క్లబ్' (బాక్స్ క్రికెట్) మైదానాన్ని తుడా ఛైర్మన్ డాక్టర్ డాలర్స్ దివాకర్ రెడ్డి శుక్రవారం రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధునిక జీవనశైలిలో మానసిక ఒత్తిడిని జయించడానికి, శారీరక దృఢత్వానికి క్రీడలు ఎంతో అవసరమన్నారు. అలాగేయువత మొబైల్ గేమ్స్, చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా మైదానంలో ఆటలు ఆడుతూ క్రీడాస్ఫూర్తిని, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మండలాధ్యక్షుడు ముని చంద్రారెడ్డి, ఎస్.రవిరెడ్డి, భాస్కర్ యాదవ్, చెర్లోపల్లి సుబ్రహ్మణ్యం రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, చౌదరి,గోపాల్ రెడ్డి, నాగసుబ్రహ్మణ్యం రెడ్డి, కుసుమకుమారి, పూమణమ్మ, శివ గౌడ్,శ్రీవారి మణి, నాగరాజు, గణపతి, తదితర తూకివాకం పంచాయితీకూటమి పార్టీల నేతలు, స్థానిక ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు మరియు యువత పాల్గొన్నారు.

# శ్రీ రాజమాతంగీ దేవి అలంకరణలో శ్రీ మరకత కాళీ దేవి దర్శనం



ప్రజా భూమి ప్రతినిధి రామచంద్రపురం

రామచంద్రపురం మండలం రాయల చెరువు కట్ట దగ్గర వెలసియున్న శ్రీ శక్తి పీఠం నందు శుక్రవారం శ్రీ దశమహావిద్యా దేవతల దివ్యోత్సవములు, ఆరవ రోజు కుర్తాళం పీఠాధిపతి శ్రీ సిద్ధేశ్వరానందభారతీ మహాస్వామి దివ్య సమక్షంలో మంత్ర మహేశ్వరి శ్రీ శక్తి పీఠాదీశ్వరి మాతాజీ శ్రీ రమ్యానందభారతీ స్వామినీ వారి ఆధ్వర్యంలో అంగరంగ వైభవముగా జరుగుతున్నాయి. శ్రీ రాజమాతంగీ దేవి కి విశేష పంచామృత అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆనంతరం శ్రీ మరకత శక్తికాళీ దేవికి శ్రీ రాజమాతంగీ దేవి రూప అలంకరణలో , విశిష్ట పూజ, హోమము, పూర్ణాహుతి నిర్వహించారు. స్త్రీమూర్తులకు సువాసిని పూజ నిర్వహించారు. దసరా నవరాత్రులలో మూలా నక్షత్రం సందర్భంగా జగద్గురువులు పరమ పూజ్యశ్రీ స్వామివారి దివ్య సమక్షంలో పరమ పూజ్యశ్రీ మాతాజీ వారిచే 10 సంవత్సరాల లోపు పిల్లలకు అక్షరాభ్యాసం చేయడము జరిగినది.సాయంత్రం కళాకారులచే గాన కచేరి, జగద్గురువుల దివ్య సమక్షంలో పూజ్యశ్రీ మాతాజీ వారిచే శ్రీ మరకత శక్తికాళీ దేవికి దర్బారు సేవా నిర్వహించారు.ఈ కార్యక్రమనికి దేశ విదేశాల నుండి విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అందరికీ అన్న ప్రసాద వితరణ చేశారు.

# చెంచు బాక్స్ క్రికెట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.

రేణిగుంట మండలంలోని తూకివాకం పంచాయతీ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన క్లబ్ బాక్స్ క్రికెట్ టర్ఫ్‌ను శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మౌర్య, రవి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే అభినందించి ప్రోత్సహించారు.యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని, క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని వారు పేర్కొన్నారు. యువ క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకునేందుకు ఇలాంటి క్రీడా వేదికలు దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట మండలాధ్యక్షుడు ముని చంద్రారెడ్డి,ఎస్ రవి రెడ్డి, నర్మదా, మౌర్య, భాస్కర్ యాదవ్, నాగమణి రెడ్డి, చెర్లోపల్లి సుబ్రహ్మణ్యం రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, చౌదరి,గోపాల్ రెడ్డి, అంబికా పతి,భాస్కర్ రెడ్డి, శ్రీవారి మణి,గోపి, శివ,`నాగరాజు, గణపతి, కూలిరమేష్, తదితరులు పాల్గొన్నారు.





# స్థానిక సంస్థల ఎన్నికల విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలి

## ఎన్నికల కమిషన్ సూచనల మేరకే మీ విధులు నిర్వర్తించాలి- జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు

## ఆర్వో హ్యాండ్ బుక్ లో ఉన్న ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా అవగాహన కలిగి ఉండాలి.

## -జడ్పిటిసి, ఎంపిటిసి, ఎన్నికల నిర్వహణపై శిక్షణ తరగతులు

ప్రజాభూమి ప్రతినిధి,చిత్తూరు:

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకే ఎన్నికలను విధులు నిర్వహించాలని జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు పేర్కొన్నారు శుక్రవారం జడ్పీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జడ్పిటిసి, ఎంపిటిసి, ఎన్నికల నిర్వహణపై శిక్షణ తరగతులు నిర్వహించారు.జిల్లా పరిషత్ సి ఇ ఓ రవికుమార్ నాయుడు మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిర్దేశించిన గడువులోగా అన్ని ఎన్నికలను పూర్తి చేయాల్సి ఉన్నందున, ఎన్నికల విధులకు నియమితులైన అధికారులు, సిబ్బంది తమకు కేటాయించిన బాధ్యతలను తప్పనిసరిగా నిర్వహించాలని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల అనంతరం మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికలు, ఆ తర్వాత గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగుతాయని తెలిపారుఎన్నికల కమిషన్ నిర్దేశించిన సమయంలో అన్ని ఎన్నికలను పూర్తి చేయాల్సి ఉన్నందున, ఎన్నికల విధుల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జిల్లా పరిషత్ సి ఇ ఓ తెలిపారు.ఆర్వో హ్యాండ్ బుక్ లో ఉన్న ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా అవగాహన కలిగి ఉండాలి. ఎన్నికల సమయం నందు సొంత నిర్ణయాలు తీసుకొనకూడదు,ఆర్ఓ, ఏఆర్ఓ



విధులుగా విధులు కేటాయించబడిన వారు ముందుగా మీకు కేటాయించబడిన డివిజన్లలో ఓటర్ల నమోదు (ఎలెక్ట్రోరోల్), ఓటర్ల ప్రాతిపదికన రిజర్వేషన్ల కేటాయింపు మరియు పోలింగ్ స్టేషన్లను పరిశీలించి. అవసరమైన మౌలిక సదుపాయాలను పరిశీలించి, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా ఆర్ఓ, ఏఆర్ఓలు ఎలెక్ట్రోరోల్స్ పై ప్రత్యేక శ్రద్ధ వహించి, అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. చిత్తూరు డి యల్ డి ఓ రవికుమార్ గారు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా, పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని చిత్తూరు డీఎల్‌డీఓ రవికుమార్, సౌందర్ రాజన్ అధికారులకు వివరించారు. ఎన్నికల నామినేషన్ల స్వీకరణ సమయంలో పాటించాల్సిన విధివిధానాలు, నామినేషన్ పత్రాల పరిశీలన, అవసరమైన ధ్రువపత్రాల ధృవీకరణ, నామినేషన్ల తిరస్కరణకు సంబంధించిన నిబంధనలు, అభ్యర్థుల అర్హతలు తదితర అంశాలపై అధికారులకు తెలిపారు. నామినేషన్ల స్వీకరణ సమయంలో ఎన్నికల నిబంధనలను క్షుణ్ణంగా పరిశీలించాలని, అభ్యర్థులు సమర్పించిన పత్రాలను జాగ్రత్తగా ధృవీకరించాలని తెలిపారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియల్లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన గడువులను తప్పనిసరిగా పాటిస్తూ, ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని చిత్తూరు డీఎల్‌డీఓ రవికుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న చిత్తూరు ఆర్ డి ఓ శ్రీనివాసులు, డి ఆర్ డి ఎ పిడి శ్రీదేవి, ఐఎఖ్ పిడి రవికుమార్, జిల్లా విద్య శాఖ డి ఇ ఓ లక్ష్మీనారాయణ, తహసీల్దార్లు ఎంపీడీఓస్ మరియు రిటర్నింగ్ అధికారులు సహాయక రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

# నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా ఎస్పీ తుషార్ డూడి

ప్రజాభూమి ప్రతినిధి,పలమనేరు:

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందనిజిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా ఎస్పీ తుషార్ డూడి, సంయుక్తంగా పేర్కొన్నారు. శుక్రవారం పలమనేరు మునిసిపల్ కార్యాలయాన్ని సందర్శించి నామినేషన్ ప్రక్రియను పరిశీలించినజిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా ఎస్పీ తుషార్ డూడి, నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. నామినేషన్ కేంద్రంలో చేపట్టిన ఏర్పాట్లు, భద్రతా చర్యలు, అధికారుల విధుల నిర్వహణ, ఎన్నికల నియమావళి అమలుపై సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, మాట్లాడుతూ, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నామినేషన్ల ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని, ఎన్నికల విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా చూడాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో ప్రతి దశలోనూ నిబంధనలు కచ్చితంగా పాటిస్తూ,



ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీ శ్రీ తుషార్ డూడి, మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, భయరహిత వాతావరణంలో జరిగేలా చిత్తూరు జిల్లా పోలీసు శాఖ పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టిందని తెలిపారు. నామినేషన్ కేంద్రాల వద్ద అదనపు పోలీసు బందోబస్తు, నిరంతర పర్యవేక్షణ మరియు అవసరమైన ముందస్తు భద్రతా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నాలు, అభ్యర్థులు లేదా వారి మద్దతుదారులను బెదిరించడం, ఓటర్లను ప్రలోభపెట్టడం, భయభ్రాంతులకు గురిచేయడం, గుంపులుగా చేరి ఉద్రిక్తతలు సృష్టించడం వంటి చర్యలను ఏమాత్రం సహించబోమని ఎస్పీ హెచ్చరించారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించే వారిపై, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా ఎన్నికల ప్రక్రియలో పాల్గొనాలని, ఏవైనా బెదిరింపులు, ప్రలోభాలు, గొడవలకు సంబంధించిన సమాచారం లేదా అనుమానాస్పద కార్యకలాపాలు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ గారు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సమయంలో సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు, రెచ్చగొట్టే పోస్టులు, నిర్ధారణ కాని సమాచారాన్ని ప్రచారం చేయవద్దని, శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని ప్రజలకు సూచించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు పోలీసు యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉంటుందని, ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలమనేరు ఆర్డిఓ భవాని సంబంధిత మునిసిపల్, రెవెన్యూ మరియు పోలీసు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# చిత్తూరు జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి పర్యవేక్షణకు 27 మండలాల్లో ప్రత్యేక బృందాల ఏర్పాటు

## మండలాల వారీగా తహసీల్దార్లు, పోలీసు సిబ్బంది, వీడియోగ్రాఫర్ల నియామకం-జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్

ప్రజాభూమి ప్రతినిధి,చిత్తూరు:లి చిత్తూరు జిల్లాలో రెండో విడత సాధారణ ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు--2026తో పాటు స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్--ఎంసీసీ) అమలును పర్యవేక్షించేందుకు 27 మండలాల్లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం విజయవాడ వారు 2026 అక్టోబర్ 14న జారీ చేసిన ఉత్తర్వుల మేరకు రాష్ట్రంలో రెండో విడత సాధారణ ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రకటించారు. అలాగే పట్టణ స్థానిక సంస్థలు, గ్రామ పంచాయతీల సాధారణ ఎన్నికలకు సంబంధించిన ఎన్నికల షెడ్యూళ్లు కూడా ప్రకటించారు. దీంతో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన ఎన్నికల ప్రవర్తనా నియమావళి తక్షణమే అమలులోకి వచ్చిందని, రాష్ట్రంలో గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఇది అమలులో ఉంటుందని జిల్లా కలెక్టర్ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో చిత్తూరు జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలును మండలాల వారీగా పర్యవేక్షించేందుకు తహసీల్దార్లు, పోలీసు సిబ్బంది, వీడియోగ్రాఫర్లతో ప్రత్యేక బృందాలను నియమించారు. ఎన్నికల సమయంలో నిబంధనల అమలును పర్యవేక్షించడం, సంబంధిత అధికారుల సమన్వయంతో విధులు నిర్వహించడం ఈ బృందాల బాధ్యతగా ఉంటుంది.

### జిల్లాలోని మండలాల వారీగా నియమితులైన అధికారులు

జిల్లాలోని బైరెడ్డిపల్లి మండలానికి ఎం.ఎస్. ప్రసన్న కుమార్, బంగారుపాళ్యం మండలానికి ఎస్. షబ్బీర్ బాషా, చిత్తూరు మండలానికి బి. కల్యాణి, గంగాధర నెల్లూరు మండలానికి సి.కె. శ్రీనివాసులు, గంగవరం మండలానికి పి. రేఖ, గుడిపాల మండలానికి పూజారి శ్రీనివాసులు, గుడుపల్లి మండలానికి టి. సీతారాం, ఐరాల మండలానికి ఎ. రామకృష్ణ, కార్వేటినగరం మండలానికి కె. నాగరాజు, కుప్పం మండలానికి పి. రమేష్ బాబులను ఎంసీసీ బృందాల తహసీల్దారు సభ్యులుగా నియమించారు. అదేవిధంగా నగరి మండలానికి డి. రవి కుమార్, నింద్ర మండలానికి ఎం. ఈశ్వర్ బాబు, పలమనేరు మండలానికి ఆర్. రమేష్ రెడ్డి, పలసముద్రం మండలానికి ఎన్.ఎం. గుర్రప్ప, పెద్దపంజాణి మండలానికి జి. రామమూర్తి, పెనుమూరు మండలానికి ఎం. లోకేశ్వరి, పులిచెర్ల మండలానికి ఆర్. జయసింహా, పూతలపట్టు మండలానికి వి. ఉదయ్ సంతోష్, రామకుప్పం మండలానికి బి. కౌశలే, రొంపిచెర్ల మండలానికి పి. కిరణ్ కుమార్, ఎస్.ఆర్.పురం మండలానికి ఎస్. లోకనాథ పిళ్లైలను నియమించారు.మిగిలిన మండలాలైన శాంతిపురానికి ఎం. ప్రకాష్ బాబు, తవణంపల్లికి ఎస్. మాధవరాజు, వి.కోటకు బి. సూర్య ప్రకాష్ నాయక్, వెదురుకుప్పానికి కె. బాబు, విజయపురానికి జె. ముని శైలజ, యాదమరికి జి.పి. పార్థసారథిలను సంబంధిత బృందాల తహసీల్దారు సభ్యులుగా నియమించారు.

పోలీసు, వీడియోగ్రఫీ సిబ్బందితో సమన్వయం ప్రతి మండలానికి సంబంధించి ఉత్తర్వుల్లో పేర్కొన్న పోలీసు సిబ్బంది, వీడియోగ్రాఫర్లను కూడా ప్రత్యేక బృందాల్లో భాగంగా నియమించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలును సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.ఈ ఉత్తర్వుల ప్రతులను సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి అధికారులు (ఎంపీడీవోలు) ద్వారా నియమిత అధికారులకు పంపించాలని, వారు తమకు కేటాయించిన విధులను నిర్వహించి, విధి నిర్వహణకు సంబంధించిన ఉత్తర్వుల అందిన ప్రతులను జిల్లా కార్యాలయానికి సమర్పించాలని సూచించారు. అలాగే చిత్తూరు రెవెన్యూ డివిజనల్ అధికారి, చిత్తూరు జిల్లా పోలీసు సూపరింటెండెంట్, చిత్తూరు, పుత్తూరు, కుప్పం సబ్ డివిజన్ల పోలీసు అధికారులు, జిల్లా ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, సంబంధిత స్టేషన్ హౌస్ అధికారులు, జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా తహసీల్దార్లకు ఈ ఉత్తర్వుల ప్రతులను పంపించి అవసరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉంటుందని, సంబంధిత అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ పై ప్రకటనలో తెలిపారు

# వర్షాలతో రైతుల్లో కొత్త ఆశలు -బి.ఎన్ కండ్రిగ మండలంలో ఊపందుకున్న వరి నాట్లు

## మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో సాగుకు సిద్ధమైన రైతులు

ప్రజా భూమి ప్రతినిధి: బుచ్చినాయుడు కండ్రిగ

తిరుపతి జిల్లా, బి ఎన్ కండ్రిగ మండలంలో ఎన్నో రోజులుగా వర్షాల కోసం ఎదురుచూస్తున్న రైతులకు గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు కొత్త ఆశలను చిగురింపజేశాయి. వర్షాలు లేక సాగు పనులు ప్రారంభించలేక ఇబ్బందులు పడుతున్న రైతులు, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో వరి నాట్లు వేసేందుకు రైతులు సిద్ధమవుతుండగా, ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో నాట్లు వేసే పనులు కొనసాగుతున్నాయి. వర్షాలు సకాలంలో కురవకపోవడంతో పొలాల్లో సాగు పనులు ముందుకు సాగక రైతులు ఆందోళన చెందారు. పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేయాలనే ఆశతో ఆకాశం వైపు ఎదురు చూశారు. ఈ నేపథ్యంలో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు రైతులకు కొంత ఊరటనిచ్చాయి. పొలాల్లో తగినంత తేమ ఏర్పడటంతో దుక్కులు దున్నడం, పొలాలను నాట్లకు సిద్ధం చేయడం వంటి పనులకు రైతులు శ్రీకారం చుడుతున్నారు.బి ఎన్ కండ్రిగ మండలంలోని పలు గ్రామాల్లో రైతులు వరి సాగు పనులను వేగవంతం చేస్తున్నారు. ఇప్పటికే నారుమళ్లు సిద్ధం చేసుకున్న రైతులు వరి నాట్లు వేసే పనుల్లో నిమగ్నమవుతున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో పొలాలను సిద్ధం చేసుకుంటూ నాట్లకు ఏర్పాట్లు చేస్తున్నారు.వర్షాలు మరికొన్ని రోజులు ఇదే విధంగా కొనసాగితే వరి సాగు మరింత ఊపందుకునే అవకాశం ఉందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అయితే పంట దిగుబడులు ఆశాజనకంగా రావాలంటే వర్షాలు సకాలంలో కురవడంతో పాటు సాగునీరు అందుబాటులో ఉండటం కూడా కీలకమని రైతులు పేర్కొంటున్నారు. మొత్తంగా, వర్షాల కోసం ఎదురుచూసిన అన్నదాతలకు ప్రస్తుత వర్షాలు కొంత ఉపశమనం కలిగించడంతో మండలంలో వ్యవసాయ పనులు క్రమంగా ఊపందుకుంటున్నాయి. రైతులు ఆశించిన స్థాయిలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని స్థానిక రైతులు ఆకాంక్షిస్తున్నారు.



# బీసీలకు 34% కాదు 40% స్థానాలను ఇస్తున్నాం: ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి



ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్

గడించిన నాలుగు దశాబ్దాల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో బీసీల రాజకీయ ఎదుగుదలకు, సామాజిక మరియు ఆర్థిక పురోగతికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్న తెలుగుదేశం పార్టీ నేడు ఎన్డీయే కూటమి పార్టీలోని ఇతర భాగస్వామ్య పక్షాల సహకారంతో బీసీలకు 34% శాతం కాకుండా నలభై శాతం పైగా స్థానాలను కేటాయించడం శుభపరిణామం అని శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పేర్కొన్నారు.

**తమ ఎదుగుదలకు తోడ్పడింది తెలుగుదేశం పార్టీనే**

తెలుగుదేశం పార్టీకి వెన్నుదన్నుగా ఉన్నారన్న ఏకైక కారణంగా బీసీలకు 34 శాతం రిజర్వేషన్ ఇవ్వడాన్ని సహించలేని జగన్ కేసులేసి అడ్డుకున్నాడని ఆరోపించారు. కానీ, ఎన్డీయే కూటమి ప్రభుత్వం చంద్రబాబు చొరవతో ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల్లో 40 శాతం రిజర్వేషన్ ఇచ్చి బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడం శుభపరిణామం అని కొనియాడుతూ, తమ బీసీ వర్గాల పట్ల ఎన్డీయే కూటమి ప్రభుత్వం మరియు తెలుగుదేశం పార్టీ చూపిన ఆత్మీయ ఆదరణకు కృతజ్ఞతగా శుక్రవారం స్థానిక శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ని పలువురు బీసీ నాయకులు కలిసి ధన్యవాదాలు తెలిపి, వారిని దుశ్శాలువాతో ఘనంగా సత్కరించి, విఘ్నేశ్వరుని దారు శిల్పాన్ని ఆయనకు బహూకరించారు.

**తండ్రి బాటలో తనయుడు**

శ్రీకాళహస్తి నియోజకవర్గ రాజకీయ చరిత్రలో కూడా గతంలో తన తండ్రి స్వర్గీయ బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఆదరించిన విధంగానే, నేడు తాను కూడా బీసీలకు 40% శాతానికి మించి స్థానాలను కేటాయించడం జరుగుతున్నదని, 'బి' అంటే...బొజ్జల/బీసీ అనే విధంగా గత నాలుగు దశాబ్దాలుగా బొజ్జల కుటుంబానికి బీసీ లతో అవినాభావ సంబంధం ఏర్పడిందని కొనియాడారు.

**సమాజ అభివృద్ధిలో బీసీలది అతిముఖ్యమైన పాత్ర**

భారతదేశంలో ఏ రంగమైనా అభివృద్ధి పథంలో ముందుకు వెళ్ళాలంటే సమాజంలో సగభాగం ఉన్న బీసీల పురోభివృద్ధితోనే అది సాధ్యం అవుతుందని, కాబట్టే నాటి యన్టీఆర్ నుండి నేటి చంద్రబాబు వరకు తెలుగుదేశం పార్టీ అవలంబిస్తున్న బీసీ విధానం మేరకు బీసీల సామాజిక, ఆర్థిక, రాజకీయ ఎదుగుదలకు సీఎం చంద్రబాబు నాయుడు అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నారు. బీసీలకు రాజకీయంగా అన్యాయం జరగనివ్వబోమని ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరఫున బీసీలకు ఏకంగా 40 శాతం టిక్కెట్లు కేటాయించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ డా.జి.దశరథాచారి, వన్నెకుల క్షత్రియ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు, క్లస్టర్ ఇన్‌ఛార్జి పేట బాలాజీ రెడ్డి, డిల్లీ బాబు, బీమాల మునికృష్ణ, మునిరాజా యాదవ్, గాండ్ల తెలికుల సాధికార సమితి రాష్ట్ర సభ్యులు కన్నావరం హరిబాబు, భాస్కర్ గౌడ్, నాగరాజు, నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్, యం.యస్.రెడ్డి, మురళి, రామచంద్రయ్య, సిద్దులయ్య, పూల శేఖర్, శంకరయ్య, గాజుల భగత్, గగన్ యాదవ్, సులేమాన్, శివ ఆచారి, శేషు, బాబు రెడ్డి, ఓంకార్, చంద్రశేఖర్, రమేష్, మణెయ్య, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా సవరణకు గడువు పెంపు

## అక్టోబర్ 22 వరకు క్లెయిమ్లు, అభ్యంతరాల పరిష్కారం

## 30న తుది ఓటర్ల జాబితా విడుదల

## జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్

ప్రజాభూమి ప్రతినిధి,చిత్తూరు:

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియకు సంబంధించి క్లెయిమ్లు, అభ్యంతరాల పరిష్కారానికి గడువు పొడిగించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2026 జూలై 1వ తేదీని అర్హత తేదీగా పరిగణిస్తూ చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అక్టోబర్ 22 వరకు క్లెయిమ్లు, అభ్యంతరాల పరిష్కారానికి అవకాశం కల్పించినట్లు వివరించారు. ఎన్నికల సంఘం ఈ నెల 14న జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం నోటీసుల ప్రక్రియ కూడా అప్పటివరకు కొనసాగుతుందన్నారు. అక్టోబర్ 30న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నట్లు స్పష్టం చేశారు. ఓటర్లు తమ పేర్లు, చిరునామాలు, ఇతర వివరాలు జాబితాలో సక్రమంగా నమోదయ్యాయో లేదో పరిశీలించుకోవాలని సూచించారు. ఏవైనా తప్పులు, అభ్యంతరాలు ఉంటే నిర్ణీత గడువులోగా సంబంధిత అధికారులను సంప్రదించి పరిష్కరించుకోవాలన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. రాజకీయ పార్టీలకు సైతం సవరించిన షెడ్యూల్ను లిఖితపూర్వకంగా తెలియజేయాలన్నారు. జిల్లా కలెక్టర్ పై ప్రకటనలో తెలిపారు.

# బుచ్చినాయుడు కండ్రిగలో టీడీపీ ఎన్నికల కసరత్తు ప్రారంభం

## 28 పంచాయతీల్లో సర్పంచ్ అభ్యర్థుల ఎంపికపై నాయకుల చర్చలు-ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలపైనా సమాలోచనలు




ప్రజా భూమి ప్రతినిధి: బుచ్చినాయుడు కండ్రిగ, స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో తిరుపతి జిల్లా బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో తెలుగుదేశం పార్టీ ఎన్నికల సన్నద్ధతపై దృష్టి సారించింది. సత్యవేడు నియోజకవర్గ టీడీపీ కార్యక్రమాల సమన్వయకర్త కూరపాటి శంకర్ రెడ్డి ఆదేశాల మేరకు మండల పార్టీ అధ్యక్షుడు చెంచు రామానాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం మండల టీడీపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని 28 గ్రామ పంచాయతీల సర్పంచ్ అభ్యర్థులతో పాటు 10 ఎంపీటీసీ స్థానాలు, జడ్పీటీసీ, ఎంపీపీ పదవులకు సంబంధించిన ఆశావహుల ఎంపికపై పార్టీ నాయకులు సుదీర్ఘంగా చర్చించారు.

**గ్రామస్థాయి అభిప్రాయాలకే ప్రాధాన్యం**

మండలంలోని ప్రతి పంచాయతీలో స్థానిక పరిస్థితులు, పార్టీ నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని అభ్యర్థులను ఎంపిక చేయాలని సమావేశంలో చర్చించినట్లు తెలిసింది. ఆయా గ్రామాల్లో పార్టీ బలోపేతం, నాయకుల మధ్య సమన్వయం, అభ్యర్థుల ఎంపిక వంటి అంశాలపై నాయకులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. పార్టీ నిర్ణయానికి అనుగుణంగా ఎంపికైన అభ్యర్థులకు నాయకులు, కార్యకర్తలు సహకరించాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామస్థాయి నుంచి పార్టీ శ్రేణులను సమాయత్తం చేయాలని నాయకులు చర్చించారు. గ్రామ కమిటీల అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లపై దృష్టి సారించాలని సూచించారు. అభ్యర్థుల ఎంపికలో స్థానిక పరిస్థితులు, ప్రజల అభిప్రాయాలుపార్టీ శ్రేణుల సూచనలను పరిగణనలోకి తీసుకుని ముందుకు సాగాలని సమావేశంలో అభిప్రాయపడినట్లు సమాచారం.

**సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచన**

మండలంలోని 28 గ్రామ పంచాయతీలతో పాటు 10 ఎంపీటీసీ స్థానాలు, జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలకు సంబంధించి ఆశావహుల ఎంపికపై చర్చించడం ద్వారా పార్టీ నాయకులు స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారించారు. పార్టీ నిర్ణయించిన అభ్యర్థుల విజయానికి సమష్టిగా కృషి చేయాలని, గ్రామస్థాయిలో నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని సమావేశంలో సూచించారు. ఈ సమావేశంలో తిరుపతి పార్లమెంట్ టీడీపీ మీడియా సమన్వయకర్త కందేరి కార్తీక్ చౌదరి, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ కన్నయ్య నాయుడు, సింగిల్ విండో చైర్మన్ భాస్కర్ యాదవ్, క్లస్టర్ ఇన్‌చార్జ్ మునిచంద్ర నాయుడు, రవి నాయుడు, మధు నాయుడు, మునిరాజా, తండా రమేష్, భూపయ్య, శ్రీనివాసులు తదితరులతో పాటు మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల గ్రామ కమిటీ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దేవీ నవరాత్రుల సందర్భంగా దక్షిణ కాళికాదేవి ఆలయంలో హోమం - వెయ్యి మంది భక్తులకు అన్నదాన ప్రసాదం పంపిణీ : కాటంరెడ్డి పవిత్ర రెడ్డి





ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి రూరల్

దేవీ నవరాత్రుల పవిత్ర సందర్భంగా ఈరోజు వేదాం గ్రామంలోని శ్రీశ్రీశ్రీ దక్షిణ కాళికాదేవి అమ్మవారి ఆలయంలో నిర్వహించిన హోమం కార్యక్రమంలో శ్రీకాళహస్తి నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి అల్లుడు కాటంరెడ్డి కౌశిక్ రెడ్డి, కుమార్తె కాటంరెడ్డి పవిత్ర రెడ్డి బియ్యపు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలు, హోమం కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. అనంతరం నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో సుమారు వెయ్యి మంది భక్తులకు అన్నదాన ప్రసాదాన్ని పంపిణీ చేశారు. దేవీ నవరాత్రుల సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించడం పట్ల భక్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

# తొట్టంబేడు మండల ఎంపీపీగా చింతా రాజేంద్రకు అవకాశం?

## - మండల వ్యాప్తంగా ఆసక్తికర చర్చ




ప్రజా భూమి ప్రతినిధి తొట్టంబేడు

తొట్టంబేడు మండల రాజకీయాల్లో ఇప్పుడు హాట్ టాపిక్ ఒక్కటే – తొట్టంబేడు మండల ఎంపీపీ పీఠం ఎవరిని వరిస్తుందనేది. ఈ క్రమంలో లింగమనాయుడుపల్లి పంచాయతీ కురవకున్నేరి గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి చింతా రాజేంద్ర పేరు బలంగా వినిపిస్తోంది.మండలంలో బలమైన ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన నేతగా, నిత్యం ప్రజల్లో ఉండే వ్యక్తిగా చింతా రాజేంద్రకు మంచి పట్టు ఉంది. అందుకే మండల ఎంపీపీ పదవికి ఆయనే బలమైన పోటీదారుడని మండల ప్రజలు, రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**అగ్రనేతల అండదండలు**

చింతా రాజేంద్రకు శ్రీకాళహస్తి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లా వైసీపీ ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవ నాయుడు ఆశీస్సులు మెండుగా ఉన్నాయని చెబుతున్నారు. జిల్లా స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ పెద్దలతో ఆయనకు ఉన్న సత్సంబంధాలే ఆయనకు కలిసొచ్చే అంశంగా మారింది.

**దళితుల పక్షాన నిత్య పోరాటయోధుడు**

చింతా రాజేంద్రను కేవలం ఒక రాజకీయ నాయకుడిగా కాకుండా, దళిత జాతి ఆత్మబంధువుగా మండల ప్రజలు చూస్తారు.

విద్యా, ఉద్యోగాల్లో అండ మండలంలోని దళిత యువతకు ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించడంలో, స్కాలర్షిప్లు, హాస్టల్ సౌకర్యాలు అందేలా అధికారులతో మాట్లాడి పరిష్కరించడంలో ఆయన ముందుంటారు.

**సంక్షేమ పథకాల అమలుకు కృషి**

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో దళితులకు చెందిన భూముల సమస్యలు, ఇళ్ల పట్టాల సమస్యలు, దళితులకు రావాల్సిన సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు చేరేలా ఆయన నిరంతరం కృషి చేశారని స్థానికులు చెబుతున్నారు.

**అంబేద్కర్ ఆశయ సాధన**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రతి ఏటా ఘనంగా నిర్వహిస్తూ, దళితుల్లో చైతన్యం నింపుతున్నారు. ఎక్కడ దళితులపై అన్యాయం జరిగినా, అది తన సొంత సమస్యగా భావించి అండగా నిలబడి న్యాయం జరిగే వరకు పోరాడే తత్వం ఆయన సొంతం.

సేవా కార్యక్రమాలు: కరోనా సమయంలో సైతం మండలంలోని పేద దళిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు, ఆర్థిక సాయం అందించడంలో ఆయన చేసిన సేవలను ప్రజలు ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నారు.

ఇలాంటి నాయకుడికి ఎంపీపీ పదవి ఇస్తే, కేవలం దళితులే కాకుండా మండలంలోని అన్ని వర్గాల ప్రజలను కలుపుకుని, అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తారని స్థానిక ప్రజలు బలంగా కోరుకుంటున్నారు.బలమైన సామాజిక వర్గం అండ, సీనియర్ నాయకుల మద్దతు, అంతకుమించి ప్రజల్లో ఉన్న మంచి పేరుతో చింతా రాజేంద్రకే ఎంపీపీ పదవి వరించడం ఖాయమని తొట్టంబేడు మండల వ్యాప్తంగా జోరుగా చర్చ సాగుతోంది.

# రాష్ట్రంలోఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాజకీయ విగ్రహాలకు ముసుగులు!






ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట

రేణిగుంట పట్టణములో: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి రావడంతో రేణిగుంటలో అధికారులు చర్యలు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం నుంచి బహిరంగ ప్రదేశాల్లో ఉన్న రాజకీయ నాయకుల విగ్రహాలు, రాజకీయ పార్టీ గుర్తులను పోలి ఉండే చిహ్నాలకు ముసుగులు వేస్తున్నారు. ఎన్నికల సమయంలో ఏ రాజకీయ పార్టీకి అనుకూల ప్రచారం జరగకుండా, అన్ని పార్టీలకు సమాన అవకాశాలు కల్పించడమే ఈ చర్యల ముఖ్య ఉద్దేశం. ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, అధికారుల ఆదేశాలకు అనుగుణంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అమలు చేస్తున్నారు. కార్యక్రమంలో వేంకటేష్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# తొట్టంబేడులో బీసీ నేతలకు అన్యాయం

## ఒకే ఒక్క సర్పంచ్ స్థానం కేటాయింపుపై కూటమి నేతల ఆగ్రహం

ప్రజా భూమి ప్రతినిధి తొట్టంబేడు

శ్రీకాళహస్తి నియోజకవర్గం పరిధిలోని తొట్టంబేడు మండలంలో సర్పంచ్ రిజర్వేషన్ల కేటాయింపు తీవ్ర వివాదంగా మారింది.మండలంలో మొత్తం 27 గ్రామ పంచాయతీలు ఉండగా, బీసీ మహిళలకు కేవలం ఒక్క స్థానం మాత్రమే కేటాయించడంపై మండల కూటమి నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.చంద్రబాబు నాయుడు బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చినప్పటికీ, ఆచరణలో తొట్టంబేడు మండలంలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.27 పంచాయతీలు ఉన్న మండలంలో బీసీలకు సముచిత స్థానం కల్పించడం లేదని,ఇది చాలా దురదృష్టకరమని పేర్కొన్నారు.కాగా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ నివేదిక ఆధారంగా బీసీ రిజర్వేషన్లను ఖరారు చేసింది.సుప్రీంకోర్టు 50 శాతం సీలింగ్ నిబంధనతో 34 శాతం అమలుకు బ్రేకు పడటంతో,ప్రభుత్వం ప్రత్యామ్నాయ లెక్కలతో ముందుకు వెళ్లింది.గ్రామ సర్పంచ్,ఎంపీటీసీ స్థానాలకు మండలాన్ని యూనిట్‌గా తీసుకుని రిజర్వేషన్లు నిర్ణయించారు.ఎస్సీ, ఎస్టీలకు జనాభా దామాషా ప్రకారం కేటాయించిన తర్వాత మిగిలిన పరిధిలోనే బీసీలకు సర్దుబాటు చేయడం వల్ల కొన్ని మండలాల్లో బీసీ స్థానాలు తక్కువగా వస్తున్నాయి.తొట్టంబేడు మండలంలో బీసీ జనాభా గణనీయంగా ఉన్నప్పటికీ ఒక్క బీసీ మహిళకే అవకాశం ఇవ్వడం బాధాకరమని, దీనిని పునఃపరిశీలించాలని మండల కూటమి నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఈ అంశంపై జిల్లా పంచాయతీ అధికారికి వినతిపత్రం అందజేసేందుకు సిద్ధమవుతున్నట్టు తెలిపారు.



# ఎంపీ మిథున్ రెడ్డి పై దాడిని తీవ్రంగా ఖండించిన శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి



ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్

జెడ్ ప్లస్ కేటగిరీ సెక్యూరిటీ ఉన్న ఎంపీ మిథున్ రెడ్డి, ఆయన గన్ మెన్లపై రాళ్లు, కర్రలతో దాడులు చేయడం అత్యంత దారుణం. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, కేంద్ర బలగాల పర్యవేక్షణలోనే ఎన్నికలు నిర్వహించాలని విజ్ఞప్తి. వెంటనే ఎన్నికలను నిలిపివేయాలని లేదా రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్. ఈ దాడికి పాల్పడిన వారు ఎక్కడ దాక్కున్నా వదిలిపెట్టబోమని, చట్టపరంగా తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరిక.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ,ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష నాయకులపై, ప్రజాప్రతినిధులపై ఈ స్థాయిలో రౌడీయిజం, దాడులు జరగడం అన్యాయమని ఆయన మండిపడ్డారు. జెడ్ కేటగిరీ భద్రత కలిగిన ఎంపీ మిథున్ రెడ్డి వాహనాలపై దాడులు చేసి, గన్ మెన్ల తలలు పగలగొట్టడం చూస్తుంటే రాష్ట్రంలో అసలు పరిపాలన, శాంతిభద్రతలు ఉన్నాయా అని ప్రశ్నించారు.ఇలాంటి భయాందోళనల వాతావరణంలో సాధారణ ప్రజలు కానీ, నాయకులు కానీ నామినేషన్లు వేసే పరిస్థితి లేదని అన్నారు. అందుకే భారత కేంద్ర ఎన్నికల కమిషన్, రాష్ట్రపతి, ప్రధానమంత్రి వెంటనే కలగజేసుకుని, రాష్ట్రంలో ఉద్రిక్తతలను అరికట్టాలని కోరారు. కేంద్ర బలగాల పహారా మధ్య మాత్రమే ఎన్నికలు నిర్వహించాలని, లేకపోతే ఎన్నికలను తక్షణమే నిలిపివేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ దాడికి పాల్పడిన ప్రతి ఒక్కరినీ రాబోయే రోజుల్లో చట్టం ముందుకు తీసుకువస్తామని, వైఎస్ఆర్‌సీపీ శ్రేణులంతా పెద్దారెడ్డి, మిథున్ రెడ్డిల వెంటే ఉన్నారని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

# రేణిగుంటలో వైభవంగా నాగ విగ్రహాల ప్రతిష్ఠాపన





ప్రజాభూమి ప్రతినిధి రేణిగుంట.

నాగదేవతలకు విశేషాలు పూజలు నిర్వహించిన గ్రామస్తులు, భక్తులు. రేణిగుంట పట్టణం భగత్ సింగ్ కాలనీలో వెలసిన శ్రీ సత్యమ్మ తల్లి ఆలయంలో శుక్రవారం నాగ విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమాన్ని శాస్త్రోక్తకంగా నిర్వహించారు. ముందుగా సత్యమ్మ తల్లికి విశేష అలంకరణలు చేశారు. అనంతరం నాగమ్మ తల్లి విగ్రహాలకు పండితులు పాలు పెరుగు పసుపు , కుంకుమ విశేష సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. విగ్రహ ఉభయ దారులు విశ్రాంత రైల్వే ఉద్యోగులు రాజేంద్ర, అప్పరెడ్డి, షణ్ముగం, గౌతమ్ సత్య ప్రసాద్ , డిపి నాయుడు, యోగ వెంకటేష్, వీఆర్వోలు రామ్మూర్తి , సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం ఘనంగా విశేష హోమ పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, స్థానికులు పాల్గొన్నారు.

ప్రజాభూమి
జనరల్ 10
శనివారం 17 అక్టోబరు 2026

## కాత్యాయిని అలంకరణలో శ్రీ ఉగ్ర ప్రత్యంగిరా దేవి..!



ప్రజాభూమి ప్రతినిధి, చంద్రగిరి:
తొండవాడ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న శ్రీ ఉగ్ర ప్రత్యంగిరా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం ఉదయం ఉగ్ర ప్రత్యంగిరా దేవి అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహించి, పట్టు వస్త్రాలు కట్టి, బంగారు ఆభరణములు, సువాసనలు గోలిపే పుష్పాలతో శింగారించి, ధూప,దీప, నైవేద్య, కర్పూర హారతులు ఇచ్చి భక్తులకు దర్శన ఏర్పాట్లు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తిని వాహన మండపము నకు తీసుకువచ్చి కాత్యాయని అలంకరణ నిర్వహించి, కాత్యాయని హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయదారులుగా తిరుపతికి చెందిన జె. లత, వడమాల పేటకు చెందిన నూతల పాటి శ్రీనివాసులు అండ్ బ్రదర్స్ వ్యవహరించిరి. వీరికి ఆలయ పీఠాధిపతి పూజారి సూరిస్వామి, వేద పండితులు జి. సీతారామ శర్మ తీర్థప్రసాదాలు ఇచ్చి సత్కరించిరి. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహకులు పూజారి శివశంకర్ ప్రసాద్, వడ్డీ కాసుల రామ్మూర్తి నాయుడు పాల్గొన్నారు.

## ఆర్థిక అక్షరాస్యత పై అవగాహన సదస్సు... సింగిల్ విండో చైర్మన్ కృష్ణమనేని సావిత్రి..!



ప్రజా భూమి ప్రతినిధి, చంద్రగిరి:
తిరుపతి జిల్లా, చంద్రగిరి నియోజకవర్గం,పాకాల మండలం, గాదంకి గ్రామంలో పాకాల పి.ఎ.సి.ఎస్ ఖాతాదారులకు మరియు సంఘ సభ్యులకు ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సు సంఘము అధ్యక్షురాలు కృష్ణమనేని సావిత్రి ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించడం జరిగినది.ఈ సందర్భంగా సింగల్ విండో చైర్మన్ కృష్ణమనేని సావిత్రి మాట్లాడుతూ సంఘము నందు రైతులు అందరూ రూ:300 చెల్లించి సభ్యత్వము తీసుకుని అదే విధముగ సంఘంము ద్వారా అందిస్తున్న స్వల్పకాలిక,దీర్ఘకాలిక ఋణములు మరియు హౌస్ మార్టిగేజ్ లోన్స్ పొంది తిరిగి సకాలంలో ఋణములు చెల్లించి రైతులు అందరూ అభివృద్ధి బాటలో పయనిస్తూ సంఘమును కూడా బలోపేతం చేయవలసినదిగా కోరడమైనది.ఈ సమావేశంలో డీసీసీబి సూపర్వైజర్ ఈ.దొరస్వామి,సంఘ ముఖ్య కార్య నిర్వహణ అధికారి బీ.మురళీ కృష్ణ మరియు సంఘ సిబంది,రైతులు పాల్గొనారు.

## వైభవముగా శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణోత్సవం.!



ప్రజాభూమి ప్రతినిధి, చంద్రగిరి:
నియోజకవర్గం పరిధిలోని, పాకాల మండలం, ఊట్లవారిపల్లి సమీపం లో ఆనందగిరి పై వెలసిన శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో షష్టి తిధి రోజు ఘనంగా స్వామీ వారి కల్యాణోత్సవం శుక్రవారం నిర్వహించామని ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ నాయుడు పేర్కొన్నారు. శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఉభయదాతలు పి.వి.రమణ,పి.అరుణ దంపతులు కలిసి కళ్యాణోత్సవం,అన్నదానం,అభిషేకం, వాహన సేవ నిర్వహిం చారు.కళ్యాణోత్సవంలో పాల్గొనదలచిన దంపతులు 1500 రూపాయలు రుసుము చెల్లించి స్లాట్ బుకింగ్ చేసుకోవాలని తెలిపారు.స్లాట్ బుకింగ్ చేసుకోదలచిన వారు ఆలయ సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు.ప్రతి మాసంలో వచ్చే కృత్తికకు కృత్తిక దీపోత్సవం,శుక్ల పక్షి షష్టి రోజున స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించబడునని తెలియజేశారు.ప్రతి రోజు అభిషేకాలు జరుగుతున్నాయి,అందులో భాగంగా ప్రతి మంగళవారం ప్రత్యేక అభిషేకాలు,పూజలు నిర్వహించబడుతున్నాయి.కార్యక్రమంలో దంపతులు,భక్తులు,ప్రధాన అర్చకులు హెచ్.ఎన్.కృష్ణమూర్తి శర్మ,కోరా ప్రకాష్ నాయుడు,తేనెపల్లి మణి,మబ్బు భాస్కర్,బాలు,పాకాల మణి తదితరులు పాల్గొన్నారు.

## హోన్నూరు దర్గా ఉరుసు మహోత్సవం పోస్టర్ ఆవిష్కరణ చేసిన షకీల్ సఫి



ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం
అనంతపురం జిల్లా, బొమ్మనహాళ్ మండలం లోని ప్రసిద్ధి చెందిన హోన్నూరు దర్గా (హజ్రత్ ఖ్వాజా సయ్యద్ షా సూఫీ శర్మస్త్ వలి ర.అ ) 348వ ఉరుసు మహోత్సవం సందర్బంగా, రాష్ట్ర ముతవల్లిల అధ్యక్షులు కె.యం. షకీల్ సఫి పోస్టర్ ను తన కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దర్గా ముతవల్లి సజ్జాద నషీన్ సయ్యద్ షా రహంతుల్లా హుస్సేని సాహెబ్, వారి కుమారులు సయ్యద్ షా ఖాజా పీరా హుస్సేని సాహెబ్, సయ్యద్ ఇనాయతుల్లా హుస్సేని, పారిశ్రామిక వేత్త కె.యండి. జునైద్, యాలంకూర్ దాదా ఖలందర్, జేసీ శామీర్, గౌస్ మొహుద్దీన్, ఖభరస్థాన్ కేర్ టేకర్ బాబావలి మరియు పలువురు ముస్లిం సోదరులు పాల్గొన్నారు. ఉరుసు మహోత్సవానికి అందరూ విచ్చేసి, స్వామి వారి ఆశీస్సులు పొందాలని కోరుకుంటున్నాము.

## శింగనమల సీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన డీసీహెచ్ఎస్

### వైద్యుల హాజరు, మందుల లభ్యత, పారిశుధ్యంపై సమీక్ష-డా. ఈ. వెంకటరావు



ప్రజా భూమి శింగనమల
శింగనమల జిల్లా ఆసుపత్రి సేవల కోఆర్డినేటర్ (డీసీహెచ్ఎస్) డా. ఈ. వెంకటరావు శుక్రవారం శింగనమల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)ను ఆకస్మికంగా సందర్శించి ఆసుపత్రి సేవలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఐవీఆర్ఎస్ నివేదికను పరిశీలించి, వైద్యుల హాజరు, రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యతపై ఆరా తీశారు. అలాగే సేవలకు సంబంధించి అందిన ఫిర్యాదులు, అవినీతి ఆరోపణలు, ఆసుపత్రి పారిశుధ్యం, వ్యర్థాల నిర్వహణ, బయోమెడికల్ వ్యర్థాల తొలగింపు విధానాలను పరిశీలించారు. ఆసుపత్రిలో ఏవైనా లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దుకోవాలని, ఐవీఆర్ఎస్ ద్వారా అందే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని సిబ్బందికి సూచించారు. రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతగా పనిచేయాలని ఆదేశించారు.

# తాడేపల్లి ఆదేశాలతోనే వైసీపీ హింసాకాండ..

## శ్రీకాళహస్తిలో రౌడీయిజానికి తావులేదు: ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి

### స్థానిక సంస్థల ఎన్నికల వేళ టీడీపీ నాయకులపై దాడులను తీవ్రంగా ఖండించిన ఎమ్మెల్యే



ప్రజాభూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్
శ్రీకాళహస్తి: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పుంగనూరు, రాయచోటి, తిరుపతి తదితర ప్రాంతాల్లో టీడీపీ నాయకులు, అభ్యర్థులపై జరుగుతున్న దాడులను శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఓటమి భయంతోనే వైఎస్సార్‌సీపీ హింస, దాడులకు పాల్పడుతూ ప్రజల్లో భయాందోళనలు సృష్టించేందుకు కుట్రలు చేస్తోందని ఆయన మండిపడ్డారు. తాడేపల్లి ఆదేశాలతోనే అల్లర్లు: ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలను ఎదుర్కొనే ధైర్యం లేక, తాడేపల్లి నుంచి అందుతున్న ఆదేశాలతో వైఎస్సార్‌సీపీ ముఠాలు అల్లర్లకు పాల్పడుతున్నాయని విమర్శించారు. పొరుగు ప్రాంతాల నుంచి రౌడీ మూకలను తీసుకొచ్చి దాడులు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు. టీడీపీ నాయకులపై దాడులు హేయం: విపక్ష అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం, నామినేషన్ పత్రాలను లాక్కొని చించివేయడం, అభ్యర్థులపై భౌతిక దాడులకు దిగడం, అధికారులను బెదిరించి అక్రమ ఏకగ్రీవాలకు ప్రయత్నించడం వైసీపీ ఫ్యాక్షన్ రాజకీయాలకు నిదర్శనమని ధ్వజమెత్తారు. ఓటమి భయంతోనే హింస: ప్రజల మద్దతుతో సంక్షేమం, అభివృద్ధి అజెండాతో ముందుకు సాగుతున్న కూటమి ప్రభుత్వానికి దాడులు, బెదిరింపుల రాజకీయాలు చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ప్రజల్లో విశ్వాసం కోల్పోయిన వైసీపీ, ఎన్నికల్లో ఓటమి తప్పదనే భయంతోనే ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు.

శ్రీకాళహస్తిలో హింసాత్మక రాజకీయాలకు తావులేదు: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా, ప్రజాస్వామ్యబద్ధంగా జరగాలన్నదే తమ లక్ష్యమని సుధీర్ రెడ్డి స్పష్టం చేశారు. ఇతర ప్రాంతాల్లో జరుగుతున్న దాడులు, బెదిరింపుల తరహా ఘటనలు శ్రీకాళహస్తిలో చోటుచేసుకోకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఏ పార్టీకి చెందిన వారైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే సహించేది లేదని, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నాలను ఉపేక్షించబోమని హెచ్చరించారు.అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి: ఎన్నికల ప్రక్రియలో నామినేషన్ల స్వీకరణ నుంచి పోలింగ్ వరకు ప్రతి దశలోనూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, అభ్యర్థుల హక్కులకు భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. దాడులకు పాల్పడే వారిపై ఫిర్యాదుల ఆధారంగా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుని, ప్రతి అభ్యర్థికి సమాన అవకాశాలు కల్పించాలని కోరారు. ప్రజాస్వామ్యమే మా మార్గం: తెలుగుదేశం పార్టీ శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరగాలని కోరుకుంటోందని, ప్రజల తీర్పును గౌరవించడమే ప్రజాస్వామ్యానికి అసలైన నిదర్శనమని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, యువతకు ఉపాధి అవకాశాల ద్వారా ప్రజల విశ్వాసాన్ని పొందుతున్న కూటమి ప్రభుత్వానికి హింసాత్మక రాజకీయాలతో పనిలేదని స్పష్టం చేశారు.గత అరాచకాలకు ప్రజలు మర్చిపోలేదు: గతంలో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలను ప్రజలు ఇంకా మర్చిపోలేదని అన్నారు. మరోసారి అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ఎన్నికల యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. "ఇది గత ఐదేళ్ల అరాచక పాలన కాదు.. చట్టబద్ధంగా, రాజ్యాంగ విలువలకు కట్టుబడి నడుస్తున్న ప్రజా ప్రభుత్వం. ప్రజలను భయపెట్టి ఎన్నికల్లో గెలవాలనుకోవడం వైసీపీ భ్రమ మాత్రమే. శ్రీకాళహస్తిలో రౌడీయిజానికి, బెదిరింపులకు, హింసాత్మక రాజకీయాలకు తావులేదు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరగాలి.. ప్రజలే తమ ఓటుతో సరైన తీర్పు ఇవ్వాలి" అని ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి స్పష్టం చేశారు.

## తొండవాడలో 'ఫైన్‌టెక్ ల్యాబ్ కన్స్యూమబుల్స్' పరిశ్రమను ప్రారంభించిన : ఎమ్మెల్యే పులివర్తి నాని..





ప్రజాభూమి ప్రతినిధి,చంద్రగిరి:
చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని తొండవాడ గ్రామ సమీపంలో, బెంగళూరు జాతీయ రహదారి వద్ద నూతనంగా ఏర్పాటైన 'ఫైన్‌టెక్ ల్యాబ్ కన్స్యూమబుల్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్' పరిశ్రమ ప్రారంభోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. చంద్రగిరి మండలం, రెడ్డి వీధికి చెందిన యారాసి రవిచంద్ర రెడ్డి కుమారుడు, కంపెనీ వ్యవస్థాపకుడు యారాసి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ పరిశ్రమను చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని ముఖ్య అతిథిగా విచ్చేసి లాంఛనంగా ప్రారంభిం చారు. ఎమ్మెల్యే పులివర్తి నాని తొండవాడకు చేరుకోగానే స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం పరిశ్రమ ప్రాంగణం వద్ద కంపెనీ వ్యవస్థాపకులు యారాసి రవిచంద్ర రెడ్డి, యారాసి చంద్రశేఖర్ రెడ్డిలు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో సాదర స్వాగతం పలికారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ స్థల యజమాని పెద్దలు జీపాలెం సత్యనారాయణ రెడ్డి, కంపెనీ నిర్వాహకులు, స్థానిక ప్రముఖులతో కలిసి ఎమ్మెల్యే పులివర్తి నాని రిబ్బన్ కత్తిరించి పరిశ్రమను ప్రారంభించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన గావించి, కొబ్బరికాయ కొట్టి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కంపెనీ కార్యాలయంలోకి ప్రవేశించిన ఎమ్మెల్యే, శుభసూచకంగా గల్లాపెట్టెలో కొంత నగదును వేసి, వ్యాపారం దినదినాభివృద్ధి చెందాలని యాజమాన్యానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ.. నియోజకవర్గంలో నూతన పరిశ్రమల ఏర్పాటు పారిశ్రామిక పురోగతికి ఊతమిస్తుందని, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని హర్షం వ్యక్తం చేశారు. నేటి యువత కేవలం ఉద్యోగాల కోసమే ఎదురుచూడకుండా, ఇలాంటి పరిశ్రమలు, వ్యాపారాలు ప్రారంభిస్తూ మరికొందరికి ఉపాధి కల్పించే పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని పిలుపునిచ్చారు. పరిశ్రమ అభివృద్ధి చెంది మరింత మందికి ఆసరాగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా స్థల యజమాని పెద్దలు తొండవాడ వాస్తవ్యులు జీపాలెం సత్యనారాయణ రెడ్డి, ఆయన కుమారుడు జీపాలెం మహేష్ రెడ్డిలను ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా పలకరించి, కాసేపు ఆత్మీయంగా ముచ్చటించారు. అనుభవజ్ఞులైన పెద్దలను కలవడం సంతోషాన్నిచ్చిందని పేర్కొన్నారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, ఎన్డీఏ కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, కంపెనీ సిబ్బంది, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చేసిన అభివృద్ధిని - సంక్షేమాన్ని చూపించి ఓటు అడుగుదాం..

### కూటమి విజయానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి: ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ

### పార్టీ బలోపేతం నాయకుల సమన్వయం కూటమి విజయం లక్ష్యంగా శింగనమల మండల కేంద్రంలో విస్తృత స్థాయి సమావేశం





ప్రజా భూమి శింగనమల
శింగనమల మండల కేంద్రంలో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహకాల్లో భాగంగా నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశానికి శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ, ఏపీ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ మరియు శింగనమల నియోజకవర్గ పరిశీలకులు సుబ్బారెడ్డి, ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరస నాయుడు ముఖ్య,అతిథులుగా,హాజరయ్యారుఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు, కార్యకర్తలతో స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధత, పార్టీ బలోపేతం, క్షేత్రస్థాయిలో అనుసరించాల్సిన కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రతి గ్రామంలోని ప్రజలకు వివరించి, వారి ఆదరణ పొందాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చాను. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ గారు మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో అభివృద్ధిని చూసి ఓటు అడుగుదామని, ప్రజలకు చేసిన మంచిని, చేపట్టిన అభివృద్ధి పనులను వివరించి ప్రజల మద్దతు కోరుదామని కూటమి నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి గ్రామంలోనూ, ప్రతి ఇంటికీ విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలు, నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనులు, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి చేస్తున్న కృషిని ప్రజలకు వివరించి, ప్రభుత్వ లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని పేర్కొన్నారు.

**ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి**

పార్టీకి కార్యకర్తలే వెన్నెముక అని, ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా క్రమశిక్షణతో, అంకితభావంతో పనిచేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కేవలం ఎన్నికల సమయంలోనే కాకుండా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. గ్రామస్థాయిలో ప్రజలతో మమేకమై, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా నిలవాలని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు పరస్పర, సమన్వయంతో పనిచేస్తూ కూటమి ఐక్యతను మరింత బలోపేతం చేయాలని స్పష్టం చేశారు.

**అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమించాలి**

నియోజకవర్గ అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా ప్రతి ఒక్కరూ అహర్నిశలు శ్రమించాలని ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ పేర్కొన్నారు. గ్రామాల్లో రహదారులు, తాగునీరు, పారిశుధ్యం, విద్య, వైద్యం, రైతుల సంక్షేమం, మహిళల సాధికారత, యువతకు అవకాశాలు వంటి కీలక అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. ప్రతి గ్రామం అభివృద్ధి పథంలో ముందుకు సాగినప్పుడే నిజమైన ప్రజా పాలనకు అర్థం ఉంటుందని పేర్కొన్నారు.

**భవిష్యత్ తరాల బంగారు భవిష్యత్తు కోసం పనిచేయాలి**

మనమందరం చేసే కృషి కేవలం నేటి అవసరాల కోసమే కాకుండా, భవిష్యత్ తరాలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించాలనే లక్ష్యంతో ఉండాలని ఎమ్మెల్యే గారు సూచించారు. గ్రామాల్లో శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టడం, యువతకు మెరుగైన అవకాశాలు కల్పించడం, పిల్లలకు నాణ్యమైన విద్య అందించడం, రైతులకు అండగా నిలవడం, మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. నేడు మనం వేసే అభివృద్ధి పునాదులే రేపటి తరాల భవిష్యత్తుకు బలమైన ఆధారాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు.

**కూటమి ఐక్యతే బలం సమష్టి కృషితోనే విజయం**

తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేస్తూ ప్రజల విశ్వాసాన్ని మరింతగా సంపాదించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. వ్యక్తిగత అభిప్రాయాలు, విభేదాలకు తావివ్వకుండా కూటమి ప్రయోజనాలను, ప్రజల సంక్షేమాన్ని ప్రథమ ప్రాధాన్యతగా తీసుకోవాలని సూచించారు. ప్రతి గ్రామంలో పార్టీని బలోపేతం చేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. ప్రజలకు చేసిన అభివృద్ధి పనులే మనకు బలమని, ఆ అభివృద్ధిని ప్రజలకు వివరించి ఓట్లు అడుగుదామని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏపీ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ మరియు శింగనమల నియోజకవర్గ పరిశీలకులు సుబ్బారెడ్డి, ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరస నాయుడు, తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యల్లనూరు పోలీసు వారి విజ్ఞప్తి...



ప్రజా భూమి. యల్లనూరు
మండల వ్యాప్తంగా 21 గ్రామ పంచాయతీలకు సంబంధించి రాబోవు స్థానిక ఎన్నికల ప్రకటన వెలువడటంతో పుట్లూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ వంశీకృష్ణ బాధ్యతలు తీసుకున్న తర్వాత యల్లనూరు పోలీస్ స్టేషన్ చేరుకొని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించి అనంతరం ఫ్యాక్షన్ గ్రామాలైన వెన్నపూస పల్లి యల్లనూరు పాతపల్లి ఆయా గ్రామాలను సందర్శించి ప్రజలతో మమేకమైన ప్రశాంతంగా ఎలక్షన్స్ జరుపుకోవాలని ఎటువంటి గొడవలు సృష్టించకూడదని ఒకవేళ గొడవ ప్రేరేపించే వారి పైన అల్లర్లకు పాల్పడిన వారి పైన చట్టపరమైన కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు ఆయన వెంట ఏఎస్ ఐ నారాయణరెడ్డి ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# గిరిజన రైతులు చేపల పెంపకంతో అదనపు ఆదాయం పొందాలి

## సొంత పొలాల్లో ఫామ్‌పాండ్ల ఏర్పాటుకు ఉపాధి హామీ పథకం ద్వారా సహకారం - కలెక్టర్ కె. దినేష్ కుమార్



ప్రజాభూమి ప్రతినిధి రంపచోడవరం

పోలవరం జిల్లాలో 9 జలవనరుల్లో 4.10 లక్షల చేప పిల్లల విడుదలపోలవరం జిల్లాలో గిరిజన మత్స్యకారుల జీవనోపాధిని మెరుగుపరిచి, మత్స్య సంపదను పెంపొందించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం మత్స్య సంపద యోజన (PMMSY), డీఏ-జేజీయూఏ (DA-JGUA) పథకాల కింద చేప పిల్లల విడుదల కార్యక్రమాన్ని చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం ముసురుమిల్లి రిజర్వాయర్ పరిధిలోని సీతపల్లి పాత వంతెన సమీపంలో జాగారంపల్లి వద్ద చేప పిల్లల విడుదల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.

### సొంత పొలాల్లో చేపల చెరువులు ఏర్పాటు చేసుకోవాలి

గిరిజన రైతులు తమ సొంత పొలాల్లో చేపల చెరువులు (ఫామ్‌పాండ్లు) తవ్వుకునేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా సహాయం అందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. సామూహిక మత్స్య సంపద అభివృద్ధితోపాటు వ్యక్తిగత భూముల్లోనూ చేపల పెంపకం, ఆక్వాకల్చర్‌ను ప్రోత్సహిస్తే గిరిజన కుటుంబాలకు మెరుగైన ఆదాయం,ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, నెల్లూరు జిల్లాల్లో ఆక్వాకల్చర్ అభివృద్ధి చెంది, చేపలు, రొయ్యల ఉత్పత్తులు అమెరికా వంటి దేశాలకు సైతం ఎగుమతి అవుతున్నాయని గుర్తుచేశారు. పోలవరం జిల్లాలోనూ మత్స్య సంపద అభివృద్ధికి విస్తృత అవకాశాలు ఉన్నాయని, వాటిని గిరిజన రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### 9 జలవనరుల్లో 4,10,400 చేప పిల్లలు

2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లాలో గుర్తించిన 9 జలవనరుల్లో మొత్తం 4,10,400 చేప పిల్లలను విడుదల చేసేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం పీఎంఎంఎస్‌వై పథకం కింద 1,29,600, డీఏ-జేజీయూఏ పథకం కింద 2,80,800 చేప పిల్లలను కేటాయించారు. జలవనరుల్లో చేపల ఉత్పత్తి పెంచడంతోపాటు గిరిజన మత్స్యకార సహకార సంఘాల సభ్యులకు ఉపాధి, ఆదాయ అవకాశాలను మెరుగుపరచడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు.మార్గదర్శకాల మేరకు మత్స్యశాఖ అధికారులు, చేప పిల్లల విడుదల కమిటీ సభ్యులు, మత్స్యకార సహకార సంఘాల ప్రతినిధుల సమన్వయంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. మత్స్య వనరులను సద్వినియోగం చేసుకుంటూ గిరిజన కుటుం బాలు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా శాఖా పరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరపాటి ప్రశాంత్ కుమార్, సబ్ కలెక్టర్ డి. పృథ్వీరాజ్ కుమార్, మత్స్యశాఖ ప్రధా న కార్యాలయం పరిశీలకులు లాల్ మొహమ్మద్, జిల్లా మత్స్యశాఖ అధికారి ఎస్.కె. దిల్షాద్, మత్స్య అభివృద్ధి అధికారులు కె. హరీష్, తాసిల్దార్ సిహెచ్ బాలాజీ, ఎంపీడీవో ప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో హరిబాబు, పంచాయతీ కార్యదర్శి భారతి,టి.వి. రవికుమార్,గ్రామ సహాయకులు, గిరిజన మత్స్యకార సహకార సంఘాల అధ్యక్షులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు



# సివిల్ సప్లై హమాలీల కూలి రేట్లు పెంచాలి

తొమ్మిది నెలలుగా పెండింగ్‌లో కొత్త అగ్రిమెంట్

ఏఐటీయూసీ నేత రాజబాబు

ప్రజా భూమి ప్రతినిధి అడ్డతీగల

సివిల్ సప్లై హమాలీలకు లోడింగ్, అన్‌లోడింగ్ కూలి రేట్లు పెంచాలని, తొమ్మిది నెలలుగా పెండింగ్‌లో ఉన్న కొత్త కూలి రేట్ల ఒప్పందాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పోలవరం జిల్లాలో హమాలీలు శుక్రవారం విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. అడ్డతీగల ప్రాంతానికి చెందిన హమాలీలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు.ఈ సందర్భంగా ఏఐటీయూసీ సివిల్ సప్లై హమాలీల యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం. రాజబాబు మాట్లాడుతూ, పోలవరం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని గిరిజన ప్రాంతాల్లో హమాలీలు 35 నుంచి 40 ఏళ్లుగా బియ్యం బస్తాల ఎగుమతి, దిగుమతి పనులు చేస్తున్నారని తెలిపారు. మారుమూల గిరిజన గ్రామాలకు ఆహార ధాన్యాలు చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, తమ శ్రమకు తగిన వేతనం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.గతంలో గిరిజన సహకార సంస్థ (జీసీసీ) పరిధిలో మూడు రకాల పనులకు సంబంధించిన కూలి డబ్బులను నెలవారీగా చెల్లించేవారని తెలిపారు. ప్రస్తుతం బస్తాకు రూ.14 చెల్లించాల్సి ఉండగా, రూ.12.50 మాత్రమే ఇస్తున్నారని, మూడు, నాలుగు నెలలకు ఒకసారి కూలి



చెల్లింపులు జరుగుతున్నాయని ఆరోపించారు. గతంలో మాదిరిగానే అన్ని పనులకు సంబంధించిన కూలి డబ్బులను ప్రతినెలా 10వ తేదీలోపు హమాలీల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు.తొమ్మిది నెలలుగా కొత్త కూలి రేట్ల ఒప్పందం చేయకుండా కార్పొరేషన్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. వెంటనే రేట్లు పెంచి కొత్త అగ్రిమెంట్ అమలు చేయాలని, దసరా సందర్భంగా ప్రతి హమాలీకి మూడు జతల దుస్తులు, బోనస్, స్వీట్ బాక్స్ అందించాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే భవిష్యత్తులో మరిన్ని ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్మికులంతా ఐక్యంగా ఉండి యూనియన్ పిలుపులకు స్పందించాలని రాజబాబు కోరారు. అనంతరం యూనియన్ ప్రతినిధులు స్థానిక తహసీల్దార్‌ను కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎల్. గంగరాజు, ఎం. నరేష్, ఎల్. శివ, పి. రవి, కె. రాంబాబుతో పాటు పలువురు హమాలీలు పాల్గొన్నారు.

# పేదల ఆకలి తీర్చడంలో తమ వంతుగా ఏబీ ఫౌండేషన్...!

## నిరుపేదలకు అండగా నిలవడమే లక్ష్యంగా ముందడుగు బండారిగూడెంలో 30 కొండరెడ్డి కుటుంబాలకు ఆహార పొట్లాలు అందించడం జరిగింది





ప్రజా భూమి ప్రతినిధి కూనవరం.

ఆపదలో ఉన్న నిరుపేదలకు అండగా నిలుస్తూ, వారి కష్టాల్లో భాగస్వాములవడమే ఏబీ ఫౌం డేషన్ ప్రధాన లక్ష్యమని ఫౌండేషన్ చైర్మన్ కుంజా అనిల్ తెలిపారు మండలంలోని బండారిగూడెం గ్రామానికి చెందిన 30 కొండరెడ్డి కుటుంబాలకు ఏబీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆహార పొట్లాలు కార్యక్రమం నిర్వహించారు కడుపు నిండిన వారికి ఆకలి విలువ తెలియదు ఆకలి వేసినవాడికే అన్నం విలువ తెలుస్తుంది.అనే నానుడిని స్ఫూర్తిగా తీసుకుని ఫౌండేషన్‌ను ప్రారంభించినట్లు అనిల్ వివరిం చారు. తాము అందించే చిన్న సహా యం సైతం పేద కుటుంబాల జీవితాల్లో కొంత ఊరటనివ్వాలన్నదే తమ ఉద్దేశమన్నారు.ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు సహాయ సహకారాలు అందిస్తూ, సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని పేర్కొన్నారు.

పేదల ఆకలి తీర్చడంతో పాటు, ఆపద లో ఉన్నవారికి అండగా నిలవడమే తమ ఫౌండేషన్ ఆశయమని స్పష్టం చేశారు.ఈ కార్యక్ర మంలో ఫౌండేషన్ సభ్యులు కిరణ్ బాబు, తోడం వినోద్, కూర సింగరాజు. కుంజ సందీప్. పాయం చందు. కొజ్జా గౌతమ్ పలువురు స్థానికులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

❖ సర్పంచ్, వార్డు సభ్యులు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ అభ్యర్థులు వ్యయ పరిమితులు పాటించాలి ❖ ఓటర్లను ప్రలోభపెట్టే చర్యలకు పాల్పడరాదు ❖ ప్రచార ఖర్చుల వివరాలు రోజువారీగా నమోదు చేయాలి

ప్రజా భూమి ప్రతినిధి రంపచోడవరం

పోలవరం జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) నిర్దేశించిన ఎన్నికల వ్యయ పరిమితులను తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. దినేష్ కుమార్ సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించే చర్యలకు పాల్పడరాదని, ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, ప్రశాంతంగా జరిగేందుకు అభ్యర్థులు, రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. జిల్లాలో ఎన్నికలు జరిగే స్థానాలు: పోలవరం జిల్లాలో మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు (ఎంపీటీసీ), జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు (జెడ్పీటీసీ), గ్రామ పంచాయతీల సర్పంచ్, గ్రామ వార్డు సభ్యుల స్థానాలకు జరిగే ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థులు ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పనిసరిగా అనుసరించాలి.

స్థానిక సంస్థల ఎన్నికల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు..సర్పంచ్, వార్డు సభ్యులు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ అభ్యర్థులు వ్యయ పరిమితులు పాటించాలిఓటర్లను ప్రలోభపెట్టే చర్యలకు పాల్పడరాదుప్రచార ఖర్చుల వివరాలు రోజువారీగా నమోదు చేయాలి ప్రజా భూమి ప్రతినిధి రంపచోడవరం పోలవరం జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) నిర్దేశించిన ఎన్నికల వ్యయ పరిమితులను తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. దినేష్ కుమార్ సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించే చర్యలకు పాల్పడరాదని, ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, ప్రశాంతంగా జరిగేందుకు అభ్యర్థులు, రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు.జిల్లాలో ఎన్నికలు జరిగే స్థానాలు: పోలవరం జిల్లాలో మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు (ఎంపీటీసీ), జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు (జెడ్పీటీసీ), గ్రామ పంచాయతీల సర్పంచ్, గ్రామ వార్డు సభ్యుల స్థానాలకు జరిగే ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థులు ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పనిసరిగా అనుసరించాలి.

**ప్రచార ఖర్చుల లెక్కలు నిర్వహించాలి:** నామినేషన్ దాఖలు చేసిన తేదీ నుంచి ఫలితాలు ప్రకటించే తేదీ వరకు ఎన్నికల ప్రచారానికి చేసిన ప్రతి ఖర్చును అభ్యర్థులు నిర్దేశిత రిజిస్టర్‌లో రోజువారీగా నమోదు చేయాలి. ప్రచార వాహనాలు, కరపత్రాలు, బ్యానర్లు, సభలు, సమావేశాలు, ఇతర ప్రచార సామగ్రికి సంబంధించిన ఖర్చుల వివరాలు, బిల్లులు, రశీదులు భద్రపరచాలి. ఎన్నికల వ్యయ ఖాతాలను సంబంధిత ఎన్నికల అధికారి సూచించిన విధానంలో, నిర్దేశిత గడువులోగా సమర్పించాలి. పంచాయతీరాజ్ ఎన్నికలకు వర్తించే నిబంధనల ప్రకారం ఫలితాల ప్రకటన నుంచి 45 రోజుల్లోగా వ్యయ ఖాతాను సమర్పించాల్సి ఉంటుంది.

**నగదు, మద్యం, బహుమతుల పంపిణీ నిషేధం:** ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు నగదు, మద్యం, బహుమతులు, నిత్యావసర వస్తువులు లేదా ఇతర ప్రయోజనాలను పంపిణీ చేయరాదు. ఓటు వేయడానికి ప్రతిఫలంగా డబ్బు లేదా వస్తువులు ఇవ్వడం, తీసుకోవడం చట్టవిరుద్ధం. ఎన్నికల అక్రమాలను అరికట్టేందుకు నిఘా బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్లు తనిఖీలు నిర్వహిస్తాయి. ఇలాంటి ఘటనలు గుర్తించినప్పుడు సంబంధిత ఎన్నికల అధికారులకు సమాచారం అందించాలి.

**ప్రభుత్వ వనరులను ప్రచారానికి ఉపయోగించరాదు...** ప్రభుత్వ వాహనాలు, కార్యాలయాలు, అతిథి గృహాలు, ప్రభుత్వ సిబ్బంది లేదా ప్రజాధనంతో నిర్వహించే వనరులను ఎన్నికల ప్రచారానికి ఉపయోగించడం నిషేధం. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్న ప్రాంతాల్లో కొత్త పథకాల ప్రకటనలు, ఓటర్లను ప్రభావితం చేసే ప్రయోజనాల పంపిణీ, నిషేధిత శంకుస్థాపనలు, అభివృద్ధి పనుల ప్రకటనల విషయంలో ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటించాలి.సభలు, ర్యాలీలకు అనుమతులు అవసరం: ఎన్నికల ప్రచార సభలు, ర్యాలీలు, ఊరేగింపులు, లౌడ్‌స్పీకర్ల వినియోగానికి సంబంధిత అధికారుల నుంచి ముందస్తు అనుమతులు తీసుకోవాలి. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్‌స్పీకర్ల వినియోగంపై నిషేధానికి సంబంధించిన నిబంధనలను పాటించాలి. ప్రైవేటు ఇళ్లు, ప్రహరీలు, భవనాలపై యజమాని అనుమతి లేకుండా ఫ్లెక్సీలు, పోస్టర్లు ఏర్పాటు చేయరాదు. ప్రభుత్వ, ప్రజా ఆస్తులపై ప్రచార సామగ్రి ఏర్పాటు విషయంలో ఎన్నికల సంఘం నియమాలను అనుసరించాలి.

**కుల, మతాల ఆధారంగా ప్రచారం చేయరాదు....** కులం, మతం, భాష పేరుతో ఓట్లు కోరడం, వర్గాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే ప్రసంగాలు చేయడం నిషేధం. ప్రార్థనా స్థలాలను ఎన్నికల ప్రచార వేదికలుగా ఉపయోగించరాదు. ప్రత్యర్థులపై నిరాధార ఆరోపణలు, వ్యక్తిగత దూషణలకు పాల్పడకుండా ప్రజాస్వామ్య పద్ధతుల్లో ప్రచారం నిర్వహించాలి.

**ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి:** అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా పాటించి, స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు.

# అడ్డతీగల మండలంలో పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లు ఖరారు




22 పంచాయతీల్లో సర్పంచ్ స్థానాల కేటాయింపు..

వార్డుల వారీగా ఎస్టీ, జనరల్ విభజన

ప్రజా భూమి ప్రతినిధి అడ్డతీగల

పోలవరం జిల్లా అడ్డతీగల మండల పరిధిలోని గ్రామ పంచాయతీల ఎన్నికల రిజర్వేషన్ల వివరాలు ఖరారయ్యాయి. మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ స్థానాలతో పాటు వార్డుల వారీగా ఎస్టీ, జనరల్ కేటగిరీలకు కేటాయింపులు చేశారు. పలు పంచాయతీల్లో సర్పంచ్ స్థానాలను ఎస్టీ మహిళలకు కేటాయించగా, మరికొన్ని చోట్ల ఎస్టీ కేటగిరీకి కేటాయించారు. వార్డుల రిజర్వేషన్ల వివరాలు గ్రామాల వారీగా ఇలా ఉన్నాయి.

పంచాయతీల వారీగా సర్పంచ్, వార్డుల రిజర్వేషన్లు

1. అడ్డతీగల సర్పంచ్: ఎస్టీ మహిళ, మొత్తం వార్డులు: 14, ఎస్టీ వార్డులు: 1, 2, 5, 10, 11, 12, 13, 14, జనరల్ వార్డులు: 3, 4, 6, 7, 8, 91. భీముడుపాకలు సర్పంచ్: ఎస్టీ మహిళ,మొత్తం వార్డులు: 8 ఎస్టీ వార్డులు: 1, 2, 3, 4, 6, 8 జనరల్ వార్డులు: 5, 71. బొడ్డులంక సర్పంచ్: ఎస్టీ మహిళ మొత్తం వార్డులు: 8 ఎస్టీ వార్డులు: 1, 2, 5, 8 జనరల్ వార్డులు: 3, 4, 6, 71. డి. భీమవరం సర్పంచ్: ఎస్టీ మహిళ మొత్తం వార్డులు: 10 ఎస్టీ వార్డులు: 1, 2, 3, 4, 5, 6, 7, 8, 9, 10 జనరల్ వార్డులు: లేవు1. డి. రామవరం సర్పంచ్: ఎస్టీ మొత్తం వార్డులు: 10 ఎస్టీ వార్డులు: 1, 3, 4, 5, 6, 7, 8, 9, 10 జనరల్ వార్డు: 21. దాకోడు సర్పంచ్: ఎస్టీ మహిళమొత్తం వార్డులు: 8 ఎస్టీ వార్డులు: 1, 2, 3, 4, 5, 6, 7 జనరల్ వార్డు: 81. ధాన్యంపాలెం సర్పంచ్: ఎస్టీ మొత్తం వార్డులు: 10 ఎస్టీ వార్డులు: 1, 2, 3, 4, 5, 6, 7, 8, 9, 10 జనరల్ వార్డులు: లేవు1. దొరమామిడి సర్పంచ్: ఎస్టీ మహిళ మొత్తం వార్డులు: 8* ఎస్టీ వార్డులు: 1, 2, 3, 6, 7, 8 జనరల్ వార్డులు: 4, 51. దుచెర్తి సర్పంచ్: ఎస్టీ మొత్తం వార్డులు: 10* ఎస్టీ వార్డులు: 1, 2, 3, 4, 5, 6, 7, 8, 9, 10 జనరల్ వార్డులు: లేవు1. గొండోలు సర్పంచ్: ఎస్టీ* మొత్తం వార్డులు: 8 ఎస్టీ వార్డులు: 1, 2, 3, 4, 5, 8 జనరల్ వార్డులు: 6, 71. గోంటువాని పాలెం* సర్పంచ్: ఎస్టీ మొత్తం వార్డులు: 10ఎస్టీ వార్డులు: 2, 3, 6, 9 జనరల్ వార్డులు: 1, 4, 5, 7, 8, 101. కిమ్మూరుసర్పంచ్: ఎస్టీ మహిళ మొత్తం వార్డులు: 8 ఎస్టీ వార్డులు: 3, 4, 5, 8 జనరల్ వార్డులు: 1, 2, 6, 71. కోనలోవా సర్పంచ్: ఎస్టీ మొత్తం వార్డులు: 10 ఎస్టీ వార్డులు: 1, 3, 4, 6, 8జనరల్ వార్డులు: 2, 5, 7, 9, 101. మట్లపాడు సర్పంచ్: ఎస్టీ మొత్తం వార్డులు: 8 ఎస్టీ వార్డులు: 1, 2, 3, 4, 5, 7, 8 జనరల్ వార్డు: 61. పులిగోగులపాడు సర్పంచ్: ఎస్టీ మహిళ మొత్తం వార్డులు: 8 ఎస్టీ వార్డులు: 1, 2, 3, 4, 5, 6, 7, 8 జనరల్ వార్డులు: లేవు1. రాయపల్లి సర్పంచ్: ఎస్టీ మహిళ మొత్తం వార్డులు: 10 ఎస్టీ వార్డులు: 2, 4, 5, 6, 7, 8, 9, 10జనరల్ వార్డులు: 1, 31. సోమన్నపాలెం సర్పంచ్: ఎస్టీ మహిళ మొత్తం వార్డులు: 8 ఎస్టీ వార్డులు: 1, 2, 3, 4, 5, 6, 8 జనరల్ వార్డు: 71. తిమ్మాపురం సర్పంచ్: ఎస్టీ మొత్తం వార్డులు: 10 ఎస్టీ వార్డులు: 1, 2, 3, 4, 7 జనరల్ వార్డులు: 5, 6, 8, 9, 101. తంగడుముగుల సర్పంచ్: ఎస్టీ మహిళ మొత్తం వార్డులు: 10 ఎస్టీ వార్డులు: 1, 2, 4, 5, 6, 7, 8, 9, 10 జనరల్ వార్డు: 31. వీరవరం సర్పంచ్: ఎస్టీ మహిమొత్తం వార్డులు: 8 ఎస్టీ వార్డులు: 1, 2, 3, 4, 5, 6, 7, 8 జనరల్ వార్డులు: లేవు1. వేటమామిడి సర్పంచ్: ఎస్టీ* మొత్తం వార్డులు: 8 ఎస్టీ వార్డులు: 2, 3, 4, 5, 6, 7, 8 జనరల్ వార్డు: 11. ఎల్లవరం సర్పంచ్: ఎస్టీ మొత్తం వార్డులు: 10 ఎస్టీ వార్డులు: 1, 2, 3, 4, 5, 8 జనరల్ వార్డులు: 6, 7, 9, 10

# గోదావరి రేవుకు కొట్టుకొచ్చిన గుర్తుతెలియని మృతదేహం

— ఆచూకీ తెలిసిన వారు పోలీసులను సంప్రదించాలి



ప్రజాభూమి, ప్రతినిధి, వి.ఆర్.పురం:

పోలవరం జిల్లా వి. ఆ ర్. పుర ం మ ండ ల ంలోని వడ్డీగూడెం గ్రామ సమీప గోదావరి రేవు వద్ద శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఒడ్డుకు కొట్టుకొచ్చింది. గోదావరిలో కొట్టుకొచ్చిన మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిసింది. సమాచారం అందుకున్న వి.ఆర్.పురం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వివరాలు, ఆచూకీకి సంబంధించిన సమాచారం కోసం పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని గుర్తించేందుకు పరిసర ప్రాంతాల్లో విచారణ కొనసాగిస్తున్నారు. ఈ ఘటనపై వి.ఆర్.పురం ఎస్ఐ సాదిక్ ఒక ప్రకటనలో మాట్లాడుతూ.. వడ్డీగూడెం రేవు వద్ద గోదావరిలో కొట్టుకొచ్చిన మృతదేహం ఎవరిదో తెలిసిన వారు, లేదా తమ గ్రామ పరిధిలో ఎవరైనా వ్యక్తి ఇటీవల కనిపించకుండా పోయినట్లయితే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఫోటోలోని వ్యక్తిని పరిశీలించి తమకు తెలిసిన సమాచారం ఏదైనా ఉంటే వెంటనే వి.ఆర్.పురం పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ విజ్ఞప్తి చేశారు. మృతదేహం గుర్తింపు కోసం పోలీసులు అన్ని కోణాల్లో వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు.



# అనుమానంతో భార్యను హత్య చేసిన భర్తకు జీవిత ఖైదు

ముగ్గురు పిల్లలకు తక్షణ పరిహారం అందించాలని డీఎల్ఎస్ఏకు కోర్టు ఆదేశాలు

ప్రజా భూమి ప్రతినిధి అడ్డతీగల

భార్యపై అనుమానంతో ఆమెను హత్య చేసిన భర్తకు రాజమహేంద్రవరంలోని ఎనిమిదో అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు జీవిత ఖైదు విధించింది. నిందితుడికి రూ.3,000 జరిమానా కూడా విధిస్తూ అక్టోబర్ 15న తీర్పు వెలువరించింది.పోలవరం జిల్లా, రంపచోడవరం సబ్ డివిజన్, అడ్డతీగల సర్కిల్ పరిధిలోని దుచ్చెర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో వంగలమడుగు గ్రామానికి చెందిన మడకం జోజగి దొర (49) తన భార్య మడకం విజయకుమారిని 2025లో అనుమానంతో వారి నివాసం వద్ద పిల్లల సమక్షంలో హత్య చేసినట్లు పోలీసుల వివరాలు వెల్లడించాయి.

వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.మృతురాలి సోదరుడు పరదా కన్నయ్య దొర ఇచ్చిన ఫిర్యాదు మేరకు దుచ్చెర్తి పోలీసులు 2025 జూలై 10న క్రైం నంబర్ 13/2025, బీఎన్ఎస్ సెక్షన్ 103(1) కింద కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ బి. నరసింహమూర్తి దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్టు చేశారు.అనంతరం రాజమహేంద్రవరంలోని మహిళలపై నేరాల విచారణకు సంబంధించిన ప్రత్యేక కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు.విచారణ అనంతరం న్యాయమూర్తి బి. నిర్మల నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.3,000 జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. తల్లిని కోల్పోయిన ముగ్గురు పిల్లలకు తక్షణ పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ)ను కోర్టు ఆదేశించింది.

ఈ కేసులో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ తుమ్మల వాసు లక్ష్మి వాదనలు వినిపించారు.జిల్లా ఎస్పీ కే. చక్రవర్తి ఐపీఎస్ పర్యవేక్షణలో రంపచోడవరం డీఎస్పీ అష్రఫ్ అలీ, కోర్టు మానిటరింగ్ సెల్ ఇన్‌స్పెక్టర్ ఎం. ముక్తేశ్వరరావు, అడ్డతీగల ఇన్‌స్పెక్టర్ ఎం. గజేంద్ర కుమార్, దుచ్చెర్తి ఎస్ఐ కె. పార్థసారథి, పోలీసు సిబ్బంది, కోర్టు కానిస్టేబుల్ హెచ్‌సీ 2988 కె. మాధవరావు సమన్వయంతో పనిచేశారు. సాక్షులను సకాలంలో కోర్టుకు హాజరుపరచడంలో కీలక పాత్ర పోషించిన సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

# యాదవులకు చైర్మన్ టికెట్ కేటాయించాలి

## -కష్టకాలంలో అండగా నిలిచిన చంద్ర మోహన్ యాదవ్‌కు న్యాయం చేయాలి




ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం మున్సిపల్ ఎన్నికల్లో యాదవ సామాజిక వర్గానికి సముచిత ప్రాధాన్యత కల్పించడంతో పాటు చైర్మన్ అభ్యర్థిగా చంద్ర మోహన్ యాదవ్‌కు అవకాశం కల్పించాలని యాదవ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. పార్టీ కష్టకాలంలో అండగా నిలిచి, అధిష్ఠానం అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించిన నాయకుడికి తగిన గుర్తింపు ఇవ్వాలని కోరారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని స్థానిక ప్రెస్‌క్లబ్‌లో యాదవ సంఘం నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించి తమ డిమాండ్లను వెల్లడించారు. యాదవ సామాజిక వర్గాన్ని కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే పరిగణించకుండా, రాజకీయంగా తగిన ప్రాధాన్యత కల్పించాలని నాయకులు పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో యాదవుల మద్దతు కోరుతూ, పదవులు కేటాయించే విషయంలో మాత్రం వారికి సరైన గుర్తింపు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. ఎన్నో ఏళ్లుగా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న నాయకుల సేవలను గుర్తించి, ఎన్నికల్లో సముచిత అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. గత మున్సిపల్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో చంద్ర మోహన్ యాదవ్ చైర్మన్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారని గుర్తు చేశారు. అయినప్పటికీ పార్టీ పట్ల తనకున్న నిబద్ధతను కొనసాగిస్తూ, పార్టీ అప్పగించిన బాధ్యతలను నిర్వహించారని తెలిపారు. పార్టీ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు ముందుండి పనిచేసిన ఆయన సేవలను అధిష్ఠానం గుర్తించాలని కోరారు. పార్టీ నాయకత్వం ఇచ్చిన సూచనలు, బాధ్యతలను పాటిస్తూ ముందుకు సాగారని, ఈ క్రమంలో అప్పుల పాలవడంతోపాటు కేసులను కూడా ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. పార్టీ అధికారంలో లేని సమయంలోనూ వెనుకడుగు వేయకుండా పార్టీకి అండగా నిలిచిన చంద్ర మోహన్ యాదవ్‌కు ప్రస్తుత మున్సిపల్ ఎన్నికల్లో చైర్మన్ టికెట్ కేటాయించడం సమంజసమని నాయకులు అన్నారు. పార్టీ కోసం కష్టపడిన వారికి పదవుల కేటాయింపులో ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా కార్యకర్తల్లో నమ్మకం పెరుగుతుందని పేర్కొన్నారు. యాదవ సామాజిక వర్గానికి రాజకీయంగా తగిన గుర్తింపు లభించేలా ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. హిందూపురం మున్సిపల్ ఎన్నికల్లో యాదవ సామాజిక వర్గానికి సముచిత స్థానం కల్పించి, చంద్ర మోహన్ యాదవ్‌కు చైర్మన్ అభ్యర్థిగా అవకాశం కల్పించాలని వారు కోరారు. పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసిన నాయకులకు గుర్తింపు లభించినప్పుడే పార్టీ మరింత బలోపేతమవుతుందని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో యాదవ సంఘం అధ్యక్షులు లక్ష్మీనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు మురళి శంకర్, కార్యదర్శి తిప్పన్న, ఉపాధ్యక్షులు నారాయణప్ప, ఓబీసీ లీగల్ ప్రతినిధి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# దాడులు.. దౌర్జన్యాలతో ప్రజాస్వామ్యాన్ని అణచలేరు...

## -మిథున్‌రెడ్డి కాన్వాయ్‌పై దాడి, నామినేషన్లకు అడ్డంకులపై దీపిక తీవ్ర ఆగ్రహం



ప్రజాభూమి, హిందూపురం టౌన్

ప్రజాస్వామ్యంలో రాజకీయ ప్రత్యర్థులను ఎదుర్కోవాల్సింది ప్రజాక్షేత్రంలోనే తప్ప దాడులు, దౌర్జన్యాలతో కాదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హిందూపురం నియోజకవర్గ ఇన్‌చార్జి దీపికా వేణు రెడ్డి స్పష్టం చేశారు. పుంగనూరులో రాయలసీమ ప్రాంతీయ సమన్వయకర్త, రాజంపేట ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లోక్‌సభాపక్ష నాయకులు మిథున్‌రెడ్డి కాన్వాయ్‌పై దాడి చేయడం, నామినేషన్లు దాఖలు చేసేందుకు వెళ్తున్న వైసీపీ నాయకులను అడ్డుకోవడం, వాహనాలను ధ్వంసం చేయడం వంటి ఘటనలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆమె తీవ్రంగా ఖండించారు. ఎన్నికల్లో ప్రజల తీర్పును కోరాల్సింది పోయి, ప్రత్యర్థులను భయభ్రాంతులకు గురిచేసే చర్యలకు పాల్పడటం ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం హిందూపురంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో దీపికా వేణురెడ్డి మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి రాజకీయ పార్టీకి ఎన్నికల్లో పోటీ చేసే హక్కు ఉందన్నారు. ఆ హక్కును కాలరాస్తూ నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకోవడం ఎంతమాత్రం సమర్థనీయం కాదని పేర్కొన్నారు. ఎన్నికల్లో పోటీ చేయడం ప్రతి అభ్యర్థికి రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్య హక్కు అని, ఆ హక్కును అడ్డుకునే ప్రయత్నాలు ప్రజాస్వామ్య వ్యవస్థకే విఘాతం కలిగిస్తాయని అన్నారు. పుంగనూరులో చోటుచేసుకున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని, రాజకీయంగా ఎదుర్కోలేక దాడులకు దిగడం, నామినేషన్ల ప్రక్రియకు ఆటంకాలు కలిగించడం వంటి చర్యలు ఎన్నికల పారదర్శకతపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని విమర్శించారు. ఎన్నికల సమయంలో అన్ని రాజకీయ పార్టీలకు సమాన అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉందని గుర్తుచేశారు. ఎన్నికల ప్రక్రియ స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా సాగేందుకు అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించాలని దీపికా వేణురెడ్డి సూచించారు. దాడులు, వాహనాల ధ్వంసం, నామినేషన్లకు అడ్డంకులు వంటి ఘటనలపై తక్షణమే స్పందించి, శాంతిభద్రతలను కాపాడాలని కోరారు. ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులకు ఎలాంటి భయాందోళనలు లేకుండా నామినేషన్లు దాఖలు చేసుకునే వాతావరణం కల్పించాలని స్పష్టం చేశారు. రాజకీయ విభేదాలు ప్రజాస్వామ్య పద్ధతుల్లోనే ఉండాలని, ప్రత్యర్థులను అడ్డుకోవడం లేదా భయపెట్టడం ద్వారా రాజకీయంగా పైచేయి సాధించాలనుకోవడం సరికాదని ఆమె పేర్కొన్నారు. ప్రజలే అంతిమ నిర్ణేతలని, ఎన్నికల్లో ఎవరు గెలవాలనేది ఓటర్లు నిర్ణయిస్తారని అన్నారు. ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించడంలో ఎన్నికల అధికారులు, పోలీసు యంత్రాంగం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కట్ల భాష, లోకేష్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# చైర్మన్ కుర్చీపై తొలగని ఉత్కంఠ..!! - అధికార, ప్రతిపక్ష పార్టీల్లో అభ్యర్థుల వేట..

## -ఎవరికి దక్కేనో అవకాశం.. --టీడీపీలో రమేష్‌కుమార్ నుంచి చంద్రమోహన్ యాదవ్ వరకు..-రేసులోకి మంజునాథ్



ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం పురపాలక సంఘ ఎన్నికల్లో చైర్మన్ పీఠం ఎవరిని వరిస్తుందనే అంశంపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైనప్పటికీబ అధికార తెలుగుదేశం పార్టీతో పాటు ప్రధాన ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోనూ అభ్యర్థుల ఎంపిక ఇంకా పూర్తికాలేదు. ఒకవైపు చైర్మన్ పదవిని దక్కించుకోవాలని ఆశావహులు ప్రయత్నాలు సాగిస్తుండగా, మరోవైపు 52 వార్డుల్లో పార్టీ అభ్యర్థులుగా పోటీ చేసేందుకు పలువురు నాయకులు తమవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. సామాజికవర్గాల వారీగా ప్రాతినిధ్యం కల్పించాలనే డిమాండ్లు, స్థానిక నాయకుల ఒత్తిళ్లు, పార్టీ కోసం పనిచేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వాలనే అభిప్రాయాల మధ్య అభ్యర్థుల ఎంపిక రెండు పార్టీలకు కీలకంగా మారింది. హిందూపురం మున్సిపల్ చైర్మన్ స్థానం బీసీ జనరల్‌కు కేటాయించడంతో అధికార టీడీపీలో ఆశావహుల సంఖ్య పెరిగింది. తొలుత చైర్‌పర్సన్ అభ్యర్థిగా సీనియర్ నాయకుడు డిఈ రమేష్‌కుమార్ పేరు ప్రధానంగా వినిపించింది. గురువారం వరకు ఆయన అభ్యర్థిత్వం ఖరారు కావచ్చనే ప్రచారం సాగింది. అయితే శుక్రవారం నాటికి పరిస్థితిలో మార్పు కనిపించింది. చంద్రమోహన్ యాదవ్‌తో పాటు పురిడి మంజునాథ్ పేర్లు కూడా తెరపైకి రావడంతో చైర్మన్ అభ్యర్థి ఎంపికపై చర్చ మరింత ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం పురిడి మంజునాథ్ పేరు ముందంజలో ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతున్నప్పటికీ, పార్టీ అధిష్ఠానం అధికారికంగా ప్రకటించే వరకు ఎవరికి అవకాశం దక్కుతుందనేది స్పష్టతకు రాలేదు. గతంలో చైర్మన్ అభ్యర్థిత్వం విషయంలో చర్చకు వచ్చిన నాయకుల పేర్లతో పాటు కొత్తగా తెరపైకి వస్తున్న పేర్లు టీడీపీలో నెలకొన్న పోటీని ప్రతిబింబిస్తున్నాయి. పార్టీ నాయకత్వం అభ్యర్థిని ఖరారు చేసే సమయంలో సామాజిక సమీకరణాలు, స్థానికంగా నాయకులకు ఉన్న గుర్తింపు, పార్టీ పట్ల విధేయత, వార్డుల వారీగా అభ్యర్థుల ఎంపిక వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సిన పరిస్థితి ఉంది. చైర్మన్ అభ్యర్థి ఎంపికతో మిగిలిన వార్డుల అభ్యర్థుల కేటాయింపునకు కూడా సంబంధం ఉండటంతో పార్టీ నిర్ణయం కోసం ఆశావహులు ఎదురుచూస్తున్నారు. ఇదిలా ఉండగా, అధికార పార్టీలో వివిధ కుల సంఘాలు తమ సామాజికవర్గానికి తగిన ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేస్తున్నాయి. ఇప్పటికే పలు సంఘాలు విలేకరుల సమావేశాలు నిర్వహిస్తూ తమ అభిప్రాయాలను వెల్లడించాయి. చైర్మన్ పదవితో పాటు కౌన్సిలర్ స్థానాల్లోనూ తమ వర్గానికి సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని కోరుతున్నాయి. దీంతో టికెట్ల కేటాయింపులో అన్ని వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవడం పార్టీ నాయకత్వానికి సవాలుగా మారింది. ఒకవైపు సీనియర్ నాయకులు తమకు అవకాశం కల్పించాలని కోరుతుండగా, మరోవైపు సామాజికవర్గాల సంఘాలు తమ డిమాండ్లను బహిరంగంగా వినిపిస్తున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో టీడీపీ అభ్యర్థుల ఎంపికపై రాజకీయ వర్గాల్లో చర్చ కొనసాగుతోంది. పురపాలక సంఘంలోని మొత్తం 52 వార్డుల్లో పోటీ చేసేందుకు ఆశావహులు సిద్ధమవుతున్నప్పటికీ, అన్ని స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేయడం ఇంకా పూర్తికాలేదు. గతంలో పోటీ చేసిన నాయకులతో పాటు కొత్తగా రాజకీయ అవకాశాల కోసం ఎదురుచూస్తున్నవారు కూడా టికెట్లపై ఆశలు పెట్టుకున్నారు. చైర్మన్ అభ్యర్థి ఎంపిక అనంతరం వార్డుల కేటాయింపులో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉండటంతో ఆశావహులు పార్టీ పెద్దల నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారు. అభ్యర్థుల ఎంపికలో సామాజిక సమీకరణాలు, స్థానిక పరిస్థితులు, నాయకుల మధ్య సమన్వయం కీలక అంశాలుగా మారాయి. ప్రధాన ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోనూ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ ఇంకా కొలిక్కి రాలేదు. చైర్‌పర్సన్ స్థానానికి ఎవరిని ఎంపిక చేయాలి? 52 వార్డుల్లో ఎవరెవరికి అవకాశం కల్పించాలి అనే అంశాలపై పార్టీ నాయకత్వం కసరత్తు చేయాల్సి ఉంది. అధికార పార్టీ అభ్యర్థులపై స్పష్టత వచ్చే వరకు వేచి చూసే ధోరణి ఉంటుందా, లేక తమ అభ్యర్థులను ముందుగానే ప్రకటిస్తారా అన్నది ఆసక్తికరంగా మారింది. స్థానిక నాయకుల అభిప్రాయాలు, వార్డుల వారీగా పోటీకి సిద్ధమవుతున్న ఆశావహుల వివరాలను పరిగణనలోకి తీసుకుని అభ్యర్థులను ఎంపిక చేయాల్సి ఉంది. దీంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోనూ టికెట్ల కోసం ఎదురుచూపులు కొనసాగుతున్నాయి. నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కావడంతో రెండు పార్టీల్లోనూ అభ్యర్థుల ఖరారుపై ఒత్తిడి పెరుగుతోంది. నామినేషన్ల గడువు సమీపించే కొద్దీ ఆశావహుల్లో ఉత్కంఠ మరింత పెరిగే అవకాశం ఉంది. అధికారిక జాబితాలు వెలువడకముందే అభ్యర్థుల పేర్లపై ప్రచారం సాగుతుండటంతో పార్టీ శ్రేణుల్లోనూ ఆసక్తి నెలకొంది. చైర్మన్ అభ్యర్థి ఎంపికతో పాటు వార్డుల కేటాయింపులో అసంతృప్తికి తావులేకుండా నాయకత్వం ఎలా వ్యవహరిస్తుందనేది కీలకంగా మారింది. మొత్తంగా హిందూపురం మున్సిపల్ ఎన్నికల్లో చైర్మన్ పీఠంపై ఉత్కంఠ కొనసాగుతుండగా, అధికార టీడీపీలో డిఈ రమేష్‌కుమార్, చంద్రమోహన్ యాదవ్, పురిడి మంజునాథ్ పేర్ల చుట్టూ చర్చ సాగుతోంది. మరోవైపు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కూడా అభ్యర్థుల ఎంపికను పూర్తి చేయాల్సి ఉంది. చైర్మన్ పీఠం ఎవరికి దక్కుతుంది, 52 వార్డుల్లో ఏ పార్టీ ఎవరికి అవకాశం కల్పిస్తుంది, సామాజికవర్గాల డిమాండ్లకు పార్టీలు ఎలా స్పందిస్తాయి అనే ప్రశ్నలకు అధికారిక అభ్యర్థుల జాబితాలు వెలువడిన తర్వాతే స్పష్టత రానుంది.

# శ్రీ కాత్యాయనీ దేవి అలంకారంలో శ్రీ దుర్గమ్మ తల్లి

## - ఆలయంలో అభిషేకాలు, విశేష పూజలు



ప్రజాభూమి, వేంపల్లె

స్థానిక పట్టణంలోని సాయినగర్‌లో వెలసిన శ్రీ దుర్గమ్మ తల్లి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజు శ్రీ దుర్గమ్మ తల్లి శ్రీ కాత్యాయనీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చినట్లు ఆలయ వ్యవస్థాపకుడు ఎం. రవికుమార్ రెడ్డి తెలిపారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.ఆలయ అర్చకులు శాకల్య విష్ణుశర్మ నేతృత్వంలో అమ్మవారికి పంచామృత అభిషేకం, మంత్రపుష్పం,మహా మంగళహారతి తదితర పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు శాకల్య విష్ణుశర్మ నేతృత్వంలో మణికంఠ శర్మ 10రోజుల పాటు శ్రీచక్రార్చన, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని శ్రీ కాత్యాయనీ దేవిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ప్రతిరోజూ ఉదయం అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తుండగా, సాయంత్రం పూలతో అలంకరించి పూజలు చేస్తున్నారు. ఆలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలు, పూలతో అందంగా అలంకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

# అప్పుల బాధతో రైతు మృతి..

ప్రజా భూమి. యల్లనూరు

మండల పరిధిలోని చిలమకూరు గ్రామానికి చెందిన గుగూటి రాజశేఖర్ వయసు (46) సంవత్సరాలు (తండ్రి) చిన్న కుల్లాయప్ప ఈయన పంట సాగు చేసుకోవడానికి , కూతురు పెళ్లి చేయడానికి కాను గొర్రెలు కొనడానికి దాదాపుగా 12 లక్షల వరకు అప్పు చేశారు అప్పులు ఎలా తీర్చాలని మనస్థాపంతో చిలమకూరు సమీపంలోని చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు విషయం తెలుసుకున్న స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని అతని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని బాడీని తాడిపత్రి ప్రాంతీయ వైద్యశాలకు పోస్టుమార్టంకు తరలించారు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



# పులివెందుల రైతుల్లో ఆనందం

## - రబీ సీజన్‌కు వరంగా మారిన వర్షాలు



ప్రజాభూమి, పులివెందుల

పులివెందుల నియోజకవర్గంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతన్నల మొహాల్లో ఆనందం వెల్లివిరిసింది. సరైన సమయంలో వర్షం పడటంతో పంటలకు ఎంతో మేలు జరుగుతుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుతం రబీ సీజన్ ప్రారంభం కానుండటంతో రైతులు ధనియాలు, శనగ, పొద్దుతిరుగుడు తదితర పంటల సాగుకు సిద్ధమవుతున్నారు. ఈ తరుణంలో కురిసిన వర్షం భూమిలో తేమను పెంచి దుక్కి దున్నేందుకు అనుకూలంగా మారిందని రైతులు చెబుతున్నారు. ఈ వర్షం వల్ల రబీ పంటలకు ఎంతో బలం చేకూరుతుందని, పంటలు బాగా వస్తాయనే ఆశాభావంతో ఉన్నామని నియోజకవర్గ రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# మూలా నక్షత్రం సందర్భంగా నోటు పుస్తకాల పంపిణీ

## - సరస్వతి దేవి సన్నిధిలో పుస్తకాలు, పెన్నులకు పూజలు

ప్రజాభూమి, వేంపల్లె

స్థానిక పట్టణంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాల్లో భాగంగా ఆర్యవైశ్య ఆఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అవోపా మహిళా విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని సరస్వతి దేవి సన్నిధిలో నోటు పుస్తకాలు, పెన్నులకు పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఇంద్రకంటి ప్రసాద్ శర్మ నేతృత్వంలో పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు అవోపా అధ్యక్షుడు బైరిశెట్టి వెంకటసునీల్ కుమార్, మహిళా విభాగం అధ్యక్షురాలు బైరిశెట్టి నాగలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా దాతల సహకారంతో పూజించిన నోటు పుస్తకాలు, పెన్నులను విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం దాతలను సన్మానించారు.

# నైపుణ్యతతో రాణిస్తే ప్రత్యేక గుర్తింపు

## -సప్తగిరి కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు




ప్రజాభూమి, హిందూపురం టౌన్

పోటీ ప్రపంచంలో విద్యార్థులు నైపుణ్యత ప్రదర్శిస్తే ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని సప్తగిరి ఎంబీఏ, ఎంసీఏ కళాశాలల ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కళాశాల ఆవరణలో ఎంబీఏ, ఎంసీఏ ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పీజీ, డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు నారాయణరెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, సుమంత్ రెడ్డి, పరిపాలనాధికారి గంగిరెడ్డి, డీన్ ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ, సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులను సాదరంగా ఆహ్వానిస్తూ ప్రతి సంవత్సరం ఈ వేడుక నిర్వహించడం సప్తగిరి కళాశాల ఆనవాయితీగా వస్తుందని పేర్కొన్నారు. అంది వచ్చిన అవకాశాలను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని తెలియజేశారు. ఎంబీఏ విద్యార్థులు అందరూ విజయవంతంగా ఎంబీఏ పూర్తి చేసుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. నూతనంగా ఎంబీఏ, ఎంసీఏ కళాశాల విద్యార్థుల సప్తగిరి చేరినందుకు ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు అందరూ ఎంబీఏ పట్టాతోపాటు నైపుణ్యాలు మెరుగుపరచుకోవాలని తెలియజేశారు. నూతనంగా చేరిన విద్యార్థులు సీనియర్ విద్యార్థుల సూచనలు తీసుకుంటూ ఉన్నత స్థాయికి ఎదగాలని తెలిపారు. ఇందులో భాగంగా యాడ్ మేకింగ్, బిజినెస్, క్విజ్, యంగ్ మేనేజర్ విభాగాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమెంటోల, మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆయా కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీ సరస్వతీ దేవి అలంకారంలో శ్రీ వాసవి మాత

## - మూలా నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు..

### ఆకట్టుకున్న వేషధారణలు



ప్రజాభూమి, వేంపల్లె

స్థానిక పట్టణంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో నిర్వహిస్తున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు శ్రీ వాసవి మాత శ్రీ సరస్వతీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చినట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తోటంశెట్టి చంద్రశేఖర్, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు రాయవరం సుబ్బు, పాలకవర్గం, ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు ఇంద్రకంటి ప్రసాద్ శర్మ సిద్ధాంతి నేతృత్వంలో మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల నడుమ అమ్మవారికి పంచామృతాభిషేకం, నివేదన, మంత్రపుష్పం, మహామంగళహారతి తదితర విశేష పూజలు నిర్వహించారు. రాత్రి ఉత్సవమూర్తి వాసవి మాత శ్రీ సరస్వతీ దేవిగా భక్తులకు కటాక్షించారు. అవివాహిత యువకులు అమ్మవారి బిందెను నెత్తిన పెట్టుకుని పట్టణ పురవీధుల్లో ఊరేగింపుగా వెళ్లారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శాశ్వత ఉభయంగా బ్రాహ్మణ సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అర్చకులు పాల్గొని బ్రాహ్మణ భోజనాన్ని స్వీకరించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. బిందెసేవ కార్యక్రమంలో భాగంగా ఒంగోలుకు చెందిన మహేశ్వరి ఈవెంట్స్ వారు ప్రదర్శించిన వేషధారణలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం, శ్రీ వాసవి కళ్యాణ మండపం, అవోపా, మండల ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య మహిళా మండలి, అవోపా మహిళా విభాగం కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

Printed and Published and owned by A.RAMAMOHANREDDY,Printed at Sri Lakshmi Offset Printers, R.S. No.268/2;D.No. 8/180,Surampalli Village, Gannavaram Mandalam, Krishna district, Andhra Pradesh and Published from D.NO. 32-26-85/6, MSR Street Marutinagar, Eluru Road, Vijayawada-520004,Krishna district, Andhra Pradesh, Editor :A.RAMAMOHANREDDY, RNI NO. APTEL/2011/41440, Phone No. Cell : 9502116677

# ప్రపంచ మత్తు వైద్యుల దినోత్సవం



ప్రజాభూమి ప్రతినిధి–రామచంద్రపురం

అక్టోబర్ 16 వ తారీఖున ప్రపంచంలో మొట్టమొదటిసారి మత్తు వైద్యం ఇచ్చిన రోజు అని రామచంద్రపురం ఏరియా ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ ఎస్.ప్రవీణ్ అన్నారు. ఈమేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.విలియం మూర్తన్ ఈథర్ అనే మత్తు మందుని మెడలోని కనిత తీయడం కొరకు 1846 లో అక్టోబర్ 16వ తారీఖున ఉపయోగించారని,మత్తుమందు మూడు రకాలు ఆపరేషన్ సమయంలో మత్తు వైద్యుని పాత్ర చాలా కీలకమని పేర్కొన్నారు.శరీరం మొత్తం ఇచ్చే మత్తు దీనిని జనరల్ ఎనస్తీసియా అంటారని, బొడ్డు కింద భాగంలో అవయవములపై చేయు ఆపరేషన్ లకు స్పైనల్ అనస్థీషియా ఇచ్చి ఆపరేషన్ చేయడం జరుగుతుందన్నారు. శరీరంపై ఉన్న చిన్న కనితలు మరియు చిన్న గాయములకు లోకల్ అనస్తీసియా ఇచ్చి ఆపరేషన్ చేయడం జరుగుతుందని,ఈ మత్తు మందు కూడా ఎలర్జీ మరియు రియాక్షన్ వచ్చి ప్రాణాపాయం కూడా సంభవించవచ్చున్నారు కావున రోగులు ఆపరేషన్ కొచ్చి సమయంలో మత్తు వైద్యునికి తప్పకుండా తమకు ఎలర్జీ వచ్చి మందులు ముందుగా తెలియ జేయలని అన్నారు. ఆపరేషన్ కి సిద్ధపడిన రోగులు కనీసం 6 గంటల పాటు ఏమి కడుపు ద్వారా తినడం గానీ తాగడం గాని చేయకూడదని ఎందుకంటే మత్తు ఇచ్చిన తర్వాత కడుపులో ఉన్న ఆహార పదార్థాలు గొంతు లోనికి వచ్చే ప్రమాదం ఉన్నది పేర్కొన్నారు. తర్వాత అవి ఊపిరి తీసుకొని కొట్టడం ద్వారా ఊపిరితిత్తులకు వెళ్లిపోయి ఊపిరాడక మత్తులోనే చనిపోయే అవకాశం కలదని తెలిపారు.గర్భిణీలు డెలివరీ వచ్చే సమయంలో నొప్పులు వచ్చినప్పుడు హాస్పిటల్ కి వచ్చినప్పుడు చాలామంది కడుపునిండా భోజనం చేసి హాస్పటల్ రావడం జరుగుతుందని ఇది చాలా ప్రమాదకరమని,ఇది మత్తువైద్యునికి ఇబ్బంది కావున ఆహారం ఏమి తీసుకోకుండా హాస్పటల్ కి రావలని సూచించారు. ఆపరేషన్ డేట్ డాక్టర్ ఇచ్చిన తర్వాత వేళ్ళకు గోరింటాకులు మరియు గోరులకు నెయిల్ పాలిష్ వంటివి వేసు కోకూడదన్నారు. వీటి వలన తమ పల్స్ రీడింగ్స్ మరియు ఆక్సిజన్ సచ్చిరేషన్ తప్పుగా చూపిస్తుంది. అది కూడా రోగులకు ప్రమాదమే.ఆపరేషన్ సక్సెస్ అయినప్పుడు క్షేమంగా ఆపరేషన్ జరగడానికి దాన్ని తెర వెనక ఉన్న హీరోలు మత్తు వైద్యులు, రోగి అపస్మారక స్థితిలో ఉన్నప్పుడు అతని ఊపిరి తిత్తులు మెదడు రక్తప్రసరణ అన్ని కూడా మత్తు వైద్యులు నియంత్రిస్తూ ఉంటారు కావున మత్తు వైద్యుని పాత్ర చాలా కీలకమని చెప్పారు.మత్తుమందు ఇచ్చాక మత్తు విరుగుడు కొరకు రోగి యొక్క రక్తం శాతం తొమ్మిది గ్రాములు కంటే ఎక్కువగ హిమోగ్లోబిన్ ఉండవలని పేర్కొన్నారు. రోగి తమ రక్తము తక్కువ ఉన్న ఎడల ఎనిమిక్ కండిషన్ పరిస్థితుల్లో మత్తు ఇవ్వడం కూడా చాలా ప్రమాదకరమని, గర్భిణీ స్త్రీలు గర్భం దాల్చిన నుండి తొమ్మిది నెలలు సమయం ఉన్నది కావున రక్తము చేరు ఆహారములు అధికంగా తినవలెను లేని యెడల ఆపరేషన్ చేసే సమయంలో కానీ డెలివరీ సమయంలో గానీ బయట నుండి రక్తం ఎక్కించుకునే పరిస్థితి రాకూడదని అన్నారు.ప్రపంచ మత్తు వైద్యుల దినోత్సవం సందర్భంగా అవగాహన కోసం ఈచూచనలు, సలహాలు తెలియజేయడం జరిగిందని డాక్టర్ ప్రవీణ్ పేర్కొన్నారు.

# రాజవొమ్మంగి జడ్పీటీసీ పీఠం.. తెర వెనుక ఎవరెవరు?

- కూటమి, వైసీపీ, సీపీఎం నుంచి కీలక నాయకులపై చర్చ
- అభ్యర్థుల ఎంపికపై ఉత్కంఠ.. నామినేషన్లతోనే అసలు చిత్రం స్పష్టం

ప్రజాభూమి ప్రతినిధి–రాజవొమ్మంగి

రాజవొమ్మంగి మండల జడ్పీటీసీ స్థానం చుట్టూ స్థానిక రాజకీయాల్లో ఆసక్తి పెరుగుతోంది. రానున్న ఎన్నికల్లో ప్రధాన పార్టీల తరఫున ఎవరు పోటీ చేస్తారు? ఎవరికి పార్టీ నాయకత్వం అవకాశం కల్పిస్తుంది? జడ్పీటీసీ పీఠాన్ని లక్ష్యంగా చేసుకుని ఎవరెవరు సిద్ధమవుతున్నారు? అనే ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీస్తున్నాయి. ముఖ్యంగా కూటమి, వైసీపీ, సీపీఎం నుంచి అభ్యర్థుల ఎంపిక ఎలా ఉండబోతోందన్న అంశంపై స్థానికంగా ఆసక్తి నెలకొంది.

**కూటమి నుంచి కీలక నాయకుడి పేరు!**

కూటమి తరఫున ఒక కీలక నాయకుడు పోటీ చేయవచ్చనే సమాచారం రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. అయితే ప్రచారంలో ఉన్న నాయకుడికే అవకాశం దక్కుతుందా? లేక పార్టీ నాయకత్వం మరో పేరును పరిశీలిస్తుందా? అన్నది ఇంకా స్పష్టతకు రాలేదు. అభ్యర్థి ఎంపికలో పార్టీ నిర్ణయంతో పాటు స్థానిక రాజకీయ పరిస్థితులు, ప్రజలతో నాయకుడికి ఉన్న సంబంధాలు వంటి అంశాలు ప్రాధాన్యం పొందే అవకాశం ఉంది. అధికారిక ప్రకటన వెలువడితేనే ఈ అంశంపై స్పష్టత వస్తుంది.

**సీపీఎం నుంచి మరో కీలక నాయకుడు?**

సీపీఎం తరఫున కూడా రాజవొమ్మంగి మండలానికి చెందిన ఒక కీలక నాయకుడు పోటీకి దిగవచ్చనే సమాచారం చర్చలో ఉంది. ప్రజల్లో గుర్తింపు ఉన్న నాయకుడిగా ఆయన పేరు వినిపిస్తున్నప్పటికీ, అభ్యర్థిత్వంపై అధికారిక ధ్రువీకరణ రావాల్సి ఉంది. ఆ పార్టీ ఎవరిని ఎంపిక చేస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. కూటమి, సీపీఎం నుంచి అభ్యర్థుల ప్రకటనలు వెలువడితే పోటీకి సంబంధించిన రాజకీయ సమీకరణాలపై మరింత స్పష్టత ఏర్పడుతుంది.

**వైసీపీ అభ్యర్థి ఎవరన్నదే మరో ప్రశ్న**

ఈ రెండు పార్టీలతో పాటు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిర్ణయంపైనా దృష్టి నెలకొంది. స్థానిక నాయకత్వంలో ఎవరికి అవకాశం దక్కుతుంది? ప్రజలకు పరిచయమున్న నాయకుడిని ఎంపిక చేస్తారా? లేక పార్టీ మరో పేరును తెరపైకి తీసుకొస్తుందా? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. వైసీపీ అభ్యర్థి ఎంపిక వెలువడిన తర్వాతే మూడు పార్టీల తరఫున పోటీ చేసే నాయకుల వివరాలు పూర్తిస్థాయిలో తెలుస్తాయి.

**పీఠం కోసం పోటీ.. ప్రజలకు కావాల్సింది ఏమిటి?**

జడ్పీటీసీ పదవి కోసం పోటీ పడే నాయకులెవరన్నదానితో పాటు, మండల అభివృద్ధికి వారు ఏం చేయగలరన్నది కూడా ముఖ్యమే. గ్రామీణ రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యా వైద్య సదుపాయాలు, గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతులు వంటి అంశాలపై అభ్యర్థుల వైఖరి ప్రజలకు తెలియాలి. ఎన్నికల సమయంలో ఇచ్చే హామీలకు, ఎన్నికైన తర్వాత చేపట్టే పనులకు మధ్య సంబంధం ఏమిటన్నది కూడా పరిశీలించాల్సిన అంశం.ప్రజా సమస్యలపై స్పందించడం, అభివృద్ధి పనుల కోసం సంబంధిత అధికారులతో సమన్వయం చేయడం, గ్రామాల అవసరాలను పాలనా వ్యవస్థ దృష్టికి తీసుకెళ్లడం వంటి బాధ్యతలు ప్రజాప్రతినిధికి ఉంటాయి. అందువల్ల అభ్యర్థుల ఎంపికతో పాటు వారి ప్రజా కార్యక్రమాలు, అభివృద్ధిపై ప్రణాళికలు కూడా చర్చకు రావాల్సిన అవసరం ఉంది.




**ప్రచారానికి, అధికారిక ప్రకటనకు తేడా ఉంది**

ప్రస్తుతం వినిపిస్తున్న పేర్లను ఖరారైన అభ్యర్థులుగా పేర్కొనలేం. పార్టీల అధికారిక ప్రకటనలు, నామినేషన్ల దాఖలు, ఎన్నికల అధికారుల వద్ద నమోదయ్యే వివరాలే పోటీలో ఉన్న అభ్యర్థులపై స్పష్టతనిస్తాయి. ఆ ప్రక్రియ పూర్తయ్యే వరకు రాజకీయ చర్చలను నిర్ధారిత వాస్తవాలుగా చూపించడం సమంజసం కాదు.రాజవొమ్మంగి జడ్పీటీసీ స్థానం నుంచి కూటమి ఎవరిని బరిలోకి దించుతుంది? సీపీఎం తరఫున వినిపిస్తున్న పేరు ఖరారవుతుందా? వైసీపీ ఎవరికి అవకాశం కల్పిస్తుంది? ఈ ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉంది. అభ్యర్థుల ప్రకటనల అనంతరం వారి రాజకీయ నేపథ్యం, ప్రజా కార్యక్రమాలు, స్థానిక సమస్యలపై వైఖరిని పరిశీలిస్తేనే పోటీకి సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడవుతాయి.ప్రస్తుతం రాజవొమ్మంగి రాజకీయాల్లో ప్రధానంగా చర్చకు వస్తున్న అంశం అభ్యర్థుల ఎంపికే. అధికారిక ప్రకటనలు వెలువడినప్పుడు ఎవరు నిజంగా బరిలో ఉన్నారన్నది తేలనుంది. అప్పటివరకు ప్రచారంలో ఉన్న పేర్లపై ఆసక్తి కొనసాగుతున్నా, తుది నిర్ణయాల కోసం వేచి చూడాల్సిందే.

## ఎంపీటీసీ స్థానాల రిజర్వేషన్లు ఖరారు

–గంగవరం మండలంలో ఏడు ఎంపీటీసీ స్థానాలకు రిజర్వేషన్ల ప్రకటన

ప్రజా భూమి ప్రతినిధి–గంగవరం

పోలవరం జిల్లా గంగవరం మండలంలోని ఎంపీటీసీ సభ్యుల స్థానాలకు రిజర్వేషన్లు ఖరారయ్యాయి మండల ప్రజా పరిషత్ కార్యాలయం విడుదల చేసిన ప్రకటన ప్రకారం ఏడు ఎంపీటీసీ స్థానాలకు కేటగిరీల వారీగా రిజర్వేషన్లు ప్రకటించారు రిజర్వేషన్ల వివరాలు ఇలా ఉన్నాయి.అముదాలబంద ఎస్టీ మహిళ,లక్కొండ అన్‌రిజర్వుడ్ జనరల్,మర్రిపాలెం ఎస్టీ జనరల్,మోహనాపురం ఎస్టీ జనరల్,మొల్లేరు ఎస్టీ మహిళ నెల్లిపూడి ఎస్టీ జనరల్ (ST-G సూరంపాలెం అన్‌రిజర్వుడ్ మహిళ (UR-W)రిజర్వేషన్ల ప్రకటనతో ఆయా ప్రాంతాల్లో స్థానిక సంస్థల ఎన్నికలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది అభ్యర్థులు తమ పోటీ అవకాశాలపై సమాలోచనలు ప్రారంభించే అవకాశం ఉంది

## అభ్యర్థుల ఎంపికపై అధిష్ఠానానిదే తుది నిర్ణయం

–కూటమితో కలిసే స్థానిక సంస్థల ఎన్నికలు: ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు



ప్రజాభూమి ప్రతినిధి–తాళ్లపూడి

స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల ఆధారంగా పోటీకి ఆసక్తి చూపుతున్న వారి పేర్లను సేకరించి అందిస్తే పార్టీ అధిష్ఠానం అభ్యర్థులను ఎంపిక చేస్తుందని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. తాళ్లపూడి మండల టీడీపీ అధ్యక్షుడు సిద్ధా దుర్గాప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు.కొవ్వూరు నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు శివ ప్రసాద్, ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్ పాల్గొన్న ఈ సమావేశంలో వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తల నుంచి ఆశావహుల పేర్లను సేకరించారు. కూటమి భాగస్వామ్య పార్టీలతో చర్చించి సీట్ల కేటాయింపు, అభ్యర్థుల ప్రకటన ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మరోవైపు, మండలంలో పార్టీ వర్గాల మధ్య ఉన్న విభేదాలను ముందుగా పరిష్కరించిన తర్వాత అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారించాలని కొందరు నాయకులు అభిప్రాయపడ్డారు. కొన్ని గ్రామాల నుంచి పార్టీ వర్గీయులు సమావేశానికి హాజరుకాకపోవడం కూడా చర్చనీయాంశమైంది. సమావేశంలో కొంత గందరగోళం ఏర్పడడంతో ఎమ్మెల్యే సర్ది చెప్పడం జరిగింది.

## తొలి రోజు రెండు నామినేషన్లు

–అభ్యర్థులు తేలక మందగించిన నామినేషన్లు



ప్రజాభూమి ప్రతినిధి–రామచంద్రపురం.

స్థానిక సంస్థల ఎన్నికల సమరం మొదలైనప్పటికీ, నామినేషన్లు ఘట్టంలో తొలి రోజు మాత్రం ఎలాంటి సందడి లేకుండా కేవలం రెండు నామినేషన్లు దాఖల లయ్యాయి .దీంతో మొదటి రోజు నామినేషన్లు స్వీకరణ ప్రశాంతంగా ముగిసింది. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం శుక్రవారం నామినేషన్ ప్రక్రియ అధికారకంగా ప్రారంభమైనప్పటికీ ముఖ్యంగా ప్రధాన పార్టీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన 6 వార్డు అభ్యర్థిగా చోడే భాను భాస్కర్,20 వ వార్డు నుంచి వాడపర్తి రామదుర్గా ప్రసాద్ లు తమతమ నామినేషన్లు దాఖలు చేశారు.మొదటి రోజు కావడంతో ఎన్నికల అధికారులు కార్యాలయాల్లో వేసి చూసినప్పటికీ, ఇద్దరు మినహా అభ్యర్థులెవరూ రాకపోవడంతో నామినేషన్ల సందడి కనిపించలేదు. రానున్న రెండు రోజుల్లో పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించిన తర్వాతే నామినేషన్ల ప్రక్రియ వేగం పుంజుకునే అవకాశం ఉంది. శనివారం ప్రధాన పార్టీలైన వైకాపా, కూటమి పార్టీలకు చెందిన అభ్యర్థులు అధికసంఖ్యలో నామినేషన్లు దాఖలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.

# ఆపరేషన్ త్రిశూల్ తో మహిళలకు యువతలో చైతన్యం

## పోలవరం జిల్లా కలెక్టర్ కె గణేష్ కుమార్

ప్రజా భూమి ప్రతినిధి–రంపచోడవరం

మహిళలు,బాలికల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ,రహదారి ప్రమాదాల నివారణతో పాటు మాదకద్రవ్యాల నిర్మూలనకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ పేర్కొన్నారు.శుక్రవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో ఆపరేషన్ త్రిశూల్‌కు సంబంధించి జిల్లా సమీక్ష సమావేశం పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్, పోలవరం జిల్లా సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ కె.చక్రవర్తి, జిల్లా జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్, ఓ ఎస్ డి జావలి, సబ్ కలెక్టర్లు డి. పృధ్వీరాజ్ కుమార్,నరేంద్ర పడల్, డీఎస్పీలు అశ్రఫ్ అలీ, పావని నిర్వహించారు.ఈ సందర్భంగా పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ మాట్లాడుతూ మహిళలు, బాలికలపై జరిగే వేధింపులను అరికట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని,బాధితులకు తక్షణ సహాయం అందేలా చూడాలని కలెక్టర్ తెలిపారు.అత్యవసర పరిస్థితుల్లో 112 హెల్ప్‌లైన్‌ను వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు.రహదారి ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని,మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం, హెల్మెట్ ధరించకపోవడం వంటి ప్రమాదకర చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన పేర్కొన్నారు.రోడ్డు భద్రతపై పోలీసు,రవాణా శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని,యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేలా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై పోలవరం జిల్లాలోని విద్యా సంస్థల్లో విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు.ప్రజల భద్రత, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం లక్ష్యంగా అన్ని సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని, క్షేత్రస్థాయిలో చేపట్టిన చర్యలను నిరంతరం పర్యవేక్షిస్తూ మెరుగైన ఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ అధికారులకు సూచించారు.పోలవరం జిల్లాలో రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో రహదారుల అనుసంధానం పెరిగింది. ముఖ్యంగా జాతీయ రహదారుల నిర్మాణం వల్ల ప్రయాణాలు సులభతరమయ్యాయని అదే విధంగా జిల్లాలో రోడ్డు ప్రమాదాలు కూడా పెరుగుతుండటం జరుగుతుందని గత ఆరు నెలలుగా జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను పరిశీలిస్తే,ముఖ్యంగా జాతీయ రహదారులపై ప్రమాదాల సంఖ్య పెరుగుతున్నట్లు ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్లను గుర్తించి, వాటి నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలనీ కలెక్టర్ తెలిపారు.జాతీయ రహదారుల అనుసంధానం మెరుగుపడటంతో వాహనదారులు వేగంగా ప్రయాణించడం, రహదారులు ఎంత మెరుగ్గా ఉన్నప్పటికీ, అతివేగం ప్రాణాలకు ప్రమాదకరంగా మారుతుందని ఆయన అన్నారు.వేగ నియంత్రణ, ట్రాఫిక్ నిబంధనల అమలు, ప్రమాదకర ప్రాంతాల్లో ముందస్తు హెచ్చరిక బోర్డుల ఏర్పాటు చెయ్యాలని ఆయన తెలిపారు.ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందనీ మద్యం సేవించి వాహనం నడపడం వల్ల కలిగే పరిణామాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలి. పోలీసు, రవాణా, వైద్య,గిరిజన సంక్షేమ శాఖలు సమన్వయంతో పనిచేయాలనీ ఆయన తెలిపారు. ఆశ్రమ పాఠశాలలలో గురుకుల పాఠశాలలలో మహిళలపై జరిగే అగ్రైత్యాలపై ఎక్కడికక్కడ అవగాహన కల్పించాలని ఆయన అన్నారు ప్రతినెల ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలలో గురుకుల పాఠశాలలలో ఐసిడిఎస్, పోలీస్, విద్యాశాఖ అధికారులు ఎప్పటికప్పుడు పర్యటించి అఘాయిత్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన తెలిపారు. 18 సంవత్సరాల నిండకుండా ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగిన వెంటనే కేసులు నమోదు చేయాలని ఆయన అన్నారు. పోలవరం జిల్లాలో గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దే బాధ్యత మనందరిపై ఉందని ఆయన అన్నారు. గంజాయి వ్యాపారం చేసిన వ్యక్తులపై కేసులు నమోదు చేసి మరలా వ్యాపారం చేయకుండా వారి ఆస్తులను జప్తు చేయాలని ఆయన అన్నారు. గంజాయి వ్యాపారం నిర్మలించే విధంగా గంజాయి వ్యాపారం మానివేసిన వ్యక్తులకు జీవనోపాదులు కల్పించే విధంగా తగు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. మారేడుమిల్లి చింతూరు మధ్యగల ఘాట్ రోడ్ భద్రత ప్రమాణాలు పక్కాగా చేపట్టాలని ఆయన అన్నారు. భారీ వాహనాలు అధిక లోడ్లతో వెళ్లిన వాటిని గుర్తించి కేసులు నమోదు చేయాలని అదేవిధంగా ఈ ప్రాంతంలోనే భారీ వాహనాలు భారీ లోడ్లతో వెళుతున్న వాటిని తూకాలు వేయించే విధంగా వేయింగ్ బ్రిడ్జిలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులు ఆయన ఆదేశించారు. పోలవరం జిల్లాలోని నేషనల్ హైవేలో ఎక్కడైనా ప్రమాదాలు సంభవించిన ఎడల 1033 టోల్ ఫ్రీ నెంబర్ కు సంప్రదించే విధంగా అవగాహన కల్పించాలని అదేవిధంగా నేషనల్ హైవే పరిధిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులను సంప్రదించే విధంగా 108 కు సంప్రదించాలని అదేవిధంగా ఎక్కడికి అక్కడ ప్రజలకు రోడ్డు ప్రమాదాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆయన అన్నారు. నేషనల్ హైవేకు సంబంధించిన ఎన్ఫోర్స్మెంట్ టీములు పక్కాగా విధులు నిర్వహించాలని ఆయన అన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ చేసిన వారిని గుర్తించి ఎక్కడికక్కడ కేసులు నమోదు చేయాలని ఆయన అన్నారు. పోలవరం జిల్లాలోని మహిళ సంఘాల ద్వారా ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్లు ఐ ఎస్ ఐ బ్రాండ్లు కలిగినవి కొనుగోలు చేసే విధంగా అవగాహన కల్పించాలని ఆయన అన్నారు. పోలవరం జిల్లాలో ఇప్పటివరకు హిట్ అండ్ డ్రైవ్ కేసులు ఎన్ని నమోదు చేసింది ఆయన ఆరా తీశారు.పోలవరం జిల్లా సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ కె.చక్రవర్తి మాట్లాడుతూ పోలవరం జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు మనం ఆచరణాత్మకమైన పరిష్కారాలను గుర్తించాలనీ మన ప్రధాన లక్ష్యం కేవలం ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడం మాత్రమే కాదు. ప్రమాదాలు జరగకుండా ముందస్తు నివారణ చర్యలు చేపట్టడం కూడా అంతే ముఖ్యం అని ఆయన తెలిపారు. అతివేగం,మద్యం సేవించి వాహనాలు నడపడం,రహదారి భద్రతపై అవగాహన లేకపోవడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలనీ ఆయన తెలిపారు.రోడ్డు ప్రమాదాల నివారణ అనేది ఒక్క శాఖకు మాత్రమే సంబంధించిన బాధ్యత కాదనీ పోలీసు శాఖ,రవాణా శాఖ, విద్యాశాఖ, వైద్య ఆరోగ్య శాఖ, గిరిజన సంక్షేమ శాఖతో పాటు సంబంధిత అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలనీ ఎస్పి తెలిపారు. ముఖ్యంగా కళాశాల విద్యార్థులు, యువతలో రోడ్డు భద్రతపై అవగాహన పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలనీ ప్రమాదాలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని సేకరించి,ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించాలనీ .ఆ సమాచారాన్ని విశ్లేషించి, సమస్యకు తగిన పరిష్కారాలను రూపొందించాలనీ సంబంధిత అధికారులను సూచించారు. అదేవిధంగా ఆపరేషన్ త్రిశూల్ వాల్పోస్టర్ను ముఖ్య అతిథులు ఆవిష్కరించారు అదేవిధంగా ఆపరేషన్ త్రిశూల్ కు సంబంధించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి జీ. భాస్కర్,గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మండయ్య,డి సి హెచ్ ఎస్ సాంబశివరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామ్మోహన్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి దేవదానం, పీహెచ్ఓ నరేంద్ర కుమార్,జిల్లా విద్యాశాఖ అధికారి జి. శ్రీరామ్ మూర్తి, డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్. దాసరి రత్నాకర్ రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఐ. శ్రీనివాసరావు, రవికుమార్, సిపిఓ వెంకట్రావు,ఆర్టీవో రాజేష్ కుమార్, ఏ ఈ డి సావిత్రి, సిడిపిఓ క్రాంతి కుమారి, డి ఎల్ పి ఓ ఎర్రం శెట్టి రాజు, డాక్టర్ నీలిమ,డి ఇ ఒ భవాని,పి వెంకటరమణ, రమేష్, రామచంద్రమూర్తి, సర్కిల్ ఇన్స్పెక్టర్లు, నేషనల్ హైవే అథారిటీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



ప్రజాభూమి

జనరల్ 14

శనివారం 17 అక్టోబరు 2026


# మచిలీపట్నం నగరపాలక సంస్థ ఎన్నికలు

- తొలిరోజు 13 మంది కార్పొరేటర్లుగా నామినేషన్ల దాఖలు..
- ప్రారంభం రోజు మేయర్ పదవికి దాఖలు కానీ నామినేషన్

ప్రజాభూమిప్రతినిధి-మచిలీపట్నం

నగరపాలక సంస్థ ఎన్నికల నేపథ్యంలో కార్పొరేటర్ పదవులకు నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. తొలిరోజు మొత్తం 13 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున ఎనిమిది మంది, తెలుగుదేశం పార్టీ తరపున ముగ్గురు, భారతీయ జనతా పార్టీ తరపున ఒకరు, స్వతంత్ర అభ్యర్థిగా ఒకరు



నామినేషన్లు సమర్పించారు.

**డివిజన్ల వారీగా నామినేషన్ల వివరాలు:**

1వ డివిజన్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున ఒకరు, 14వ డివిజన్‌లో ఒకరు, 29వ డివిజన్‌లో ఇద్దరు నామినేషన్లు దాఖలు చేశారు. 33వ డివిజన్‌లో తెలుగుదేశం పార్టీ తరపున ఒకరు, స్వతంత్ర అభ్యర్థిగా మరొకరు నామినేషన్ సమర్పించారు. 35వ డివిజన్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున ఒకరు, 41వ డివిజన్‌లో ఒకరు, 45వ డివిజన్‌లో భారతీయ జనతా పార్టీ తరపున ఒకరు నామినేషన్ దాఖలు చేశారు. 52వ డివిజన్‌లో తెలుగుదేశం పార్టీ తరపున ఒకరు, 55వ, 56వ డివిజన్లలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున ఒక్కొక్కరు, 57వ డివిజన్‌లో తెలుగుదేశం పార్టీ తరపున ఒకరు నామినేషన్లు సమర్పించారు. తొలిరోజు నామినేషన్ల ప్రక్రియలో ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్ర అభ్యర్థి కూడా బరిలో నిలిచారు. తొలి రోజు మచిలీపట్నం నగరపాలక సంస్థ మేయర్ అభ్యర్థిగా ఒక్కరు కూడా నామినేషన్ దాఖలు చేయలేదు.

# జడ్డంగి వద్ద రోడ్డు ప్రమాదం.. ఏఆర్ ఎస్సై మృతి

### స్విఫ్ట్ కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలు.. ఆసుపత్రికి తరలిస్తుండగా విషాదం

ప్రజా భూమి ప్రతినిధి-రాజవొమ్మంగి

రాజవొమ్మంగి మండలం జడ్డంగి పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏపీఎస్పీ ఏఆర్ ఎస్సై బెజ్జి మన్మధరావు (52) మృతి చెందారు. విధులు నిర్వహిస్తున్న ప్రాంతం నుంచి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా ఎదురుగా వచ్చిన కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పలమేట్ట గ్రామానికి చెందిన బెజ్జి మన్మధరావు జడ్డంగి పోలీస్ స్టేషన్ పరిధిలోని డి కంపెనీ అవుట్‌పోస్టులో ఏఆర్ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్నా రు. శుక్రవారం ఉదయం చెరువుకుంపాలెం గ్రామానికి వెళ్లి, అక్కడి నుంచి తన హోండా యాక్టివా ద్విచక్ర వాహనంపై జడ్డంగి వైపు తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో మధ్యాహ్నం సుమారు 12.10 గంటల సమయంలో సత్తిబాబు చికెన్ షాపు సమీ పానికి చేరుకోగానే, ఎదురుగా అడ్డతీగల వైపు వెళ్తున్న మారుతి సుజుకి స్విఫ్ట్ కారు ఆయన వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మన్మధరావుకు రెండు కాళ్లకు తీవ్ర గాయాలతో పాటు నుదుటి కుడివైపు గాయమైంది. వెంటనే మెరుగైన వైద్యం కోసం కాకినాడలోని మెడికవర్ ఆసుపత్రికి తరలిస్తుండగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విధుల్లో ఉన్న పోలీసు అధికారి రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం విషాదాన్ని నింపింది.

# ఎంపీటీసీగా అవకాశం ఇస్తే పూడిమడక అభివృద్ధికి కృషి చేస్తా

### -టీడీపీ సీనియర్ నేత పోన్నమళ్ళ కొండబాబు

ప్రజా భూమి ప్రతినిధి-అచ్యుతాపురం



పూడిమడక సెగ్మెంట్-1 పరిధిలో ఎంపీటీసీగా అవకాశం కల్పిస్తే, ప్రాంత సమగ్ర అభివృద్ధికి అంకితభావంతో కృషి చేస్తానని టీడీపీ సీనియర్ నేత పోన్నమళ్ళ కొండబాబు తెలిపారు. శుక్రవారం అచ్యుతాపురంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 20 ఏళ్లుగా తెలుగుదేశం పార్టీకి నిస్వార్థంగా సేవలందిస్తున్నానని కొండబాబు పేర్కొన్నారు. ఈ క్రమంలో పార్టీలో పలు బాధ్యతలు నిర్వహించినట్లు తెలిపారు. 2009లో టీడీపీ మండల బీసీ సెల్ అధ్యక్షుడిగా, 2014లో నియోజకవర్గ తెలుగునాడు ట్రేడ్ యూనియన్ (టీఎన్‌టీయూసీ) అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించానని వివరించారు. 2019 నుంచి ప్రస్తు తం వరకు జిల్లా టీఎన్‌టీయూసీ కార్యదర్శిగా కొనసాగుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నా నని తెలిపారు. పార్టీ అధిష్ఠానం తీసుకునే నిర్ణయాలకు కట్టుబడి ఉంటానని, కూటమి ప్రభుత్వ విజయానికి, తెలుగుదేశం పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. పూడిమడక ప్రాంత ప్రజల ఆశీస్సులు, మీడియా మిత్రుల సహకారం ఎల్లప్పుడూ తనకు ఉండాలని ఈ సందర్భంగా కొండబాబు కోరారు.

# పోలవరం నిర్వాసితులకు భూముల కేటాయింపుపై కదలిక

### నిర్వాసితుల పునరావాసానికి భూముల సేకరణపై అధికారుల దృష్టి రైతుల భూముల పరిశీలన

ప్రజా భూమి ప్రతినిధి-గంగవరం

పోలవరం ప్రాజెక్టు కారణంగా నిర్వాసితులైన కుటుంబాలకు భూములు కేటాయించి, వారి పునరావాసానికి మార్గం సుగమం చేసే దిశగా గంగవరం మండలంలో భూముల కొనుగోలు ప్రక్రియపై అధికారులు దృష్టి సారించారు నిర్వాసితులకు భూముల కేటాయింపునకు అవసరమైన భూములను గుర్తించే క్రమంలో భాగంగా జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శుక్రవారం మండలంలోని రైతుల భూములను క్షేత్రస్థాయిలో మరోసారి పరిశీలించారు ఈ ప్రక్రియ ముందుకు సాగితే భూముల కేటాయింపునకు అవసరమైన చర్యలకు తోడ్పాటు లభించనుంది భూములు విక్రయించేందుకు ఆసక్తి ఉన్న రైతులు సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారుల (వీఆర్వో) ద్వారా రెవెన్యూ శాఖకు తమ భూముల వివరాలు అందించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూచించారు భూముల వివరాల పరిశీలన, కొనుగోలు ప్రక్రియకు అవసరమైన పత్రాలను సమర్పించాలని తెలిపారు.

రైతులు ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు, పట్టాదారు పాస్ పుస్తకం, అడంగల్ తదితర భూమి సంబంధిత పత్రాలను దరఖాస్తుకు జతచేసి అందించాల్సి ఉంటుందని పేర్కొన్నారు భూముల విక్రయానికి ముందుకొచ్చే రైతులు అవసరమైన పత్రాలను సిద్ధం చేసుకుని సంబంధిత వీఆర్వోలను సంప్రదించాలని సూచించారు ఈ కార్యక్రమంలో వీఆర్వో వెంకన్న, వీఆర్ఏ, పలువురు రైతులు, మాజీ సర్పంచ్ మడకం బాబురావు తదితరులు పాల్గొన్నారు

# అనుమానంతో భార్యను హత్య చేసిన భర్తకు జీవిత ఖైదు

### ముగ్గురు పిల్లలకు తక్షణ పరిహారం అందించాలని డీఎల్ఎస్ఏకు కోర్టు ఆదేశాలు



ప్రజా భూమి ప్రతినిధి-అడ్డతీగల

భార్యపై అనుమానంతో ఆమెను హత్య చేసిన భర్తకు రాజమహేంద్రవరంలోని ఎనిమిదో అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు జీవిత ఖైదు విధించింది. నిందితుడికి రూ.3,000 జరిమానా కూడా విధిస్తూ అక్టోబర్ 15న తీర్పు వెలువరించింది. పోలవరం జిల్లా, రంపచోడవరం సబ్ డివిజన్, అడ్డతీగల సర్కిల్ పరిధిలోని దుచ్చెర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో వంగలమడుగు గ్రామానికి చెందిన మడకం జోజగి దొర (49) తన భార్య మడకం విజయకుమారిని 2025లో అనుమానంతో వారి నివాసం వద్ద పిల్లల సమక్షంలో హత్య చేసినట్లు పోలీసుల వివరాలు వెల్లడించాయి. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మృతురాలి సోదరుడు పరదా కన్నయ్య దొర ఇచ్చిన ఫిర్యాదు మేరకు దుచ్చెర్తి పోలీసులు 2025 జూలై 10న క్రైం నంబర్ 13/2025, బీఎన్ఎస్ సెక్షన్ 103(1) కింద కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ బి. నరసింహమూర్తి దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్టు చేశారు. అనంతరం రాజమహేంద్రవరంలోని మహిళలపై నేరాల విచారణకు సంబంధించిన ప్రత్యేక కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణ అనంతరం న్యాయమూర్తి బి. నిర్మల నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.3,000 జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. తల్లిని కోల్పోయిన ముగ్గురు పిల్లలకు తక్షణ పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ)ను కోర్టు ఆదేశించింది. ఈ కేసులో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ తుమ్మల వాసు లక్ష్మి వాదనలు వినిపించారు. జిల్లా ఎస్పీ కే. చక్రవర్తి ఐపీఎస్ పర్యవేక్షణలో రంపచోడవరం డీఎస్పీ అష్రఫ్ అలీ, కోర్టు మానిటరింగ్ సెల్ ఇన్‌స్పెక్టర్ ఎం. ముక్తేశ్వరరావు, అడ్డతీగల ఇన్‌స్పెక్టర్ ఎం. గజేంద్ర కుమార్, దుచ్చెర్తి ఎస్ఐ కె. పార్థసారథి, పోలీసు సిబ్బంది, కోర్టు కానిస్టేబుల్ హెచ్‌సీ 2988 కె. మాధవరావు సమన్వయంతో పనిచేశారు. సాక్షులను సకాలంలో కోర్టుకు హాజరుపరచడంలో కీలక పాత్ర పోషించిన సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

# ఎన్నికల విధులను బాధ్యతాయుతంగా, సమన్వయంతో నిర్వహించాలి

- ఎంపీటీసీ, జెడ్పీటీసీ, పురపాలక సంఘాల ఎన్నికల నిర్వహణపై నోడల్ అధికారులకు దిశానిర్దేశం
- జిల్లా కలెక్టర్ ఎం.ఎస్. హరేంధిర ప్రసాద్

ప్రజాభూమి ప్రతినిధి-కాకినాడ

జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, పురపాలక సంఘాల ఎన్నికల నిర్వహణకు సంబంధించి నోడల్ అధికారులు తమకు కేటాయించిన విధులు, బాధ్యతలను పూర్తి అవగాహనతో, సమన్వయంతో, జవాబు దారీతనంతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం. ఎస్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం కాకినాడ కలెక్టరేట్‌లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, పురపాలక సంఘాల ఎన్నికల నిర్వహణకు సంబంధించి నోడల్ అధికారులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎన్నికల ప్రక్రియలో ప్రతి అంశాన్ని నిర్దేశిత కాల పరిమితిలో పూర్తి చేస్తూ, ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గ దర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. నోడల్ అధికారులకు అప్పగిం చిన పనులు పూర్తి సమర్థతతో నిర్వహించాలన్నారు. క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షిం చాలని సమస్యలు ఉన్నట్లయితే జిల్లా కలెక్టర్ దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలని స్పష్టం చేశారు.. పోలింగ్ కేంద్రాల వారిగా ఓటర్ల జాబితాలు విభజిం చాలని అదేవిధంగా ఏ ఎస్ డి కాపీని, మార్క్డ్ కాపీని రూపొందిం చాలని, ఓటర్ స్లిప్పులను ప్రింట్ చేయించి ఓటర్లకు పంపిణీ చేయాలన్నారు. నామినేషన్ల ఉపసంహరణ పూర్తయిన తదుపరి పోటీలో ఉన్న అభ్యర్థుల గుర్తులు కేటాయించి బ్యాలెట్ పేపర్ల ముద్రణ చేపట్టాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ర్యాంపు, త్రాగునీరు మరుగుదొడ్డి విద్యుత్ సౌకర్యం రహస్య ఓటింగ్ కంపార్ట్మెంటు రూప కల్పనపై దృష్టి పెట్టాల న్నారు. పోలింగ్ ప్రక్రియ నిర్వహణకు 9,900 మంది ఉద్యో గులను నియమించడం జరి గిందన్నారు ఫ్లయింగ్ సర్వే లెన్స్ స్క్వాడ్ స్టాటిస్టికల్ సర్వే లెన్స్ స్క్వాడ్ లు నిర్దేశిత విధులు తనిఖీలు నిర్వహించాలన్నారు. ఎన్నికల నిర్వహణ సమన్వయం, ముందస్తు ప్రణాళిక, నిరంతర పర్యవేక్షణతో కూడిన బాధ్యతాయుత మైన ప్రక్రియ అన్నారు ఎన్నికలకు సంబం ధించిన వివిధ విభాగాల మధ్య సమర్థవంతమైన సమన్వయం ఉండాలని, ప్రతి నోడల్ అధికారి తనకు అప్పగించిన బాధ్యతల ను స్పష్టంగా అర్థం చేసుకుని కార్యాచరణ ప్రణాళిక రూపొం దించు కోవాలన్నారు. ఎన్నికల నిర్వహణలో ఎటువంటి పొరపాట్లకు, నిర్లక్ష్యానికి తావులేకుండా అప్రమత్తంగా వ్యవహరిం చాలని ఆదేశిం చారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన నియమ నిబంధనలు, మార్గ దర్శకాలు, విధివిధానాలపై నోడల్ అధి కారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నా రు ఎన్నికల సంఘం జారీ చేసే ఆదేశాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, వాటి ప్రకారం కార్యాచరణ చేప ట్టాలని తెలిపారు. ఎన్ని కల నిర్వహణలో ఎదు రయ్యే సమస్యలను, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుం టూ నిర్ణీత సమయంలో పరిష్క రించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల ప్రక్రియలో సిబ్బంది నియామకం, శిక్షణ, పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లు, ఎన్నికల సామగ్రి సమీకరణ, రవాణా, భద్రత, సమాచార వ్యవస్థ, ఫిర్యాదుల పరిష్కారం వంటి అంశాలపై సంబం ధిత నోడల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించా లన్నారు ప్రతి విభాగానికి సంబంధించిన పనుల పురోగతిని నిరంతరం సమీక్షిస్తూ, అవసరమైన



నివేదికలను సకాలంలో సమర్పించాలని ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తనా నియ మావళి అమలులో అధికారులు నిష్పాక్షికంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలకు సంబంధించిన ఫిర్యాదులపై నిర్దేశిత విధానంలో స్పందించాలని సూచిం చారు. ఎన్నికల నిర్వహ ణకు సంబంధించి అందే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా, వాటిని పరిశీలించి నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశిం చారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా సంబంధిత అధికారులు ముందస్తు తనిఖీలు నిర్వహించాలని సూచించారు. ఎన్నికల సామగ్రి పంపిణీ, స్వీకరణ, భద్రపరచడం వంటి అంశాల్లో నిర్దేశిత విధివిధానాలను పాటించాలన్నారు ఎన్నికల సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించి, వారికి కేటాయించిన విధులపై స్పష్టత కల్పించాల న్నారు. ఎన్నికల నిర్వహణలో రెవెన్యూ, పోలీసు, పంచాయతీ రాజ్, మున్సిపల్ పరిపాలన, రవాణా, సమాచార వ్యవస్థలు, ఇతర సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అవసరమైన ముందస్తు చర్యలు చేప ట్టాలని, ఎన్నికల సమ యంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవా లని సూచించారు. అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదు ర్కొనేందుకు అవసరమైన సమాచార వ్యవస్థను సిద్ధంగా ఉంచుకోవాల న్నారు. ప్రతి నోడల్ అధికారి తనకు కేటా యించిన విభాగానికి సంబంధించిన పనుల పురోగతిని రోజువారీగా పర్యవేక్షించాలని ఆదేశిం చారు. నిర్ణీత గడువుల్లో పనులు పూర్తి చేస్తూ, అవసరమైన నివేదికలను ఉన్నతాధి కారులకు సమర్పించాలన్నారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, నిష్పాక్షికత, జవాబుదారీతనం, సమ యపాలన ప్రధానమని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. నోడల్ అధికా రులు తమ బాధ్య తలను సమర్థవంతంగా నిర్వ ర్తిస్తూ, అన్ని విభాగాలను సమన్వయం చేసుకుని ఎన్నికల ప్రక్రియ సజా వుగా జరిగేలా కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కలిగించేలా, అర్హులైన ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డిఆర్ఓ డాక్టర్ డి తిప్పే నాయక్, నగరపాలక సంస్థ కమిష నర్ ఎన్ వివి సత్యనారా యణ, పెద్దాపురం ఆర్డీవో పి కృష్ణమూర్తి, సిపిఓ పి త్రినాథ్, బీసీ కార్పొరేషన్ ఈడీ ఏ శ్రీనివాసరావు, ఎస్ జి ఎస్ డబ్ల్యు నో డల్ అధికారి జే వేణు గోపాల్, జిల్లా విద్యాశాఖ అధికారి పి రమేష్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి జ్యోతుల రాము, జడ్పి సీఈఓ లక్ష్మణరావు, నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ సుధాకర్ జిజిహెచ్ నోడల్ అధికారి ఎన్ శ్రీధర్ , జి ఎం: డి ఐ సి సిహెచ్ గణపతి, తది తరులు పాల్గొన్నారు.

# అవగాహనతో విధులు నిర్వహించాలి

- ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, నిష్పాక్షికతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి.
- జిల్లా కలెక్టర్ ఎం ఎస్ హరేశీధిర ప్రసాద్.

ప్రజాభూమి ప్రతినిధి-కాకినాడ

ఎంపీటీసీ/జడ్పిటిసి ఎన్నికలను పారదర్శకంగా, నిష్పాక్షికంగా, ప్రశాం త వాతావరణంలో నిర్వహించేందుకు సంబంధిత అధికారులు ఎన్నికల సంఘం నిర్దే శించిన నియమ నిబంధనలను పూర్తి స్థాయిలో అవగాహన చేసుకుని బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ ఎం ఎస్ హరేశీధిర ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కలె క్టరేట్ నందు ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల నిర్వహణ సంబంధించి రిటర్నింగ్ అధికారులు సహాయ రిటర్నింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించా రు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు- 2026 నిర్వ హణకు సంబంధించి జిల్లాలో నియమితులైన రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులకు ఎన్నికల విధులు, బాధ్యతలు, ఎన్నికల నియమావళి, సంబంధిత రికార్డుల నిర్వహణ, ఎన్నికల సామగ్రి స్వీకరణ, భద్రపరచడం, పంపిణీ వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రసంగిస్తూ ఎన్ని కల నిర్వహణ లో ప్రతి దశ కీలకమైనందున, ఎన్నికల విధులకు నియమితులైన రిటర్నింగ్ అధికారులు సహాయ రిటర్నింగ్ అధికారులు ఎంపీడీవోలు ఎన్నికల మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ సమన్వయంతో పని చేయాలన్నారు. పోలింగ్ సిబ్బందికి రెండు దఫాలు శిక్షణను నిర్వహించి పోలింగ్ ప్రక్రియను పగడ్బందీగా నిర్వహించారు. నిష్పక్షపాతం నిజాయితీగా ఎన్నికల నిర్వహించి ప్రజా విశ్వాసాన్ని. నమ్మకాన్ని పొందాలన్నారు. ఎన్నికల ప్రక్రియలో ఎటువంటి అపనమ్మకానికి, పొరపాట్లకు, నిర్లక్ష్యానికి తావులేకుండా పనిచేయాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారుల పాత్ర అత్యంత కీలకమన్నారు ఎన్నికల నోటిఫికేషన్ నుంచి నామినేషన్ల స్వీకరణ, నామినేషన్ల పరిశీ లన, ఉపసంహరణ, అభ్య ర్థుల తుది జాబితా రూపకల్పన, పోలింగ్ నిర్వహణ, ఓట్ల లెక్కిం పు, ఫలితాల ప్రకటన వరకు ప్రతి దశలోనూ ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గ దర్శకాలను తప్పకుండా అమలు చేయాలని సూచిం చారు. నామినేషన్ల స్వీకరణ సమయంలో అభ్యర్థులు సమర్పించే పత్రాలను నిబంధనల ప్రకారం పరిశీలించాలని, నిర్ణీత గడువులు, విధి విధానాలను కచ్చితంగా పాటించాలని తెలిపారు. నామినేషన్ల పరిశీలన సమయంలో అర్హతలు, అనర్హతలకు సంబంధించిన నిబంధనలను పూర్తిగా అవగాహన చేసుకుని, సంబంధిత చట్టాలు, ఎన్నికల సంఘం మార్గదర్శకాల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. అభ్యర్థుల నామినేషన్ల అంగీకారం లేదా తిరస్కరణ విషయంలో నిబంధనలకు అనుగుణంగా వ్యవహరిం చడంతోపాటు అవసరమైన రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామగ్రిని ముందుగానే సిద్ధం చేసుకుని, వాటి స్వీకరణ, భద్రపరచడం, పంపిణీ ప్రక్రియలను పక్కాగా నిర్వహించాలన్నారు. బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు, చెరిగి పోని సిరా, పోలింగ్‌కు సంబంధించిన ఫారాలు, రిజిస్టర్లు, ఇతర ఎన్నికల సామగ్రిని నిర్దేశి త జాబితా చెక్ లిస్ట్ ప్రకారం సరఫరా చేయా లన్నారు ఎన్నికల సామగ్రి పంపిణీ సమయంలో సం బంధిత పోలింగ్ కేంద్రాలకు అవ సరమైన వస్తువులన్నీ సక్రమంగా చేరేలా ముందస్తు తని ఖీలు నిర్వహించాలని, సామగ్రి కొరత లేదా ఇతర సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.. రిటర్నింగ్ అధికారుల విధుల నిర్వ హణకు అవస రమైన హ్యాండ్‌బుక్‌లను సంబంధిత ఎంపీడీవో కార్యాలయాల నుండి స్వీకరించి వాటిని సంబంధిత రిటర్నింగ్ అధికారులకు అందజేసి, శిక్షణా కార్యక్రమంలో వాటి విని యోగంపై పరిపూర్ణమైన అవ గాహన కల్పించారన్నారు ఎన్నికల విధుల నిర్వహ ణలో హ్యాండ్‌బుక్‌లలోని సూచనలు, ఎన్నికల సంఘం జారీ చేసే తాజా ఆదేశాలను అనుసరిం చాలన్నారు.. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించా రు. ఎన్నికల ప్రక్రియలో పోటీ చేసే అభ్యర్థులు, రాజకీయ పార్టీలు నిబంధనలను పాటిం చేలా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వ యంత్రాంగం నిష్పాక్షికంగా వ్యవహరించాలని, ఏ అభ్యర్థికి లేదా రాజకీయ పార్టీకి అను కూలంగా వ్యవహరించరా దని స్పష్టం



చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియ మావళి ఉల్లంఘనలకు సంబంధించిన ఫిర్యా దులు అందిన పుడు వాటిని నిర్దేశిత విధా నంలో పరిశీలించి, నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించు కునేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణకు సమన్వయం ఎన్నికల నిర్వహణలో శాంతిభద్రతల పరిరక్షణ కు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులు సూచించారు.. పోలింగ్ కేంద్రాల వద్ద ప్రశాంత వాతావరణం నెలకొనేలా చర్యలు తీసుకోవడం తోపాటు, ఓటర్లకు ఎటువంటి ఒత్తిడి, ప్రలోభాలు లేదా ఆటం కాలు ఎదురు కాకుండా పర్య వేక్షించాలన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి వారి బాధ్య తలను స్పష్టంగా తెలియ జేసి, విధుల కేటాయింపు, సమయపాలన, సమాచా ర మార్పిడి వంటి అంశాల్లో ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని సూ చించారు. ఓట్ల లెక్కింపు సమయంలో పారదర్శ కతను పాటిస్తూ, ప్రతి దశలో అవసరమైన రికార్డులను సక్రమంగా నిర్వహించాల న్నారు. జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎన్నికల నిర్వ హణకు సంబంధించి నియమితులైన, ఆర్వోలు సహాయ ఆర్వోలు, ఎంపీ డీవోలు పరస్పర సమన్వ యంతో పనిచేస్తూ ఎన్ని కల ప్రక్రియను విజయవంతం చేయాలన్నారు. ఎన్నికల విధులకు సంబంధించిన సందే హాలను ముందుగానే నివృత్తి చేసుకుని, అవసరమైన మార్గదర్శ కాలను అనుసరిస్తూ ప్రతి దశలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికల నిర్వహణలో చిన్నపాటి నిర్లక్ష్యానికి కూడా అవకాశం ఇవ్వ కుండా, చట్టబద్ధత, పారదర్శకత, నిష్పాక్షికత, సమయపాలనకు ప్రాధాన్య తనిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని అధికారులు స్పష్టం చేశారు. ప్రజా స్వామ్య ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం పెంపొందించేలా, అర్హులైన ప్రతి ఓటరు స్వేచ్ఛగా తన ఓటు హక్కును విని యోగించుకునే వాతా వరణాన్ని కల్పిం చేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో సహాయ కలెక్టర్ కుమారి ప్రియ, జెడ్పి సీఈఓ లక్ష్మణ రావు, ఆర్డిఓ ఎస్ మల్లి బాబు, జడ్పీ డిప్యూటీ సీఎం శ్రీ లలిత ఎంపీ డీవోలు రిటర్నింగ్ సహా య రిటర్నింగ్ అధికా రులు తదితరులు పాల్గొన్నారు